PRAJAPAKSHAM ★

www.prajapakshem.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

2024, మార్చి 20 బుధవారం

హైదరాబాద్ | సంపుటి 26, సంచిక: 272, పేజీలు: 8
ఖమ్మం : 8+8, కరీంనగర్ : 8+8
మహబూబ్‌నగర్: 8, వెల రూ. 5.00

Published from: **Hyderabad**
**Khammam, Karimnagar, Mahabubnagar**






## గవర్నర్‌గా సిపి రాధాకృష్ణన్

**నేడు బాధ్యతల స్వీకరణ**

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ గవర్నర్‌గా సిపి రాధాకృష్ణన్‌కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బాధ్యతలు అప్పగించారు. తెలంగాణ గవర్నర్‌గా ఉన్న తమిళిసై సౌందరరాజన్ సోమవారం రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆమె తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించారు. తమిళిసై రాజీనామా లేఖను రాష్ట్రపతి ఆమోదించారు. దీంతో తెలంగాణతో పాటు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా సిపి రాధాకృష్ణన్‌కు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్రపతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన జార్ఖండ్ గవర్నర్‌గా ఉన్నారు. తెలంగాణకు పూర్తి స్థాయిలో గవర్నర్‌ను నియమించే వరకూ రాధాకృష్ణన్ గవర్నర్‌గా

తరువాయి 2లో



## 2 రోజులు వర్షాలు

**పలు జిల్లాలకు వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ**

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రెండు రోజుల పాటు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు ప్రకటించారు. బుధవారం పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

తరువాయి 2లో

# దేశం మార్పు కోరుకుంటోంది

**బిజెపి హామీలు 2004లో 'ఇండియా వెలిగిపోతుంది' అనే నినాదం మాదిరిగానే మిగిలిపోతాయ్ : ఖర్గే**

**ఎన్నికల మేనిఫెస్టో ఖరారుపై సిడబ్ల్యుసి భేటీ**



**న్యూఢిల్లీ :** దేశ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రకటించిన గ్యారంటీలు 2004లో 'ఇండియా వెలిగిపోతుంది' అనే నినాదం మాదిరిగానే మిగలనున్నాయని విమర్శించారు. సార్వత్రిక సమరానికి సంబంధించిన ఎన్నికల ప్రణాళిక ఆమోదించేందుకు జరిగిన పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలి (సిడబ్ల్యుసి) సమావేశంలో మంగళవారం జరిగింది. సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు కెసి వేణుగోపాల్, జైరామ్ రమేష్ మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల కోసం పార్టీ మేనిఫెస్టో తుది ఆమోదం, విడుదల తేదీ అధికారాన్ని పార్టీ అధ్యక్షుడు ఖర్గేకు కట్టబెట్టామన్నారు. సిడబ్ల్యుసి సమావేశం దాదాపు మూడు గంటల పాటు కొనసాగిందని, ఈ సమావేశంలో పార్టీ గ్యారంటీలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లేందుకు రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసేది కేవలం మేనిఫెస్టోనే కాదని, అది 'న్యాయ్ పత్ర' అని, దీంతో ప్రజలు ఉజ్వల భవిష్యత్తును చూస్తారన్నారు. కాగా, అంతకుముందు సిడబ్ల్యుసి సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతి అంశాన్ని దేశ వ్యాప్తంగా, ప్రతీ గ్రామం, ప్రతి పట్టణం, ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని కాంగ్రెస్ శ్రేణులకు ఖర్గే సూచించారు. యావత్ దేశం మార్పు కావాలని డిమాండ్ చేస్తుందని, ప్రస్తుతం చెబుతున్న హామీలు 2004 సంవత్సరం నాటి 'ఇండియా వెలిగిపోతుంది' అనే నినాదానికి పట్టిన గతే పడుతుందన్నారు. అయితే కాంగ్రెస్ మేనిఫెస్టోకు వివిధ రాష్ట్రాల్లో విస్తృత ప్రచారం లభించేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మనం కట్టుబడిన అంశాలను కూడా దేశ వ్యాప్తంగా ప్రతి ఇంటికి, ప్రజలకు పెద్ద మొత్తంలో చేరవేసేలా చూడాల్సిన బాధ్యత కూడా ఉందన్నారు. 2004 లోక్‌సభ ఎన్నికల సమయంలో అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం 'ఇండియా షైనింగ్' అనే నినాదాన్ని ఇచ్చిందని, ఆ ఎన్నికల్లో పార్టీ ఓటమిని చవిచూసిందన్నారు. మేనిఫెస్టోలో ఏ హామీ ఇచ్చామో వాటిని కచ్చితంగా అమలు చేస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు ఉద్ఘాటించారు. మేనిఫెస్టోలో వాగ్దానాలు చేసే ముందు, ఈ హామీలు అమలు చేసేలా లోతుగా చర్చించామని

తరువాయి 2లో

## మీ అభిప్రాయం ఏమిటి?

**పౌరసత్వ నిబంధనల అమలును నిలిపివేయాలనే పిటిషన్లపై కేంద్రాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు**




**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ), 2019కి ఉన్న రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీం కోర్టు పరిష్కరించే వరకూ పౌరసత్వ సవరణ నిబంధనలు అమలు కాకుండా చూడాలని పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై సుప్రీం కోర్టు స్పందిస్తూ, ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వ అభిప్రాయాన్ని కోరింది. మూడు వారాల్లోగా స్పందించాలని మంగళవారం ఆదేశించింది. అయితే, పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాదులు కోరిన విధంగా సిఎఎ నిబంధనల అమలుపై స్టే విధించడానికి ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం నిరాకరించింది. అయితే, ఈలోగా అమల్లోకి వచ్చిన సిఎఎ నిబంధనలపై స్టే విధించాలని కోరుతూ వచ్చిన 20 దరఖాస్తులపై జస్టిస్ జెపి పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా సభ్యులుగా ఉన్న సుప్రీం కోర్టు ధర్మాసనం కేంద్రానికి మంగళవారం నోటీసులు జారీ చేసింది. ఈ విషయంపై ఎలాంటి

తరువాయి 2లో



## తొలగించిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకోండి

**సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు లేఖ**

ప్రజాపక్షం/హైదరాబాద్

గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య(ఆర్‌డబ్ల్యుస్ అండ్ ఎస్) శాఖ మిషన్‌లోని భగీరథ పథకంలో తొలగించిన అవుట్ సోర్సింగ్ సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూనంనేని సాంబశివరావు మంగళవారం లేఖ రాశారు. ఈ లేఖ ప్రతులను పంచాయతీరాజ్ శాఖమంత్రి ధనసరి అనుసూయ(సీతక్క), ముఖ్యకార్యదర్శి, పంచాయతీ రాజ్ శాఖకు కూడా చేర్చారు. తెలంగాణ రాష్ట్ర గ్రామీణ నీటి

తరువాయి 2లో

## రెండు రాష్ట్రాల్లో ఎన్‌కౌంటర్లు

**మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో ఎదురు కాల్పులు**

**మొత్తం ఆరుగురు నక్సల్స్ హతం**

**గడ్చిరోలి/దంతెవాడ :** మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి తుపాకుల మోత మోగింది. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్లలో మొత్తం ఆరుగురు నక్సల్స్ హతమయ్యారు. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో తలపై రూ. 36 లక్షల రివార్డు కలిగిన వారు మృతి చెందినట్లు సీనియర్ అధికారి చెప్పారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దేశ

తరువాయి 8లో

## అధికారుల నిర్లక్ష్యం... అర్హులకందని గ్యారంటీలు

ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి




రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు అధికారుల నిర్లక్ష్యంతో అర్హులకు అందడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తమ కష్టాలు తీరుతాయని అనుకున్న పేదల్లో అధికారుల నిర్లక్ష్యం వల్ల కొంత మందికి మాత్రమే లబ్ధి చేకూరుతుండగా మిగతా అర్హులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అందని ద్రాక్షలా మారాయి. దీంతో అర్హులైన మరికొంతమంది పరిస్థితి ఏమిటనేది తెలియక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దుస్థితి నెలకొంది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా మొత్తం విద్యుత్ వినియోగదారులు 3 లక్షల 21వేల 357 మంది ఉండగా గృహజ్యోతి కోసం జిల్లాలో 2 లక్షల 75 వేల 272 మంది

తరువాయి 2లో

## ఆ మూడు పార్టీలకూ కీలకమే!

**లోక్‌సభ ఎన్నికల్లో అధికార ఆధిపత్యాన్ని నిలుపుకునే యత్నంలో కాంగ్రెస్**

**గౌరవప్రదమైన స్థానాలు దక్కకపోతే బిఆర్‌ఎస్ మనుగడ ప్రమాదమే**

**ప్రత్యామ్నాయంగా ఎదగాలన్న ఆలోచనలో బిజెపి**

ప్రజాపక్షం/ ఖమ్మం




దేశంలో అతి త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలు తెలంగాణ రాష్ట్రంలో మూడు పార్టీలకు కీలకంగా మారనున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు తమ భవిష్యత్తును నిర్ణయిస్తాయన్న ఆలోచనలో మూడు పార్టీలు మెజార్టీ స్థానాలు సాధించేందుకు, గౌరవనీయమైన స్థా నాలు దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్నాయి. ప్రతి అవకాశాన్ని వినియోగించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. కాంగ్రెస్, బిఆర్‌ఎస్, బిజెపిలు ఒక రకంగా చెప్పాలంటే సంది దశలో ఉన్నాయి. ఫలితాల తర్వాత ఏ పార్టీకి సానుకూలత లభించకపోయినా భవిష్యత్తు ప్రమాదకరం గా మారే అవకాశం

తరువాయి 2లో



ప్రేమ వ్యవహారం నచ్చక

## కుమార్తెను కొట్టి చంపిన తల్లి!

ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారంలో దారుణం చోటుచేసుకుంది. డిగ్రీ చదువుతున్న విద్యార్థిని భార్గవి (19) తీవ్ర

తరువాయి 2లో



## బిజెపి రాజకీయ సంస్థ ఇడి

### రూ.100 కోట్లన్నారు...ఒక్క రూపాయి పట్టుకోలేదు: ఆప్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ మద్యం విధానంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విడుదల చేసిన పత్రికా ప్రకటనపై ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. లోక్‌సభ ఎన్నికల ముందు తమ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఇలాంటి ఆరోపణలు చేస్తోందని మండిపడింది. బీజేపీ రాజకీయ విభాగంగా ఈడీ పనిచేస్తోందని విమర్శించింది. 2021/22 ఢిల్లీ మద్యం విధాన రూపకల్పన, అమలు ద్వారా ప్రయోజనాలు పొందడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, అరవింద్ కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా తదితరులు కుట్ర పన్నారని ఈడీ తమ ప్రకటనలో వెల్లడించింది. ఈ ప్రయోజనాలకు ప్రతిఫలంగా ఆ పార్టీ నేతలకు రూ.100 కోట్లు చెల్లించడంలో కవిత భాగస్వామి అయ్యారని పేర్కొంది. ఆప్ నేతలు మనీశ్ సిసోడియా, సంజయ్‌సింగ్ అరెస్టు విషయాన్ని ఈడీ ప్రస్తావించింది. దీనిపై ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా స్పందించింది. గతంలోనూ ఈడీ ఇలాంటి అవాస్తవ ప్రకటనలు విడుదల చేసిందని విమర్శించింది. ఈ కేసులో 500లకు పైగా సోదాలు జరిపినా... వేల మంది సాక్షులను విచారించినా దర్యాప్తు సంస్థకు అక్రమంగా ఉన్నట్లు నిరూపించేలా ఒక్క రూపాయి కూడా లభించలేదని ఆప్ తెలిపింది. చిన్న సాక్ష్యాన్ని కూడా రికవరీ చేయలేదని, అందుకే విసుగెత్తిపోయి ఇలాంటి ఆరోపణలు చేస్తోందని మండిపడింది. తాజాగా ఈడీ విడుదల చేసిన ప్రకటనలో ఒక్క కొత్త విషయం లేదని, ఇవన్నీ చూస్తుంటే కేసులో తటస్థ దర్యాప్తు విధానాన్ని వదిలేసి... బీజేపీకి రాజకీయ విభాగంగా ఈడీ పనిచేస్తున్నట్లు అనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ఎన్నికల ముందు కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నదని ఆ పార్టీ మండిపడింది.

## మీ అభిప్రాయం ఏమిటి?

(మొదటి పేజీ తరువాయి)

ప్రాథమిక అభిప్రాయాన్ని వ్యక్తం చేయడంలేదని, అటు పిటిషనర్ల వాదనలు, ఇటు ప్రభుత్వ వివరణలను వినాల్సి ఉంటుందని వ్యాఖ్యానిస్తూ కేసును ఏప్రిల్ 9వ తేదీకి వాయిదా వేసింది. వివాదాస్పద సిఎఎ చట్టాన్ని పార్లమెంటు ఆమోదించిన నాలుగేళ్ల తర్వాత, పత్రాలు లేని వారి కోసం భారత పౌరసత్వాన్ని వేగంగా ట్రాక్ చేయడానికి మార్చి 11న, సంబంధిత నిబంధనల నోటిఫికేషన్‌తో పౌరసత్వ (సవరణ) చట్టం, 2019 అమలుకు కేంద్రం మార్గం సుగమం చేసింది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ నుండి 2014, డిసెంబర్ 31 కంటే ముందు భారతదేశానికి వచ్చిన ఆయా దేశాల్లోని మైనారిటీలకు భారత పౌరసత్వం కల్పించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశం. కాగా, మంగళవారం విచారణ సందర్భంగా, కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, ఈ విషయంలో 230 పిటిషన్లు ఉన్నాయని, నిబంధనలు అమల్లోకి వచ్చిన తర్వాత, స్టే కోరుతూ 20 దరఖాస్తులు దాఖలయ్యాయని చెప్పారు. అయితే, పిటిషనర్లలో ఎవరూ ప్రభావిత పక్షాలు కావని వ్యాఖ్యానించారు. సిఎఎ ఎవరి పౌరసత్వాన్ని తీసివేయదని కోర్టుకు తెలిపారు.

## కుమార్తెను కొట్టి చంపిన తల్లి!

(మొదటి పేజీ తరువాయి)

గాయాలతో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన మోతె జంగమ్మ ఐలయ్య దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. పెద్ద కుమార్తె భార్గవి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. భార్గవికి మేన బావతో వివాహం చేసేందుకు కుటుంబసభ్యులు నిర్ణయించారు. అప్పటికే గ్రామానికి చెందిన ఓ యువకుడితో భార్గవి ప్రేమలో ఉండగా, తల్లిదండ్రులు చూసిన సంబంధాన్ని ఆమె తిరస్కరిస్తూ వచ్చింది. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం భార్గవి ఇంట్లో ఒంటరిగా ఉండగా, ఆమె ప్రియుడు ఇంటికి వచ్చాడు. ఇదే సమయంలో ఇంటికి వచ్చిన యువతి తల్లి వారిని మందలించగా యువకుడు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కాసేపటి తర్వాత భార్గవి ఇంట్లో విగతజీవిగా పడి ఉండగా, తల్లి స్పృహ తప్పి పడి ఉంది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. ఇంట్లో ఫ్యాన్‌కు భార్గవి మృతదేహాన్ని వేలాడదీసి, ఆత్మహత్య చేసుకుందని చిత్రీకరించేందుకు యత్నించినట్లు గుర్తించారు. యువతి సోదరుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. పోస్టుమార్టంతో పాటు స్థానికులు, కుటుంబసభ్యులను విచారించి, తల్లి జంగమ్మే భార్గవితో గొడవపడి, గొంతు నులిపి చంపేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ప్రస్తుతం ఆమె స్పృహలో లేకపోవటంతో విచారణ అనంతరం, వాస్తవాలన్నీ వెలుగులోకి వస్తాయని ఇబ్రహీంపట్నం ఎసిపి రాజు తెలిపారు. భార్గవి హత్యోదంతంపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్న పోలీసులు, తండ్రి ఐలయ్యను సైతం విచారించనున్నట్లు తెలిపారు.

## దేశం మార్పు కోరుకుంటోంది

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. ఈ వాస్తవం కారణంగానే, 1926 నుండి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో 'విశ్వాసం, నిబద్ధత' పత్రం'గా పరిగణించబడుతుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ నేతృత్వంలోని భారత్ జోడో న్యాయ్ యాత్రను కూడా ఖర్గే ప్రశంసించారు, ఈ యాత్ర ద్వారా యావత్ దేశ ప్రజల నిజమైన సమస్యపై దృష్టిని ఆకర్షించగలిగిందని అన్నారు. ఈ యాత్రలు కేవలం రాజకీయ యాత్రలు మాత్రమే కాదని, రాజకీయ చరిత్రలో అతి పెద్ద ప్రజా సంప్రదింపు ఉద్యమంగా గుర్తించబడతాయన్నారు. ఈ రెండు యాత్రలు కూడా ఈ సమస్యను పరిష్కరించగలిగాయన్నారు. సిడబ్ల్యుసి సమావేశానికి ఖర్గేతో పాటు పార్టీ మాజీ చీఫ్‌లు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ హాజరయ్యారు. అంబికా సోనీ, ప్రియాంక గాంధీ వాద్రా, పి చిదంబరం, దిగ్విజయ సింగ్, అజయ్ మాకెన్, కుమారి సెల్జాతో సహా ఇతర సీనియర్ నేతలు కూడా కీలక సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ మ్యానిఫెస్టో కమిటీకి చిదంబరం అధ్యక్షత వహించిన చిదంబరం... మేనిఫెస్టోలోని కీలక అంశాలను చిదంబరం చదివి వినిపించారు. అలాగే సిడబ్ల్యుసి మేనిఫెస్టో ముసాయిదాను అందించింది. ముఖ్యంగా ఐదు న్యాయ హామీలను తీసుకొచ్చారు. 'భాగిదారీ న్యాయ్', 'కిసాన్ న్యాయ్', 'నారీ న్యాయ్', 'శ్రామిక్ న్యాయ్', 'యువ న్యాయ్' ఈ ఐదు హామీల గురించి నేతలకు మార్గనిర్దేశం చేయనున్నారు. వీటితో పాటు 25 హామీలపై చర్చించి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది. లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ ఇప్పటికే 82 మంది అభ్యర్థును ప్రకటించింది.

## గవర్నర్‌గా సిపి రాధాకృష్ణన్

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగనున్నారు. దీంతో రాష్ట్రానికి వరుసగా మూడో తమిళ వ్యక్తి గవర్నర్‌గా రాధాకృష్ణన్ రానున్నారు. రాష్ట్ర గవర్నర్‌గా రాధాకృష్ణన్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం 11.15 గంటలకు రాజ్‌భవన్‌లో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ ఆరాధే ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. తెలంగాణ గవర్నర్‌తో పాటు, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించటం పట్ల జార్ఖండ్ గవర్నర్ సిపి రాధాకృష్ణన్ ఎక్స్ వేదికగా స్పందించారు. తనపై నమ్మకంతో అదనపు బాధ్యతలు అప్పగించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**లోక్‌సభ బరిలో తమిళిసై..**

తమిళనాడుకు చెందిన తమిళిసై సౌందరరాజన్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత రెండో గవర్నర్‌గా ఆమె బాధ్యతలు నిర్వహించారు. అంతకు ముందు ఆమె బిజెపి తమిళనాడు రాష్ట్ర అధ్యక్షురాలిగా పని చేశారు. 2019 ఎన్నికల్లో తూత్తుకుడి నుంచి లోక్‌సభకు పోటీ చేసిన కరుణానిధి కుమార్తె కణిమొళిపై ఓటమి చెందారు. ఆ తర్వాత ఆమెను 2019 సెప్టెంబర్ 8న తెలంగాణ గవర్నర్‌గా భారత రాష్ట్రపతి నియమించారు. అనంతరం 2021 ఫిబ్రవరి 18వ తేదీ నుంచి పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గానూ అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తూ వచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే నిమిత్తం ఆమే రాజీనామా చేసిన విషయం తెల్సిందే.

# ప్రతి తెలంగాణ ఉద్యమకారుడికీ 250 గజాల ఇంటి స్థలం

### గుర్తింపు కార్డులను , ప్రశంస పత్రాలను అందజేయాలని 'తెలంగాణ ఉద్యమకారుల సంఘం' ఆవిర్భావ సభ తీర్మానం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి తెలంగాణ ఉద్యమకారునికి 250 గజాల ఇంటి స్థలాన్ని వెంటనే కేటాయించాలని, వారికి గుర్తింపు కార్డులను , ప్రశంస పత్రాలను అందజేయాలని 'తెలంగాణ ఉద్యమకారుల సంఘం'' ఆవిర్భావ సభ తీర్మానించింది. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు నెరవేరేలా పని చేయాలని నిర్ణయించింది. ఇ ఉపేందర్ అధ్యక్షతన 'తెలంగాణ ఉద్యమకారుల సంఘం' సభ సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం గౌరవ అధ్యక్షులుగా పాశం యాదగిరి , ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రొఫెసర్ కాసిం,అద్దంకి దయాకర్,గజ్జల కాంతం ఈ సమావేశంలో ఎస్‌సి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పిడమర్తి రవి, ప్రజా సంఘాల జెఏసి ఛైర్మన్ గజ్జల కాంతం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేదని, సమైక్యవాదులను, తెలంగాణ ఉద్యమాన్ని నీరుగార్చిన తెలంగాణ ద్రోహులకు పెద్దపీట వేసిందని విమర్శించారు. ప్రస్తుత ప్రజాపాలనలో ఉద్యమకారులకు సముచిత గౌరవం దక్కుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో 'తెలంగాణ ఉద్యమకారుల సంఘం' అన్ని జిల్లా కమిటీలను, ఆ తర్వాత రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేసి,తన కార్యకలాపాలను కొనసాగిస్తుందని వివరించారు. ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో ఉస్మానియా వేదికగా ఉద్యమించిన ఉద్యమకారులకు న్యాయం జరగలేదని, భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందని వారు తెలిపారు. సెక్యులర్ ప్రభుత్వాన్ని బలపరచాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం సభ్యులుగా గుడిపల్లి రవి,రహీమ్, డాక్టర్ రామగల్ల సుందర్, అందె కృష్ణ, పద్మశాలి రాజు, ఆర్ఎన్ .శంకర్ ,దుబ్బ రంజిత్ ,బిషగొని శ్రీనివాస్ గౌడ్, రాజేష్ ముదిరాజ్, బోరెల్లి సురేష్, సాంబశివ గౌడ్, బొమ్మెర స్వయి, మచన పల్లి రాజు, దర్శనం జాన్, కందుల శీను, నోముల వంశీ, సైఫాబాద్ గణేష్, దేవరకొండ నరేష్, నక్క మహేష్, జోగు గణేష్, తప్పెట శివకుమార్, కొల్లాపూర్ రాజు, ఓంకార్ ఉన్నారు.

## బోయిన్‌పల్లిలో జింక కొమ్ముల విక్రయదారుల అరెస్ట్

### టాస్క్‌ఫోర్స్, అటవీశాఖ జాయింట్ ఆపరేషన్‌లో రెండు జింక కొమ్ములు స్వాధీనం




**ప్రజాపక్షం / హైదరాబాద్** : నగర పోలీస్ కమిషనర్ సెంట్రల్ జోన్ టీమ్, హైదరాబాద్ రేంజ్ అటవీ శాఖ అధికారుల బృందం సంయుక్త ఆపరేషన్ నిర్వహించి జింక కొమ్ములను చట్ట విరుద్ధంగా కలిగిఉన్న ఇద్దరు నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రెండు జింక కొమ్ములను స్వాధీనపర్చుకున్నారు. ఈ సంఘటన మంగళవారం బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శంకర్ ఎన్‌క్లేవ్ వద్ద చోటుచేసుకుంది. జింక కొమ్ములను చట్ట విరుద్ధంగా విక్రయిస్తున్నారన్న ముందస్తు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, అటవీ శాఖ అధికారుల బృందం రంగంలోకి దిగి జింక కొమ్ముల విక్రయానికి అడ్డుకట్ట వేశారు. పోలీసులు తెలియజేసిన ప్రకారం మెదక్‌జిల్లా సికింద్లపూర్‌కు చెందిన పిట్టల శోభన్‌బాబు అనే 25ఏళ్ల యువకుడు పండ్ల వ్యాపారం చేస్తున్నాడు. వరంగల్ జిల్లా దొమ్మాట గ్రామానికి చెంది బోయిన్‌పల్లిలో గోల్డ్ స్మిత్ గా పనిచేస్తున్న 40ఏళ్ల వ్యక్తి బోనాల నాగాచారి ఇద్దరు సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆశతో జింక కొమ్ముల విక్రయాలను ఎంచుకున్నారు. కొన్ని నెలల క్రితం ఇద్దరూ బతుకుదెరువు కోసం హైదరాబాద్ నగరానికి చేరుకున్నారు. వారిద్దరూ పరిచయమైన సందర్భంగా ఇరువురి ఫోన్ నెంబర్లను ఒకరికి ఒకరు ఇచ్చుకున్నారు. పిట్టల శోభన్‌బాబు రెండు సార్లు నాగాచారికి పక్షి మాంసాన్ని విక్రయించాడు. తర్వాత నాగాచారి శోభన్‌బాబుకు జింక కొమ్ములు తీసుకువచ్చి సికింద్రాబాద్ మార్కెట్‌లో విక్రయిస్తే వాటికి డబ్బు బాగా వస్తుందని సలహా ఇచ్చి ఒప్పించాడు. ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం శోభన్‌బాబు సూరారం ప్రాంతంలోని ఒక గుర్తుతెలియని వ్యక్తి నుంచి రూ.2 వేలకు రెండు జింక కొమ్ములను సేకరించి వాటిని బోయిన్‌పల్లి వద్ద అధిక మొత్తం ధరకు కస్టమర్లకు విక్రయించాలని అందజేశాడు. దీనిపై విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్, అటవీశాఖ రేంజ్ అధికారులు సంయుక్త ఆపరేషన్ చేపట్టి రంగంలోకి దిగారు. శోభన్‌బాబు, నాగాచారి ఇద్దరూ రెండు జింక కొమ్ములను విక్రయించే పనిలో ఉండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరిపై వన్యప్రాణుల రక్షణ చట్టాన్ని (1972)ఉల్లంఘించి అపరాధానికి పాల్పడ్డట్లు కేసు నమోదు చేశారు. సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ డిసిపి ఎస్.రష్మీ పెరుమాల్ పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ హైదరాబాద్ వెస్ట్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వి.అనురాధ, సనత్‌నగర్ సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె.జ్యోతి, జూబ్లీహిల్స్ డి.ఆర్.ఓ కె.శంకర్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎన్.రామకృష్ణ, ఎస్.ఐ ఎన్.నరేష్ బృందంతో కలిసి ఈ అరెస్ట్‌లో పాల్గొన్నారు.

## ఇజ్రాయిల్ ఆంక్షలు ఆందోళనకరం

### ఐరాస ఆందోళన

**జెనీవా:** యుద్ధంతో ఛిద్రమవుతోన్న గాజాలో మానవతాసాయం అందించేందుకు ఇజ్రాయిల్ ఆంక్షలు అడ్డంకిగా మారాయని ఐరాస తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ పరిణామాలు చూస్తుంటే ఆకలి మంటల్ని ఆ దేశం యుద్ధతంత్రంగా వాడుతున్నట్లు అనిపిస్తోందని వ్యాఖ్యలు చేసింది. అదే గనుక నిజమైతే యుద్ధ నేరం కింద పరిగణించాల్సి వస్తుందని హెచ్చరించింది. అక్టోబర్ 7న హమాస్ జరిపిన ఉగ్రదాడితో గాజాలో ఇజ్రాయిల్ ప్రతిదాడులు మొదలుపెట్టింది. అప్పటినుంచి ఆ ప్రాంతం పరిస్థితి దారుణంగా మారింది. స్థానికుల ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. ఇక్కడి జనాభాలో 70 శాతం మంది తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొంటున్నట్లు తాజాగా అంచనా వేసింది. స్థానికంగా ప్రతిఒక్కరూ ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్నారని, ఉత్తర ప్రాంతంలో దాదాపు 2 లక్షల మంది విపత్కర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నట్లు తెలిపింది. ఒకవేళ ఇజ్రాయిల్ తన దాడులను రఫాకు విస్తరిస్తే మొత్తం 23 లక్షల మంది జనాభాలో సగం మంది క్షుద్బాధకు లోనవుతారని హెచ్చరించింది. దాదాపు 13 లక్షల మంది పలస్తీనీయులు ఆశ్రయం పొందుతున్న రఫా ప్రాంతాన్నీ ఇజ్రాయిల్ ఆక్రమించే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. దీనిపై మరోసారి ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో అమెరికా అధ్యక్షుడు బైడెన్ మాట్లాడుతూ ఆందోళన వ్యక్తం చేశారు. 'తాజా పరిణామాలపై నెతన్యాహుతో మాట్లాడానని, హమాస్‌ను అడ్డుకునే హక్కు ఇజ్రాయిల్‌కు ఉందని పునరుద్ఘాటించాను. అలాగే బందీలను విడిపించుకునే ఒప్పందంలో భాగంగా కాల్పుల విరమణ అవసరాన్ని మరోసారి స్పష్టంచేశాను. రఫాలో గ్రౌండ్ ఆపరేషన్ లేకుండా హమాస్‌ను ఎదుర్కొనే మార్గాలపై చర్చించేందుకు ఓ బందాన్ని వాషింగ్టన్‌కు పంపాలని ఆయనకు సూచించానని బైడెన్ సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు. హమాస్‌పై పోరు విషయంలో ఇజ్రాయిల్ ప్రధాని అనుసరిస్తున్న తీరుపై కొద్దిరోజుల క్రితం బైడెన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. బెంజమిన్ వైఖరి ఆయన సొంత దేశాన్నే గాయపరుస్తోందని వ్యాఖ్యానించారు. ఆ నేపథ్యంలో ఇద్దరు నేతల మధ్య దూరం పెరిగినట్లు వార్తలు వచ్చాయి. నెల రోజుల తర్వాత తాజాగా వీరిద్దరూ మాట్లాడుకున్నారు.

## ఘాజీపూర్ సరిహద్దుల్లో అడ్డంకుల తొలగింపు ప్రారంభం

న్యూఢిల్లీ: రైతులు 'ఢిల్లీ చలో' మార్చ్‌ని తాత్కాలికంగా నిలిపివేయడంతో, ఢిల్లీ పోలీసులు మంగళవారం ఘాజీపూర్ సరిహద్దులో బ్లాకులు, ఇతర అడ్డంకులను తొలగించడం ప్రారంభించారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా మొదలు పెట్టిన ఈ తొలగింపు కార్యక్రమం ఒకటి రెండు రోజుల్లో పూర్తవుతుందని, ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు తీరుతాయని పోలీస్ అధికారి ఒకరు పిటిఐకి తెలిపారు. అయితే, పోలీసులు, పారామిలటరీ బలగాలను మోహరింపుతో 24 గంటలూ కట్టుదిట్టమైన నిఘా కొనసాగుతుంది. అంతకుముందు, ఢిల్లీ పోలీసులు ఫిబ్రవరి 25న ప్రయాణికుల కోసం టిక్రి, సింఘు సరిహద్దుల వద్ద ప్రయాణికుల కోసం సిమెంట్ అడ్డంకులను తొలగించారు. సింఘు వద్ద, ఢిల్లీ హర్యానాను కలిపే ఫ్లైఓవర్ సైడ్ లేన్లలో ఏర్పాటు చేసిన కాంక్రీట్ బారికేడ్లను ఎత్తివేశారు. ప్రస్తుతం టిక్రీ సరిహద్దులో రాకపోకలు సామాన్య స్థితికి చేరుతున్నాయి. అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం/ నాన్ పొలిటికల్)ఐ, కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం) గత నెల 'ఢిల్లీ చలో' మార్చ్‌కి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఆ తరువాత నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు, హర్యానా పోలీసు సిబ్బంది పంజాబ్ హర్యానా సరిహద్దులో ఘర్షణ పడ్డారు. ఢిల్లీ పోలీసులు ఫిబ్రవరి 13న టిక్రి, సింఘు, ఘాజీపూర్ సరిహద్దుల వద్ద అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కాంక్రీట్, ఇనుప మేకులు, బారికేడ్లతో రోడ్లను మూసివేశారు. ఇప్పుడు పరిస్థితి మెరుగ్గా ఉన్నందున, సరిహద్దుల్లో అడ్డంకులను దశల వారీగా తొలగిస్తున్నారు. భద్రతా బలగాలను మాత్రం ఇప్పట్లో తప్పించే అవకాశాలు కనిపించడం లేదు.

## విధుల్లోకి తీసుకోండి

(మొదటి పేజీ తరువాయి)

సరఫరా, పారిశుద్ధ్యం (ఆర్‌డబ్ల్యుఎస్ అండ్ ఎస్) శాఖలో మిషన్ భగీరథ పథకంలో 2015 సంవత్సరం నుండి పనిచేస్తున్న 662 మంది ఇన్‌స్పెక్టర్లు, 47 మంది జూనియర్ అసిస్టెంట్స్ మొత్తం 719 మంది సిబ్బందిని పనులు పూర్తయిన వెంటనే అకారణంగా తొలగించారని ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ హఠాత్పరిణామంతో విద్యావంతుల కుటుంబాలు వీధులపాలయ్యాయని, ఇందులో చాలా మందికి ఉద్యోగ వయోపరిమితి కూడా దాటిందని కూనంనేని తెలిపారు. ఈ అంశాన్ని సానుకూలంగా, సానుభూతితో పరిశీలించి, మిషన్ భగీరథ పథకంలో (ఆర్‌డబ్ల్యుఎస్ అండ్ ఎస్)పనిచేసిన 719 సిబ్బందిని మావతా దృక్పథంతో తిరిగి విధులలోనికి తీసుకోవాలని లేదా, గృహ నిర్మాణ శాఖ, ఇతర విభాగాలలో వీరిని నియమించి, ఆయా కుటుంబాలను ఆదుకోవాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

## జ్ఞానవాపి కేసుపై ఏప్రిల్ 11న విచారణ

**వారణాసి:** జ్ఞానవాపి మసీదు దక్షిణ సెల్లార్ పైనుంచి ముస్లింలు నడవకుండా నిరోధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను వారణాసి కోర్టు ఏప్రిల్ 11న విచారించనుంది. ప్రస్తుతం రంజాన్ మాసం నడుస్తున్నందున, ఉపవాస దీక్షలో ఉంటామని, కాబట్టి తమ వాదన వినిపించడానికి కొంత సమయం కావాలని కోర్టును ముస్లిం తరఫున ప్రతినిధిలు కోరినట్టు హిందూ పక్షాన వాదిస్తున్న మోహన్ యాదవ్ పిటిఐకి తెలిపారు. ఈ అభ్యర్థనపై వారణాసి జిల్లా న్యాయమూర్తి అనిల్ కుమార్ సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు. ఇలా వుంటే, సెల్లార్ పైకప్పు పురాతనమైనదని, బలహీనంగా ఉందని హిందూ తరపు పిటిషనర్లు పేర్కొన్నారు. 'వ్యాస్ టెఖానా'గా పిలిచే ఈ బేస్‌మెంట్ పిల్లర్లకు మరమ్మతులు అవసరమని కూడా పిటిషన్‌లో తెలిపారు. వ్యాస్ టెఖానాలో హిందువుల పూజలు చేసుకోవచ్చని అలహాబాద్ హైకోర్టు తీర్పునిచ్చిన కొన్ని రోజుల వ్యవధిలోనే, అక్కడి పైకప్పుపై నడవరాదని ఆదేశాలు జారీ చేయాల్సిందిగా పిటిషన్ దాఖలు కావడం గమనార్హం. ముస్లింలు అక్కడ నడవడం, ప్రార్థనలు చేయడం కొనసాగిస్తే, సెల్లార్ కుంగిపోయే ప్రమాదం ఉందని మోహన్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. కాశీ విశ్వనాథ్ ఆలయం నియమించిన పూజారి ప్రస్తుతం అక్కడ పూజలు నిర్వహిస్తున్నారు.

## రామ్‌దేవ్‌బాబాకు సుప్రీం సమన్లు

**న్యూఢిల్లీ:** యోగా గురువు రామ్‌దేవ్ బాబాకు మంగళవారం సుప్రీంకోర్టు సమన్లు జారీచేసింది. పతంజలి ఆయుర్వేద సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆయనతో పాటు మేనేజింగ్ డైరెక్టర్ ఆచార్య బాలకష్ణ కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసులో ధిక్కార పిటిషన్‌పై సమాధానం ఇవ్వకపోవడంతో ఈ సమన్లు ఇచ్చింది. ఆధునిక వైద్యవిధానాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని పతంజలి ఆయుర్వేద సంస్థపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం గతేడాది నవంబర్‌లో ఆ సంస్థను మందలించింది. తమ ఉత్పత్తులు వివిధ రకాల వ్యాధులను నయం చేస్తాయంటూ 'అసత్య', 'తప్పుదోవ' పట్టించే ప్రకటనలు ఇవ్వొద్దని సూచించింది. లేదంటే కోర్టు తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇకపై ఎలాంటి ఉల్లంఘనలూ జరగవంటూ అప్పట్లో సంస్థ తరపున న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. అయితే, ఆ ఆ హామీని ఉల్లంఘించడంపై గత నెల కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వారిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలపాలంటూ రామ్‌దేవ్ బాబాకు, ఆచార్య బాలకష్ణకు నోటీసులు జారీ చేసింది. ప్రకటనల విషయంలోనూ కొన్ని సూచనలు చేసింది. ఇతర వైద్య విధానాలపై ప్రభావం చూపేలా ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లో ఎలాంటి ప్రచారం చేయొద్దని మరోసారి సూచించింది. అయితే, ఆ నోటీసులకు పతంజలి సమాధానం ఇవ్వడంలో విఫలమైంది. 'మీ ప్రతిస్పందన ఎందుకు దాఖలు చేయలేదు' అని జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ అమానుల్లాతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. తదుపరి విచారణ సమయంలో వారిద్దరు కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశించింది.

## 2026లో బుల్లెట్ రైలు పరుగులు : వైష్ణవ్

**న్యూఢిల్లీ:** దేశంలో బుల్లెట్ రైలు పట్టాలెక్కడంపై రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఓ ప్రకటన చేశారు. 2026 నాటికి ఈ రైలు పట్టాలపై పరుగులు పెడుతుందన్నారు. 'రైజింగ్ భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన... కేంద్ర ప్రాజెక్టుల పురోగతిపై మంగళవారం మాట్లాడారు. బుల్లెట్ రైలు కోసం 500 కి.మీల ప్రాజెక్టును నిర్మించేందుకు వివిధ దేశాలకు దాదాపు 20 సంవత్సరాలు పట్టింది. కానీ, భారత్ 810 సంవత్సరాల్లోనే దాన్ని పూర్తిచేయనుంది. ప్రపంచస్థాయి సౌకర్యాలతో. 2026 నాటికి ఈ రైలు పట్టాలెక్కనుంది. మొదట గుజరాత్‌లోని సూరత్ నుంచి బిలిమోరా వరకు దీనిని నడపనున్నాం. 2028 నాటికి ముంబైఅహ్మదాబాద్ పూర్తి మార్గం అందుబాటులోకి రానుందని అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు.

## 2 రోజులు వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉందన్నారు. ఇదే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని తెలిపారు. బుధవారం మాత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశాలున్నాయన్నారు. కిందిస్థాయి గాలులు దక్షిణ ఆగ్నేయ దిశ నుంచి రాష్ట్రం వైపునకు వీస్తున్నాయని తెలిపారు. పశ్చిమ విదర్భ, దాని పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్న ఉపరితల ఆవర్తనం, మంగళవారం అదే ప్రాంతంలో కొనసాగుతుందన్నారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. బుధవారం నుంచి గురువారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వానలు పడే అవకాశం ఉందని చెప్పారు. అకాల వర్షాలకు అన్నదాతలకు భారీగా నష్టం కలుగుతున్నది. మామిడి, జామ, మక్క, జొన్న తదితర పంటలకు భారీగా నష్టం కలిగిస్తున్నాయి.

పటంలకు నష్టపరిహారం చెల్లించాలి : పశ్యపద్మ

వడగళ్ల వానలకు, ఈదురు గాలులతో దెబ్బతిన్న పంటలకు ,చనిపోయిన రైతు కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిజామాబాద్, సిరిసిల్ల, కరీంనగర్, ములుగు, రంగారెడ్డి మెదక్ జిల్లాలలో దెబ్బతిన్న పంటలన్నింటినీ సర్వే చేసి, నష్టాన్ని అంచనా వేసి, రైతుకు ఎకరాకు రూ. 25 వేల నష్టపరిహారం చెల్లించాలన్నారు. సిరిసిల్ల జిల్లాలో విద్యుత్ స్తంభం, చెట్టు విరిగిపడి మృతిచెందిన రైతు కుటుంబా న్ని ఆదుకునేందుకు రూ. 10 లక్షల ఆర్థిక సహాయం చేయాలని ఆమె మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో గత రెండు రోజులుగా పలు ప్రాంతాలలో వర్షాలు ,వడగళ్ల వర్షాలు, ఈదురు గాలుల వల్ల చేతికొచ్చిన పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్ట పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, మొక్కజొన్న, జొన్న ,పొగాకు, వేరుశనగ ,మిర్చి గోధుమ కూరగాయ పంటలు బొప్పాయి ఉల్లి దెబ్బతిన్నాయని, వరి పొలాలకు నీళ్ల లేక ఎండిపోయి దెబ్బతిన్నదని, ఈ వర్షాల కారణంగా వరి ధాన్యం రాలిపోయిందని పశ్యపద్య తెలిపారు.

## పార్టీలకు కీలకమే..!

(మొదటి పేజీ తరువాయి)

ఉంది. ముఖ్యంగా కాంగ్రెస్ గతేడాది డిసెంబరులో జరిగిన ఎన్నికల్లో అధికారాన్ని చేజిక్కించుకుంది. అధికారం దక్కింది కానీ కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ లభించలేదు. 64 స్థానాలతో అధికారంలో కొనసాగుతున్న కాంగ్రెస్ 17 పార్లమెంటు స్థానాల్లో మెజార్టీ స్థానాలను గెలుచుకోవాలన్న వ్యూహంలో ఉంది. అలా జరగని పక్షంలో అంతర్గతంగా పట్టు తగ్గడమే కాకుండా ప్రత్యర్థి పార్టీలైన బిఆర్ఎస్, బిజెపిలు ఏకమయ్యే ప్రమాదం కూడా ఉంది. ఈలోపే తొలుత బిఆర్ఎస్ నడ్డి విరాచాలని కాంగ్రెస్ యత్నిస్తుంది. ఎక్కువ మంది శాసన సభ్యులను తమవైపుకు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. ఏది ఏమైనా 17 స్థానాలలో 10 స్థానాలకు పైగా కాంగ్రెస్ గెలవక పోతే రాష్ట్రంలో విపక్ష స్థానంలో ఉన్న బిఆర్ఎస్, బిజెపిలు ఏకం కావచ్చు. అది కాంగ్రెస్‌కు ఇబ్బందికరమే. అంతే కాదు మూడు నాలుగు నెలలకే వ్యతిరేకత వచ్చిందన్న భావన ప్రజల్లోకి తీసుకు పోతే ఇబ్బందికరమవుతుంది. అందుకే కాంగ్రెస్ మెజార్టీ ఎంపి స్థానాలపై దృష్టి సారించి గెలుచుకునేందుకు సర్వ శక్తుల ప్రయత్నిస్తుంది. నిన్న మొన్నటి వరకు ఫిరాయింపులు ప్రోత్సహించవద్దనుకున్నా ఇప్పుడు తప్పని స్థితి. బిఆర్ఎస్‌ది అచ్చు జీవన్మరణ పోరాటమే. మెజార్టీ స్థానాలు గెలిస్తే తప్ప ఆ పార్టీ మనుగడ కష్టం. బిఆర్ఎస్ స్థానాన్ని బిజెపి ఆక్రమించే ప్రమాదం ఉంది. బిజెపి కంటే తామే పెద్ద పార్టీ అని తమకింత భవిష్యత్తు తెలంగాణ రాష్ట్రంలో ఉంది అని నిరూపించుకోవాలనుకుంటే కచ్చితంగా మెజార్టీ కాకపోయినా గౌరవనీయమైన స్థానాలు బిఆర్ఎస్ దక్కించుకోవాల్సి ఉంటుంది. లేదంటే బిఆర్ఎస్ నుంచి బిజెపి లేదా కాంగ్రెస్ పార్టీలకు వలసలు పెరిగి గులాబీ మరింత వాడిపోయే ప్రమాదం ఉంది. ఎందుకంటే గులాబీ పార్టీయే వలసలతో నిండినది. ఎక్కువ మంది అవకాశం కోసం, అధికారం కోసం బిఆర్ఎస్‌లో చేరిన వారే. తిరిగి అదే ఆలోచనతో ఏటైనా జంప్ కావచ్చు. బిఆర్ఎస్‌కు ముందున్నది ఒక్కటే ఎక్కువ పార్లమెంటు స్థానాలు సాధించేందుకు శాయశక్తులా కృషి చేయడమే. ఇక బిజెపి తెలంగాణపై ఎన్నో ఆశలు పెంచుకుంది. ఇప్పుడు మెజార్టీ స్థానాలు గెలిచి తెలంగాణలో బిఆర్ఎస్ సహా అనేక పార్టీల నేతలను తనలో కలుపుకుని కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగి తెలంగాణ స్ఫూర్తితో దక్షిణ భారతదేశంలో బలపడాలని కలలు కంటుంది. ఈ కలలను నిజం చేసుకునేందుకు వివిధ పార్టీల నుంచి అసమ్మతివాదులను చేరదీస్తున్నది. గతంలో గెలిచిన నాలుగు స్థానాల నుంచి ఈ దఫా రెట్టింపు స్థానాలను గెలుచుకోవాలని ప్రయత్నం చేస్తుంది. బిజెపి తాము మెజార్టీ స్థానాలను గెలుచుకుంటే అటు కాంగ్రెస్, ఇటు బిఆర్ఎస్ లను ఓ ఆట ఆడుకోవచ్చునని బిజెపి నేతలు ఆలోచిస్తున్నారు. దీనితో తెలంగాణలో మూడు పార్టీల మనుగడ పార్లమెంటు ఎన్నికల ఫలితాల పైనే ఆధారపడి ఉంది. గెలుపోటములు మూడు ప్రధాన పార్టీల భవిష్యత్తును నిర్దేశించనున్నాయి. తెలంగాణ ప్రజల తీర్పు పైనే వీటి భవితవ్యం ఆధారపడి ఉందనడంలో ఎటువంటి సందేహం లేదు.

## అర్హులకందని గ్యారంటీలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఈ పథకం ఫిబ్రవరి చివరివారంలో అమలు చేసిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్న వారికి విద్యుత్ శాఖ అధికారులు జీరో బిల్లులను జారీ చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో లక్ష 45వేల మంది అర్హులకు మాత్రమే గృహ జ్యోతి పథకం వర్తింప చేయగా మీగతవారికి జీరో బిల్లు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం దీనిపై మొదట మార్గదర్శకాలు స్పష్టం చేయకపోవడంతో అర్హులు కాస్తా గందరగోళానికి గురయ్యారు. పట్టణ ప్రాంతాల్లో నివాస గృహాలు ఉన్న వారిలో ఒకటికి మించి విద్యుత్ కనెక్షన్లు కలిగి ఉండడంతో ప్రభుత్వం అన్ని కనెక్షన్లకు ఈ పథకాన్ని వర్తింప చేస్తుందో.. లేదో.. అనే మీమాంసతో గృహ యజమాని తాను వినియోగిస్తున్న కనెక్షన్ నెంబర్‌తో దరఖాస్తు చేసుకోవడంతో మిగతా కనెక్షన్ల నెంబర్లు వేయకపోవడంతో అద్దెకు ఉంటున్న వారు ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోలేదు. ప్రభుత్వం దీనికి ముందే స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేసి ఉంటే అద్దెకు ఉంటున్న వారు కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం దక్కేది. కాని నేడు అవకాశం లేకుండ పోయింది.

**మిగతా అర్హుల పరిస్థితి ఏంటీ..**

అద్దెకు ఉంటున్న అర్హులైన వారికి నేడు గృహలక్ష్మీ అమలు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వీరి పరిస్థితి ఏంటన్నది ప్రశ్నార్థకంగా మారింది. గతంలో ప్రజాపాలన దరఖాస్తుల చేసుకొని ఉండి ఉచిత విద్యుత్ వర్తించని వారు దరఖాస్తు రశీదు తీసుకొని స్థానికంగా ఉన్న మండల పరిషత్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో సంప్రదిస్తే వాటి ఆధారంగా తిరిగి ఆన్‌లైన్ చేసి అర్హులను గుర్తిస్తామని ప్రభుత్వం చెప్పడం జరిగింది. ప్రజా పాలనలో అసలు గృహజ్యోతి కోసం దరఖాస్తు చేసుకోని వారి పరిస్థితి నేడు అగమ్యగోచరంగా మారింది. ప్రజా పాలన నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వం చెబుతున్న నూతనంగా దరఖాస్తులను మాత్రం అధికారులు అర్హుల నుండి స్వీకరించడం లేదు. ప్రభుత్వం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ లాగిన్‌ను పూర్తిగా నిలిపివేసింది. ప్రభుత్వం పునఃరాలోచించి లాగిన్ ను ఓపెన్ చేసి నూతన దరఖాస్తులు స్వీకరిస్తే తప్పా న్యాయం జరగని పరిస్థితి. ఇప్పటికైన ప్రభుత్వం ఈ విషయంపై నిర్ణయం తీసుకోని అర్హులకు గృహజ్యోతి పథకం అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## వంద రోజుల కాంగ్రెస్ పాలనకు ప్రజలు నీరాజనం

### రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్** : దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం వీస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. గాంధీ భవన్‌లో మంగళవారం రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఎంఐఎం పార్టీ అభ్యర్థిగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి శాసన సభకుకు పోటీ చేసిన గొంటి విక్రమ్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు, బిఆర్‌ఎస్ నాయకులు పెద్ద ఎత్తున చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి చిన్నారెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ న్యాయ్ జోడో యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని చిన్నా రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించడం ఖాయమన్నారు. సిఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ముందుకు దూసుకుని పోతోందన్నారు. వంద రోజుల రాష్ట్ర ప్రభుత్వ పాలనకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారని తెలిపారు. రానున్న పదేళ్లపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కృషి చేసి కాంగ్రెస్ పార్టీ ఎం.పి అభ్యర్థులను భారీ మెజారిటీలతో గెలిపించుకోవాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విక్రమ్ యాదవ్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. గాంధీ భవన్‌లో ఎంఐఎం నాయకులు విక్రమ్ యాదవ్‌తో పాటు ఎం. శ్రీశైలం యాదవ్, బైకని శ్రీశైలం యాదవ్, గొంటి రాహుల్ యాదవ్, సాల్మాన్ రాజ్, ప్రేమ్, పద్మారావు, ప్రసాద్, జగన్నాథం, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## మేనిఫెస్టోలో దివ్యాంగుల అంశాలు చేర్చండి : కిషన్‌రెడ్డికి వినతి




**ప్రజాపక్షం/హైదరాబాద్** : దివ్యాంగుల సమస్యలను ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వర్ రావు కోరారు. కిషన్ రెడ్డిని నాగేశ్వర్ రావు కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. అనంతరం నాగేశ్వర్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 15 లక్షల మంది దివ్యాంగులు ఉన్నారన్నారు. పెరిగిన ధరలు, నిరుద్యోగంతో వీరంతా కష్టాల్లో ఉన్నారని, బతుకు భద్రత కల్పించే దివ్యాంగుల చట్టం 2016 సైతం అమలుకావడం లేదన్నారు. పథకాలు అమలుకాకపోవడంతో చేయూత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికీ దివ్యాంగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు వివక్షత కొనసాగిస్తున్నాయన్నారు. అన్ని విధాలా అదరవుగా నిలిచే వారికే ఈ ఎన్నికల్లో దివ్యాంగుల మద్దతు ఉంటుందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రస్తుతం ఇస్తున్న రూ.3000 పింఛన్‌ను రూ.10 వేలకు పెంచాలని, దివ్యాంగుల చట్టం 2016ను పటిష్టంగా అమలు జరపాలని, అర్హులందరికీ ఎటువంటి నియమ నిబంధనల పేరుతో ఆంక్షలు విధించకుండా మోటారు వాహనాలు, ఇతర ఉపకరణాలు అందచేయాలని, అన్ని రకాల బస్సు సర్వీసుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణించేలా అవకాశం కల్పించాలని కోరారు.



## రాజకీయ దురుద్దేశంతోనే కవిత అరెస్ట్

### మాజీమంత్రి సత్యవతి రాథోడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వాలు పాలసిలు తీసుకురావడం, మార్చడం సహజమని, అనేక రాష్ట్రాలు మద్యం పాలసీలు మార్చినట్టే, ఢిల్లీలో కూడా మార్చారని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే కవితను అరెస్ట్ చేశారన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎలు గొంగిడి సునీత, హరిప్రియ నాయక్‌తో కలిసి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పాలసీ లు మార్చడం లేదా?, ఆయన కూడా డబ్బులు తీసుకొని పాలసిలు మారుస్తున్నారా? అని ప్రశ్నించారు. విదేశాల నుంచి బొగ్గు దిగుమతి చేసుకునే పాలసీ తీసుకొచ్చిన మోడీ, ఇందులో డబ్బులు తీసుకున్నారా? అని అన్నారు. అప్రూవర్లుగా మారి, వారు ఏదీ చెప్పినా చెల్లుతుందా, మోడీకి కూడా డబ్బులు ఇచ్చామని ఎవరైనా చెబితే ఆయనను కూడా అరెస్టు చేస్తారా అని అన్నారు. కవిత విషయంలో ఇడి అనేక తప్పులు చేసిందని, ఆమెను రిమాండ్ చేయకుండానే కస్టడీ కి ఇచ్చారని తెలిపారు. ఈ కేసులో కథ స్క్రీన్ ప్లే దర్శకత్వం నరేంద్ర మోడీనేనని, ఈ కేసులో బిజెపి నేతలు ముందు స్పందిస్తే, ఆతర్వాత ఇడి వచ్చిందని ఆరోపించారు. గొంగిడి సునీత మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కుటుంబ పార్టీ లు అవినీతి లో కూరుకు పోతున్నాయని మోడీ ఆరోపిస్తున్నారని, లిక్కర్ కేసును బిఆర్ ఎస్‌కు ఆపాదిస్తున్నారని మండిపడ్డారు. ఎటువంటి సాక్ష్యాధారాలు లేకుండా తమ పార్టీపై నిందలు ఎలా వేస్తారని ప్రశ్నించారు. మోడీ కార్పొరేట్ సంస్థలకు ఏజెంట్‌గా పని చేస్తున్నారని, కెసిఆర్‌ను లొంగదీసుకునేందుకు ఆడబిడ్డ అని కూడా చూడకుండా కవితను అరెస్టు చేయించారని మండిపడ్డారు. కవిత నిర్దోషిగా కేసు నుండి బయట పడతారని తెలిపారు.

## ఎన్నికలు బహిష్కరించండి

### సిపిఐ (మావోయిస్టు) అధికార ప్రతినిధి జగన్

**ప్రజాపక్షం/ములుగు జిల్లా ప్రతినిధి/వెంకటాపురం(నూగూరు) :** పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) అధికార ప్రతినిధి జగన్ ఒక లేఖను విడుదల చేశారు. 13వ లోక్‌సభ సార్వత్రిక ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, సిక్కిం, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కూడా 2024 ఏప్రిల్ నుండి జూన్ వరకు జరుపుతున్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో తమ గెలుపు కోసం అధికార పార్టీలో సహా ప్రతిపక్ష పార్టీలన్ని ప్రజలను మరల మోసగించడానికి ప్రణాళికలను సిద్ధం చేసుకున్నాయనాయని, 2013 నవంబర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఎన్నికలలో పాలక పార్టీలన్ని ఓట్ల కోసం వేల కోట్ల డబ్బును, మద్యాన్ని పంచిపెట్టిన తాజా సంగతులు ప్రజలందరికి తెలిసిందే. అదే తరహాలో ఇప్పుడు జరగబోయే లోక్‌సభ ఎన్నికలలో కూడా అధికారాన్ని చేపట్టడానికి ధనబలం, కండబలం, మద్యం, కుల, మత రాజకీయాలతో సిద్ధమయ్యారు. దేశాన్ని అమ్మి వేయడానికి ఐదేళ్ళ అధికారం కోసం పాలక ముఠాల మధ్య కొట్లాడుకోవడం తప్పా భారత ప్రజలకు ఒరిగేది ఏమి లేదన్నారు. పార్లమెంట్ పార్టీలన్ని నిజమైన ప్రజాస్వామ్యానికి, స్వావలంభనకు, సార్వభౌమత్వానికి పూర్తి వ్యతిరేకమైనవి, పీడిత ప్రజలపై దుర్మార్గపు పాలన కొనసాగించడంలో వీటి మధ్య పెద్ద తేడా ఏమి ఉండబోదు. ఈ నేపథ్యంలో ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయాధికారం కావాలని, ప్రజల రాజ్యాధికారాన్ని సాధించుకోవడానికి ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వామ్యం కావాలన్నారు.

# హస్తం కోసం పోటాపోటీ

### కమలం ఆయనకేనట
### ఖమ్మం పార్లమెంటుపై పలువురి గురి
### నిస్తేజంలోనే బిఆర్‌ఎస్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలోనే ఖమ్మం పార్లమెంటు అభ్యర్థిత్వం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ పార్టీ నుండి పలువురు టికెట్ ఆశిస్తుండడం అందరు ఏదో ఒక రకంగా ప్రముఖులే కావడం ఇందుకు కారణం. మారిన ప్రత్యేక పరిస్థితుల్లో ఖమ్మం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం ఖరారు చేసుకుంటే గెలుపు నల్లేరు మీద నడకే అన్న భావన ఉండడంతో తీవ్ర పోటీ ఏర్పడింది. జిల్లాకు ప్రాతినిథ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రుల కుటుంబ సభ్యులు పార్లమెంటు రేసులో ఉండడంతో మరింత ఆసక్తిగా మారింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి, పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజక వర్గాలలో తొలి దశ ప్రచారాన్ని పూర్తి చేశాడు. టికెట్ తప్పక తమకే వస్తుందన్న భావనలో ఒక అడుగు ముందే ఉన్నాడు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని కూడా ఎంపి టికెట్ ఆశిస్తున్నారు. ఖమ్మం, మధిర, వైరా తదితర నియోజక వర్గాలలో పార్టీ క్యాడర్‌ను కలుస్తూ కాంగ్రెస్ పార్టీ తమకే అవకాశం కల్పిస్తుందని కార్యకర్తలకు భరోసా ఇస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ సైతం టికెట్ ఆశించడమే కాదు అందుకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్నారు. కుల సమీకరణ, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తమకే అవకాశం దక్కుతుందన్న భావనలో యుగంధర్ ఉన్నారు. వీరితో పాటు పారిశ్రామిక వేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా), జెట్టి కుసుమకుమార్, ఎన్‌టివి అధినేత నరేంద్ర చౌదరి పేర్లు కూడా వినపడుతున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి. హన్మంత రావు సైతం ఖమ్మం టికెట్ ఆశిస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానానికి ఖమ్మం అభ్యర్థి ఎంపిక ఇబ్బందికరంగానే మారింది. అందరికీ ఆమోదయోగ్యమైన అభ్యర్థి కోసం అధినాయకత్వం దృష్టిసారించినట్లు సమాచారం. నోటిఫికేషన్‌కు చాలా సమయం ఉండడంతో ఇప్పట్లో అభ్యర్థి ఎంపిక వ్యవహారం తేలకపోవచ్చు. బిఆర్‌ఎస్ తమ అభ్యర్థిగా నామ నాగేశ్వరరావును రంగంలోకి దించింది. నామ పార్లమెంటుకు పోటీ చేయడం ఇది ఐదవ సారి. బిఆర్‌ఎస్ అభ్యర్థిత్వం ముందే ఖరారైన పార్టీలో అంత జోష్ కనిపించడం లేదు. ఏదో ఆశించి అవకాశవాదంతో బిఆర్‌ఎస్‌లో చేరిన వారంతా తిరుగుముఖం పట్టారు. ఒక్కొక్కరు ఒక్కొక్కరుగా కారు దిగుతుంటే నైరాశ్యం నెలకొంది. క్యాడర్‌లో పెద్ద మార్పు లేకపోయినా నాయకత్వం చేజారిపోతున్నారు. ఓ సమావేశం మినహా ఆ పార్టీ కార్యక్రమాలు ఏమి లేవు. కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక పై బిఆర్‌ఎస్ భవితవ్యం ఆధారపడి ఉంటుంది. కమలం గుర్తు కోసం పోటీపడుతున్నారు. ఇటీవల బిజెపిలో చేరిన జలగం వెంకట్రావుకే పోటీ చేసే అవకాశం దక్కుతుందని ప్రచారం జరుగుతుంది. వెంకట్రావు కంటే బలమైన అభ్యర్థి బిజెపికి దొరకక పోవచ్చు.ఖమ్మం పార్లమెంటు పరిధిలో వామపక్షాలకు గణనీయమైన బలం ఉంది. వామపక్షాల నిర్ణయం కూడా కొంత మేర ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఇంకా పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి నిర్ణయం వెలువడలేదు. సిపిఐ మాత్రం ఖమ్మం, పెద్దపల్లి, నల్గొండ, భువనగిరి, వరంగల్ లలో ఒక స్థానాన్ని ఆశిస్తుండడగా సిపిఎం రెండు స్థానాలలో పోటీ చేయనున్నట్లు తెలిపిన తుది నిర్ణయం జరగలేదు.

## నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిద్దాం

### ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** అణగారిన వర్గాలకు విద్యను దూరం చేసే, నూతన విద్యా విధానానికి (ఎన్ఈపి)వ్యతిరేకంగా విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ పిలుపునిచ్చారు. ఎన్ఈపి కి వ్యతిరేకంగా నిజాం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్యార నరేష్ మాట్లాడుతూ విద్య కాషాయీకరణ, విద్యా ప్రైవేటీకరణ కోసమే నూతన విద్యా విధానాన్ని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం 2020 నుసమాజంలోని అన్ని వర్గాల ప్రజలు తిరస్కరించాలని కోరారు. ప్రభుత్వ విద్యను పూర్తిగా నిర్వీర్యం చేసి పేద, మధ్య తరగతి వర్గాలకు విద్యను దూరం చేసే కుట్ర అమలు చేస్తున్నారని, దానిలో భాగమే కేంద్రంలో నూతన జాతీయ విద్యావిధానం2020ను తీసుకొచ్చారని విమర్శించారు. విద్య కార్పొరేటీకరణ, కాషాయికరణ చేయాలని కేంద్రం కుట్ర పన్నుతోందని నరేష్ ధ్వజమెత్తారు. దేశంలో జాతీయ విద్యా విధానం వల్ల దాదాపు 90శాతం విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందే హక్కును కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య వ్యాపారీకరణ వలన ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి మైనారిటీలకు సామాజిక న్యాయం దూరం చేసే విధంగా ఉందన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి బదులు హిందుత్వ రాజ్యాన్ని స్థాపించడానికి బాటలు వేస్తున్నారని నిప్పులు చెరిగారు.ఏఐఎస్‌ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు చైతన్య యాదవ్ మాట్లాడుతూ ఎన్ఈపి కి వ్యతిరేకంగా ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఐదు కోట్ల సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలియజేశారు. ఈ సంతకాల సేకరణ తో కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, దేశంలో సెక్యులరిజాన్ని కాపాడటానికి ప్రతీ ఒక్క విద్యార్థి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమానికి మద్దతుగా కళాశాల సోషియాలజీ ప్రొఫెసర్ తిరుపతి సార్, తెలుగు ప్రొఫెసర్ నలిగంటి శరత్ సార్ విచ్చేసి సంతకాలు చేశారు. కార్యక్రమంలో నిజాం కళాశాల ఏఐఎస్‌ఎఫ్ కన్వీనర్ సుశాంత్, విద్యార్థి నాయకులు గణేష్, రణదీప్, శివ, కె.గణేష్, మనోజ్, వినయ్, సందీప్, దీపక్, ధోని, రాజేష్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటికి ఇబ్బందులు లేవు

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని రిజర్వాయర్లలో సరిపడా నీరు ఉన్న నేపథ్యంలో ప్రస్తుత వేసవికాలంలో తాగునీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బందులూ లేవని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. మంచినీటి సరఫరా అంశంలో ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. యుద్ధప్రాతిపదికన మరమత్తులు చేపట్టి, తాగునీటి సరఫరాను నిర్విరామంగా కొనసాగించాలన్నారు. ఇటీవల ముగిసిన నిర్వహించిన ఇంటర్ పరీక్షల స్ఫూర్తితో ప్రస్తుతం జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను కూడా విజయవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని తాగునీటి సరఫరా పరిస్థితులపై సంబంధిత శాఖల అధికారులతో సచివాలయంలో మంగళవారం ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, పంచాయతీ రాజ్ కమిషనర్ అనితా రామచంద్రన్, జి.హెచ్.ఎం.సి కమిషనర్ రోనాల్డ్‌రోస్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ దివ్య, మిషన్ భగీరథ ఈ.ఎన్.సి. కృపాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ లోనూ సరిపడా నీటిని అందిస్తున్నామని, ఎవరైనా అదనపు వాటర్ ట్యాంకులు కోరితే వాటిని కూడా అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లలో నీటి లభ్యత, వేసవి కాలంలో తాగునీటి సరఫరాకు తీసుకున్నచర్యలపై సంబంధిత శాఖల కార్యదర్శులతో ఆమె సమీక్షించారు.

**''పది'' పరీక్షలో ఇబ్బందులు రావొద్దు**

పదవ తరగతి పరీక్షల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిజిపి రవీ గుప్తా, విద్య శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం, విద్య శాఖ కమిషనర్ దేవసేనలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ, ఎస్.ఎస్.సి పరీక్షలు మొదలై రెండు రోజులు అయ్యాయని, మిగిలిన పరీక్షలను కూడా ఏ విధమైన ఇబ్బందులు రాకుండా నిర్వహించాలన్నారు. పరీక్ష కేంద్రాలకు ఎట్టి పరిస్థితుల్లో ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు అనుమతించేది లేదని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడం తోపాటు ప్రతీ కేంద్రం వద్ద కనీసం ఒక కానిస్టేబుల్ లేదా హోమ్‌గార్డును నియమించినట్టు తెలిపారు. పరీక్ష పేపర్లను తేవడం తిరిగి పోస్టాఫీసులకు తీసుకెళ్లేటప్పుడు తగిన బందోబస్తు ఉండాలని, ఇందుకు విద్యా శాఖ, పోలీస్ అధికారులు తగిన సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. ఇటీవల ముగిసిన ఇంటర్ పరీక్షలను విజయ వంతంగా నిర్వహించడం పట్ల జిల్లా కలెక్టర్లను, అధికారులను సి.ఎస్ అభినందించారు.

## ఇయు మహాసభలు విజయవంతం

### 21 తీర్మానాలను ఆమోదించిన మహాసభ



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ మహాసభలు ఈనెల 16, 17 తేదీలలో ఖమ్మంలో అత్యంత విజయవంతంగా జరిగాయని ఆహ్వాన సంఘ కోశాధికారి, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు, ఖమ్మం రీజియన్ కార్యదర్శి పి. రమేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని 97 డిపోలు ఉండగా 95 డిపోల నుంచి రాష్ట్ర మహాసభకు ప్రాతినిధ్యం లభించిందని వారు తెలిపారు. మంగళవారం జరిగిన ఆహ్వాన సంఘ సమావేశం మహాసభల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా అప్పారావు, రమేష్ లు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ఆర్టీసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై జరిగిన చర్చలో 80 మంది పాల్గొన్నారని చర్చల అనంతరం పలు తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తూ అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటించాలని తీర్మానించడం జరిగిందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత ప్రయాణికుల సంఖ్య పెరగడంతో అందుకు అనుగుణంగా సిబ్బందిని, బస్సుల సంఖ్యను పెంచాలని, అన్ని విభాగాలకు సంబంధించి రిక్రూట్ మెంట్ చేయాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. కొత్త బస్సులతో పాటు సిబ్బంది నియమాకం త్వరితగతిన జరపాలని లేకుంటే పెరిగిన ప్రయాణికుల సంఖ్య కారణంగా ఆర్‌టిసి కండక్టర్లు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మానసిక, శారీరక ఇబ్బందులతో అనారోగ్యం పాలవుతున్నారని ప్రభుత్వం సత్వరం దీనిపై చర్యలు తీసుకోవాలని తీర్మానించినట్లు అప్పారావు, రమేష్ లు తెలిపారు. ఫిట్‌మెంట్ విషయంలో, హెచ్‌ఆర్‌ఏ విషయంలో పునః పరిశీలన చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ఎంప్లాయీస్ యూనియన్ పక్షాన వినతి పత్రం సమర్పించడం జరుగుతుందని స్పందించని పక్షంలో ఆందోళన తప్పదన్నారు. అన్నింటికి మించి ఆర్టీసి కార్మికులు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన అసోసియేషన్ల ద్వారా సమస్యల పరిష్కారానికి అవకాశం కల్పించాలని మహాసభ తీర్మానించినట్లు తెలిపారు.

**హెచ్‌ఆర్‌ఏ ప్రకటనకు ఇయు ఖండన :**

రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌టిసి కార్మికుల హెచ్‌ఆర్‌ఏ విషయంలో తప్పుదారి పట్టిస్తుందని అప్పారావు, రమేష్‌లు ఆరోపించారు. జీవో నెం.53 ప్రకారం హెచ్‌ఆర్‌ఏను సవరించినట్లు ప్రభుత్వం చెబుతుందని కానీ 53 జీవో ప్రతిపాదన నాడు ఫిట్‌మెంట్ వ్యవహారం చర్చకు రాలేదన్నారు. 2017 వేతన సవరణ జరిగినప్పుడు హెచ్‌ఆర్‌ఏ విషయంలో పెరిగిన వేతనాల ప్రకారం నిర్ణయం తీసుకోకుండా ప్రభుత్వం, యాజమాన్యం కలిసి కార్మికులను తప్పుదారి పట్టిస్తున్నాయని వారు తెలిపారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఖమ్మం డిపో కార్యదర్శి బుచ్చిబాబు, పలువురు ఆహ్వాన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు భూ సమస్యలపై టి-సాట్ ప్రత్యేక ప్రత్యక్ష ప్రసారం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం టిసాట్ ప్రత్యేక చర్చ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని సిఈఓ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. టిసాట్ నిపుణ ఛానల్‌లో మార్చి 20వ తేదీ బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుండి ఐదు గంటల వరకు ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ రికార్డులపై అవగాహన కలిగిన న్యాయ నిపుణులు భూమి సునీల్ కుమార్ ద్వారా ప్రత్యేక ముఖాముఖి లైవ్ చర్చ కార్యక్రమంలో పాల్గొని సమస్యలపై సలహాలు, సూచనలు అందచేస్తారని సిఈఓ చెప్పారు. భూ సమస్యలపై సలహాలు, సూచనల కోసం 040 23540326, 23450726, టోల్ ఫ్రీ నెంబర్ 1800 425 4039 లకు కాల్ చేయాలని వేణుగోపాల్ రెడ్డి సూచించారు.

## ఎన్నికల విధినిర్వహణలో ఉన్న జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం

**న్యూఢిల్లీ:** రాబోయే లోక్‌సభ ఎన్నికల సమయంలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులు తమ ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేసే అవకాశం ఉంది. వీరితోపాటు మెట్రోలు, రైల్వేలు, ఆరోగ్య సంరక్షణ వంటి ముఖ్యమైన సేవల్లో ఉన్న వారికి కూడా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉంటుందని భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, వీరికి తాము జారీ చేసిన అనుమతి లేఖలు తప్పనిసరిగా అవసరమని స్పష్టం చేసింది.పోస్టల్ బ్యాలెట్ల ద్వారా ఓటు వేయడానికి వీలుగా గుర్తించిన 'అవసరమైన సేవలోని హాజరుకాని ఓటర్లు' విభాగంలో వీరికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తున్నట్టు అన్ని రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు నోటిఫికేషన్ పంపినట్టు పేర్కొంది. ఎన్నికల రోజు కవరేజ్‌లో ఉన్న జర్నలిస్టులు,అవసరమైన సేవలలో పాల్గొనేవారు అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోస్టల్ బ్యాలెట్లను ఉపయోగిస్తున్నారని, ఆ సదుపాయాన్ని లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పొడిగిస్తున్నామని వివరించింది.



## పార్టీ మారడం లేదు

### కావాలనే రాజకీయంగా దుష్ప్రచారం చేస్తున్నారు
### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** తనకు పార్టీ మారే ఉద్దేశ్యం లేదని,కావాలనే రాజకీయంగా తనపై దుష్ప్రచారం చేస్తున్నారని,అలాగే మాజీ ఏసీపీ ప్రణీత్‌రావుకు తనకు ఎలాంటి సంబంధం లేదని, పర్వతగిరిలో ఎలాంటి వార్ రూములు ఏర్పాటు చేయడం కాని, ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. వరంగల్ జిల్లా వర్ధన్నపేట,హనుమకొండ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో మాజీ మంత్రి దయాకర్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వాలు మారిపోగానే చాలా మంది నాయకులు పార్టీని వీడిపోతున్నారని అలాంటి నాయకున్ని తాను కాదని అన్నారు. బిజినెస్, భూ దందాలు, తప్పుడు పనులు చేసేవారు ఇతర పార్టీలోకి పోతున్నారు తప్ప నిబద్ధత కలిగిన నాయకులెవరూ పార్టీ మారడం లేదన్నారు. తాను పార్టీ మారాలనుకుంటే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బెదిరించినప్పుడే పార్టీ మారేవాన్ని అని అన్నారు. అలాంటి ముఖ్యమంత్రులను ఎంతో మందిని చూశానని చెప్పారు. నలబై ఏండ్ల రాజకీయంలో అధికారాన్ని, ప్రతిపక్షాన్ని చూసిన నాయకున్ని అని అన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉండేవాన్ని, ప్రజలతో ఉంటానే తప్ప పార్టీలు మారే ప్రసక్తే లేదన్నారు. ఎన్నికల కోసమే కాంగ్రెస్ డ్రామలు చేస్తోందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయలేదని, వంద రోజుల పాలన విఫలమైనందున ప్రజలు కాంగ్రెస్ సర్కారు తీరుపై ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. కేసీఆర్ పెట్టిన పథకాలను కూడా అమలు చేయడం లేదన్నారు. మాయమాటలు చెప్పడం, మోసాలు చేయడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అలవాటు అని అన్నారు. నీళ్ల లేక పంటలు ఎండిపోతున్నాయని, మండు టెండల్లో కూడా చెరువులను నింపిన మహానుభావుడు కేసీఆర్ అని అన్నారు. వంద రోజుల పాలనలోనే కేసీఆర్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు తేడా ఏమిటో ప్రజలు గమనించారని అన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, నాయకులు వెళ్లినంత మాత్రానా ఒరిగిందేమిలేదన్నారు. కార్యకర్తల మీద తప్పుడు కేసులు పెడితే ఊరుకునేది లేదని, వారికి అండగా పోలీస్ స్టేషన్‌లోనే కూర్చుంటామన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమన్నారు. ఎన్టీఆర్ లాంటి మహా నాయకునికే ఓటమి తప్పలేదని ఆయన పునరుద్ఘాటించారు. మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ అధికారం లేదని ప్రజలకు దూరంగా ఉండే నాయకులం కాదన్నారు. కేసీఆర్‌తో ఫోటోలు దిగిన వారే నేడు పార్టీలు మారుతున్నారని అలాంటి వారికి ప్రజల్లో గుర్తింపు ఉండదన్నారు. ప్రజాక్షేత్రంలో తమకు అప్పుడు, ఇప్పుడు ఇదే స్థానం ఉందని, తిరిగి బీఆర్‌ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రజల వెన్నంటి ఉండే నిత్యం ప్రభుత్వంపై పోరాటాలు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు ఎండిపోయి తెలంగాణ కరువును చవి చూస్తుందన్నారు. రైతుల మోటర్లు కూడా కాలిపోతున్నాయని అన్నారు. రాష్ట్రంలో చోటా భాయి, కేంద్రంలో బడా భాయ్ కలిసి మాజీ సీఎం కేసీఆర్‌పై కుట్రలు చేస్తున్నారని, దాన్ని తిప్పికొడుతామని సవాల్ చేశారు. ఈ సమావేశంలో వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, వాసుదేవరెడ్డి, మాజీ కుడా ఛైర్మన్ సుందర్ రాజు యాదవ్, ఎల్లావుల లలిత తదితరులు పాల్గొన్నారు.

## నెమలిని చంపిన ఇద్దరి అరెస్ట్




**ప్రజాపక్షం/పెగడపల్లి :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని దోమలకుంట గ్రామ శివారులో నెమలిని వేటాడి కాల్చి చంపిన వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు జగిత్యాల డిఎస్పీ రఘు చందర్ తెలిపారు. పెగడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఆయన తెలిపిన వివరాల ప్రకారం గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన నలువాల సత్యనారాయణ(63), మల్యాల గ్రామానికి చెందిన జవ్వాజి రాజు(33) అను ఇరువురు వ్యక్తులు పెగడపల్లి మండలంలోని దోమలకుంట గ్రామ శివారులో లైసెన్స్‌లేని తుపాకీతో సంచరించి జాతీయ పక్షి నెమలిని వేటాడి తుపాకీతో కాల్చి చంపి తమ కారులో తీసుకొని వెళ్తుండగా సమాచారం మేరకు జగిత్యాల డిఎస్పీ ఆదేశాల మేరకు మల్యాల సిఐ నీలం రవి పర్యవేక్షణలో పెగడపల్లి ఎస్ఎఫ్ రామకృష్ణ తన సిబ్బందితో కలిసి అయితిపల్లి గ్రామశివారులో వాహనాల తనిఖీ చేపట్టగా నెమలిని తుపాకీతో చంపి కారులో వెళ్తున్న ఇరువురిని పట్టుకుని , కారును, తుపాకీని, తూటాలను చనిపోయిన నెమలిని స్వాధీనం చేసుకున్నారని డిఎస్పి తెలిపారు. వన్యప్రాణులను వేటాడడం అలవాటుగా చేసుకుని సోమవారం పట్టుబడిన సత్యనారాయణ జింకలను వేటాడిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. 2017లో భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో జింకలు వేటాడిన కేసులో అరెస్టయి జైలుకు వెళ్లి బెయిల్ మీద వచ్చాడని, అట్టి కేసు విచారణలో ఉండగానే నిందితుడు సోమవారం దోమలకుంట గ్రామ శివారులో జాతీయ పక్షి నెమలిని వేటాడి లైసెన్స్‌లేని తుపాకీతో నెమలిని కాల్చి చంపినట్లు పేర్కొన్నారు. వేటకు వినియోగించిన 0.22 స్పోర్టింగ్ రైఫిల్ తుపాకీ, 34 నిండు బుల్లెట్లు , ఒకటి కాల్చిన తూటా యొక్క ఖాళీ భాగం, ఒక గొడ్డలి, ఒక హ్యుందాయ్ కారు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ప్రజాపక్షం
బుధవారం, మార్చి 20

# కాంగ్రెస్ ఎన్నికల గ్యారంటీలు

రాబోయే సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్, బిజెపి ఇస్తున్న హామీల్లో తేడా స్పష్టంగా కనిపిస్తున్నది. 'మోడీకా గ్యారంటీ' అనే నినాదమే బిజెపిలో కొనసాగుతున్న వ్యక్తిస్వామ్యానికి నిదర్శనం. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ పార్టీలో అంతర్గత చర్చలు జరిపి, అన్ని కోణాల్లోనూ సమీక్షించి ఐదు గ్యారంటీలను సిద్ధం చేసింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధికారికంగా మేనిఫెస్టోను విడుదల చేయడం ఇక లాంఛనం. కాంగ్రెస్‌పై దుమ్మెత్తిపోయడం, మత విద్వేషాలతో సమాజాన్ని విభజించి పబ్బం గడుపుకోవడం, వివాదాస్పద చట్టాలను తేవడం తప్ప, భవిష్యత్తుపై బిజెపి ఇస్తున్న స్పష్టమైన ప్రణాళిక అంటూ ఏదీ లేదు. మోడీ వ్యక్తిపూజను పరాకాష్టకు తీసుకెళ్లడం, రామ భజనను వాడవాడకు మోసుకెళ్లడమే దాని జనాకర్షక మంత్రం. కాంగ్రెస్ అందుకు భిన్నంగా 'గ్యారంటీ'లను ప్రకటించింది. కర్నాటక, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విస్పష్టమైన హామీలతో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రజల విశ్వాసాన్ని చూరగొనే ప్రయత్నం చేస్తున్నది. 'భాగీదారీ న్యాయ్' (భాగస్వామ్య న్యాయం), 'కిసాన్ న్యాయ్' (రైతుకు న్యాయం), 'నారీ న్యాయ్' (మహిళకు న్యాయం), 'శ్రామిక్ న్యాయ్' (శ్రామికులకు న్యాయం), 'యువ న్యాయ్' (యువతకు న్యాయం) అనే పంచ హామీలతో ముందుకొచ్చింది. ఇప్పటికే కర్నాటకలో హామీలను నెరవేర్చగా, తెలంగాణలో ఆరు గ్యారంటీలు దశల వారీగా అమలవుతున్నాయి. హామీ ఇస్తే, ఎన్ని ఆటంకాలు ఎదురైనప్పటికీ అమలు చేస్తున్నదనే భరోసాను కాంగ్రెస్ కల్పిస్తుంటే, ఇచ్చిన హామీలను విస్మరించడం బిజెపికి ఆనవాయితీగా మారింది. ఏడాదికి కోటి ఉద్యోగాల ప్రసక్తి లేదు. విదేశాల్లో మూలుగుతున్న నల్లధనాన్ని తెప్పిస్తామన్న హామీ అటకెక్కింది. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు... రైతులకు బీమా... పంటలకు కనీస మద్దతు ధర... విద్యార్థులకు ఉచిత విద్య... ఇలా లెక్కకు మించిన హామీలు గుప్పించిన బిజెపి ఏ ఒక్కటీ సక్రమంగా అమలు చేయలేదు. రాజకీయ పార్టీకీ.. వ్యక్తికీ మధ్య ఉన్న భేదాన్ని పాటించడం లేదు. సమష్టి నిర్ణయాలు తీసుకుంటున్న జాడ లేదు. హోరెత్తిస్తున్న బిజెపి ప్రచారం 'ఇది బిజెపి గ్యారంటీ' అనికాకుండా, 'మోడీ గ్యారంటీ' అనడమే ఆ పార్టీ ఆత్మరక్షణలో పడిందని స్పష్టం చేస్తున్నది. జారిన అడుగులను కూడదీసుకొని పునరుజ్జీవనం కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ యువకులు, మహిళలు, శ్రామికులు, రైతులు.. ఇలా అన్ని వర్గాల వారికి న్యాయాన్ని అందిస్తున్నది. అధికారంలోకి వస్తే కుల జనగణన నిర్వహించి, బడుగులకు సమన్యాయం సమకూర్చుతామని, రిజర్వేషన్లపై అనములో ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేస్తామని చెప్పింది. వివక్షాపూర్వకమైన సిఎఎను రద్దు చేయనున్నట్టు ప్రకటించింది. పేదలు, ప్రధానంగా మహిళలకు ఊరటనిచ్చే హామీలతో ఓట్లను కోరుతున్నది. కానీ బిజెపి మాత్రం అభూత కల్పనలతో, అర్థంలేని నినాదాలతో ప్రజలను భ్రమల్లో ముంచే ప్రచారంతో ఎన్నికల బరిలోకి దిగే సాహసం చేస్తున్నది. తమ ప్రజాస్వామ్య వ్యతిరేక, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన పోకడను కప్పిపుచ్చుకునేందుకు మోడీ ప్రజలపై మతం మత్తుమందు చల్లుతున్నారు. అయితే, బిజెపి తన ఎన్‌డిఎ కూటమిని పటిష్టం చేసుకుంటూ ఉండగా, ప్రతిపక్ష 'ఇండియా' కూటమిలో స్పర్థలు, ఒంటెద్దు పోకడలు బిజెపి వ్యతిరేక ఓటర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాయి. కాంగ్రెస్ ఎన్ని గ్యారంటీలు ఇచ్చినా, ప్రతిపక్ష కూటమిని సమర్థవంతంగా ఎన్నికల క్షేత్రంలోకి నడిపించడంపైనే ఫలితాలు ఆధారపడి ఉంటాయని మరువరాదు. కాంగ్రెస్ గ్యారంటీలు కర్నాటక, తెలంగాణలో ఫలించాయి. కానీ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పని చేయలేదనే వాస్తవాన్ని గుర్తించాలి. ప్రజల్లో విశ్వాసాన్ని పాదుగొలిపితేనే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ తన లక్ష్యాన్ని చేరుకుంటుంది.

# 'పెట్రో' తగ్గింపు పండుగ చేసుకుందామా?

ఎం కోటేశ్వరరావు

త్వరలో ప్రపంచ జిడిపిలో జపాన్, జర్మనీలను వెనక్కు నెట్టి మూడవ స్థానం ఆక్రమించే ధనిక దేశంగా మనలను నరేంద్రమోడీ ముందుకు తీసుకుపోతున్నారు. టీవీలు చూడండి రోజూ ఎన్ని గ్యారంటీలను ప్రకటిస్తున్నారో, రామరాజ్యాన్ని తెచ్చారు, రామాలయాన్ని నిర్మించారు, ప్రపంచంలో తలెత్తుకొనేట్లు చేశారు. ఓట్ల కోసం మోడీ ఏమీ చేయరని బరాబర్ చెబుతున్నాం అంటూ భక్తులు ఊరూరా తిరుగుతున్నారు. అదే నిజమైతే ''ధనికులైన'' మన జనాలకు ముష్టి విదిల్చినట్లుగా తాజాగా పెట్రోలు, డీజిలు మీద లీటరుకు రు.2 తగ్గించటం అవమానించటం కాదా ? ఈ చర్యతో జనం పండగ చేసుకుంటున్నారని బిజెపి నేతలు చెబుతున్నారు. పూర్వం గ్రామాల్లో వృత్తుల వారికి పండుగల సందర్భంగా రైతులు తాము చేసుకున్న పిండివంటలు ఇస్తే ఎంతో సంతోషించేవారు(దీని అర్థం వృత్తుల వారిని కించపరచటం కాదు, అలాంటి పరిస్థితి గతంలో ఉందని చెప్పటమే.ఇప్పుడు ఇంకా ఎక్కడైనా అలా ఉందేమో తెలియదు). దాన్నుంచి వచ్చిందే కుడుమేస్తే పండగ అనే లోకోక్తి. ఇప్పుడు ముష్టివిదిల్చినట్లుగా రెండు రూపాయలు, గ్యాస్ సిలిండర్‌కు వంద ఇచ్చి బిజెపి వారు జనాలను దూ ఫెస్టివల్ (పండగ చేస్కో) అంటున్నారు.2022 ఏప్రిల్ ఆరు నుంచి చమురు ధరలను స్థిరంగా ఉంచిన పెద్దలు ఓట్లు కొల్లగొట్టాలని తప్ప ఇప్పుడు ఇంత స్వల్పంగా తగ్గించటానికి ప్రాతిపదిక ఏమిటి ? ఈ మాత్రానికే పండగ చేసుకొని ఓట్లు వేస్తామని ఎవరైనా అంటే అది వారిష్టం.

అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరిగితే పెంచుతాం, తగ్గితే తగ్గించే విధానం అమలు జరుపుతున్నట్లు ప్రతి రోజూ సుప్రభాతం మాదిరి ధరలను ప్రకటించే వారు. రెండు సంవత్సరాలుగా ఎందుకు నిలిపివేసినట్లు ? ఎన్నికల్లో మీట నొక్కిన తరువాత తిరిగి పెంచరనే గ్యారంటీ ఏముంది ? కేంద్ర ప్రభుత్వ పెట్రోలియం ప్లానింగ్ అండ్ ఎనాలసిస్ సెల్ (పిపిఏసి) వెబ్‌సైట్‌లోని తాజా సమాచారం ప్రకారం పదేండ్ల యుపిఏ పాలనా కాలంలో 2004–05 నుంచి 2013–14 వరకు కేంద్ర ప్రభుత్వం లేదా చమురు ఉత్పత్తుల మార్కెటింగ్ కంపెనీలు వినియోగదారులకు ఇచ్చిన సబ్సిడీల మొత్తం రు.8,88,024 కోట్లు. సగటున ఏటా 88.8వేల కోట్లు. తరువాత నరేంద్రమోడీ అచ్చేదిన్ పాలనలో ఈ మొత్తం రు.2,82653 కోట్లు మాత్రమే. సగటున 30.1వేల కోట్లు. వీటిలో ప్రజా పంపిణీ కిరోసిన్, ఉజ్వల గ్యాస్ సబ్సిడీ ఉన్నాయి. ఇది సబ్సీల కోత తీరు కాగా ఈ కాలంలో చమురు రంగంలో జనంపై మోపిన భారమెంతో చూద్దాం. తొమ్మిది సంవత్సరాల తొమ్మిది నెలల కాలంలో మోడీ సర్కార్ పెంచిన పన్నులు, సెస్సులు, చమురు కంపెనీల నుంచి వచ్చిన రాబడుల మొత్తం రు.34,53,930 కోట్లు. అంటే సగటున రు.3.45లక్షల కోట్లు వచ్చింది. అధికారానికి వచ్చిన తొలి ఏడాది అంటే అంతకు ముందు మన్మోహన్ సింగ్ సర్కార్ విధించిన పన్నులు, ఇతర రాబడి రు.1.72లక్షల కోట్లు మాత్రమే. అది 2021–22లో గరిష్ట స్థాయికి రు.4.92లక్షల కోట్లకు పెరిగింది. ఈ ప్రాతిపదికన అంటే తొలి ఏడాది పన్నులే కొనసాగి ఉంటే పదేండ్లలో రు17.22 లక్షల కోట్లుగా ఉండేది, కానీ మొత్తం మీద చూసినపుడు రెట్టింపైంది. రద్దు చేసిన సబ్సిడీ, పెంచిన భారాలను కలుపు కుంటే 23లక్షల కోట్ల మేరకు భారం జనం భరించినట్లు లెక్క.

2020లో మనదేశంలో 88.2 బిలియన్ లీటర్ల డీజిల్, 37.2 బిలియన్ లీటర్ల పెట్రోలు (స్టాటిస్టా సమాచారం) వినియోగం మొత్తం 125.4 బిలియన్ లీటర్లు. ఇప్పుడు రెండు రూపాయల చొప్పున తగ్గించారు గనుక ఏడాది పాటు అమలు చేస్తే 250.8 బిలియన్లు అంటే 25వేల కోట్లు జనానికి విదిల్చి ఓట్లు కొల్లగొట్టాలని పథకం వేశారు.




మోపిన భారం ఎంత? తగ్గించిన ధర ఎంత ? తరువాత వినియోగం పెరిగి ఉంటే ప్రభుత్వానికి పన్ను ఆదాయం పెరిగినట్లే తగ్గింపు మొత్తం కూడా అదే దామాషాలో పెరుగుతుంది. జనం మరీ ఇంత అమాయకంగా ఉన్నారని, కుడుమేస్తే పండగ చేసుకొనే వారి మాదిరి కనిపిస్తున్నారా ? పది సంవత్సరాల కాలంలో రాష్ట్రాలకు చమురు ఉత్పత్తుల మీద వచ్చిన పన్ను, ఇతర రాబడి రు.22,19,558 కోట్లు అంటే సగటున 2.3 లక్షల కోట్లు. పదేండ్ల క్రితం వార్షిక రాబడి 1.6లక్షల కోట్ల నుంచి 2.3లక్షల కోట్లకు తప్ప కేంద్రం మాదిరి రు.1.72లక్షల నుంచి 3.45లక్షల కోట్లకు పెరగలేదు. కేంద్రం నుంచి పన్నుల్లో రాష్ట్రానికి వచ్చే వాటా సంగతేమిటని కొందరు ప్రశ్నించవచ్చు. ఎక్సైజ్, ఇతర పన్నులో రాష్ట్రాలకు వాటా ఉంటుంది తప్ప సెస్సుల పేరుతో మోపిన దానిలో ఒక్క పైసా కూడా రాదు. మోడీ మోపిందంతా సెస్సుల పేరుతోనే. ధరలు తగ్గించాలని ఒక వైపు డిమాండ్ చేసే వారు ప్రభుత్వం అదే చేస్తే సంతోషించకుండా విమర్శలెందుకు చేస్తారు అనే వారు ఉన్నారు.వారందరికీ ఒకటే సమాధానం పెంచాలని ఎవరూ కోరలేదు, వద్దంటున్నా విపరీతంగా పెంచి జేబులు కొల్లగొట్టారు.దానిలో ఓట్ల కోసం నామమాత్రం తగ్గిస్తే పండుగ చేసుకోవాల్సిన అవసరం లేదు. ఈ తగ్గింపు నేతలకు భజన చేయాల్సినంత గొప్పదేమీ కాదు. రద్దు చేసిన సబ్సిడీలతో పోలిస్తే ఇచ్చిన రాయితీ మొత్తమెంతో ఈ ప్రశ్నలు వేసే వారు సమాధానం చెప్పాలి.యుపిఏ పాలనా కాలంలో వార్షిక సగటు ముడిచమురు పీపా ధర డాలర్లలో, రూపాయలలో పెట్రోలు, డీజిల్ ధరలు ఎలా ఉన్నాయో, నరేంద్రమోడీ హయాంలో ఎలా ఉందో దిగువ చూడవచ్చు.

| సం॥ | ధర (డాలర్లు) | పెట్రోలు | డీజిల్ |
|---|---|---|---|
| 2010–11 | 85.09 | 52.64 | 38.56 |
| 2011–12 | 111.89 | 64.71 | 40.26 |
| 2012–13 | 107.97 | 68.71 | 45.26 |
| 2013–14 | 105.52 | 73.70 | 51.90 |
| 2014–15 | 84.16 | 66.36 | 52.23 |
| 2015–16 | 46.17 | 68.71 | 45.26 |

2016–17లో మనదేశం దిగుమతి చేసుకున్న ముడి చమురు సగటు ధర 47.57 ,2017–18లో 56.43, 2018–19లో 69.88, 2019–20 లో 60.57, 2020–21లో 44.82, 2021–22లో 79.18, 2022–23లో 93.15, 2023–24లో 82.41డాలర్లు ఉంది. 2022 ఏప్రిల్ ఆరున ఢిల్లీలో లీటరు పెట్రోలు ధర రు.105.41, డీజిల్ ధర రు.96.67 కాగా మే 22 నుంచి రు. 96.72, రు.89.62కు తగ్గించారు. అప్పటి నుంచి 2024 మార్చినెల 14వరకు అదే రేట్లు కొనసాగాయి. యుపిఏ పాలనలో 112 డాలర్లకు ముడి చమురు దిగుమతి చేసుకుంటే వినియోగదారుల నుంచి వసూలు చేసింది పెట్రోలు రు.64.71, డీజిల్‌కు రు.40.26 మాత్రమే. ఇప్పుడు తాజా రేటు పైన చెప్పుకున్నట్లు 82.41 డాలర్లు ఉంటే ఢిల్లీలో 96.67, 89.62గా ఎందుకు ఉన్నట్లు? తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోలు రేటు రు.109, 111 వంతున ఉన్నాయి, మరికొన్ని చోట్ల ఇంకా ఎక్కువ ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు తగ్గినా వినియోగదారుల నుంచి ఇంతగా ధర వసూలుకు కారణమేమిటి అంటే విపరీతంగా సెస్సులను వడ్డించటం, రూపాయి మారకపు విలువ పతనాన్ని అరికట్టలేని అసమర్థతే తప్ప మరొక కాదు. వీటి గురించి నరేంద్రమోడీ దేశానికి ఇస్తున్న గ్యారంటీలు ఏమిటి అన్నది ప్రశ్న.

2011–12లో మన దేశం కొనుగోలు చేసిన ముడి చమురు సగటు ధర 111.89 డాలర్లు. ఆ ఏడాది అంటే 2012 మార్చి నెలలో ఉన్న సగటు ధర 123.66 డాలర్లుంది.2012 మార్చి 29 నుంచి ఏప్రిల్ పదకొండువరకు సగటు ధర 121.28 డాలర్లు. కేంద్ర ప్రభుత్వ సంస్థ పిపిఏసి వెల్లడించిన సమాచారం ప్రకారం 2022 జూన్ పదవ తేదీన మనం కొనుగోలు చేసిన చమురు ధర 121.28 డాలర్లు. ఇక్కడే మనం నరేంద్రమోడీ ఘనత గురించి చెప్పుకోవాలి. అదే ధరకు 2012లో మన చెల్లించిన మొత్తం మన కరెన్సీలో రు.6,201.05 కాగా ఎనిమిదేండ్ల పాలనలో నరేంద్రమోడీ అదే డాలర్లకు చెల్లించిన మొత్తం రు.9,434.29.అంటే మంచి రోజుల పేరుతో అధికారాన్ని పొంది బాదుడేబాదుడు అన్నట్లుగా చమురు మీద పెంచిన పన్నులను పక్కన పెడితే రూపాయి విలువ పతనాన్ని అరికట్టలేని అసమర్థత కారణంగా ఈ రోజు మనం ప్రతి పీపాకు పదేండ్ల నాటి కంటే అదనంగా రు.3,233.24 చెల్లించాము. పదేండ్ల క్రితం రూపాయి విలువ డాలరుకు 51.13 ఉండగా మోడీ ఏలుబడిలో 2022 జూన్ పదిన అది 77.79కి దిగజారింది, పదమూడవ తేదీన 78.29కి పతనమై మరో కొత్త రికార్డు నమోదు చేసింది. ఇప్పుడు 83కు అటూ ఇటూగా ఉంది. అందువలన పదేండ్ల క్రితం, ఇప్పుడు ముడి చమురు ధర ఒకే విధంగా ఉన్నప్పటికీ మనం చెల్లించే మొత్తం భారీగా పెరుగుతుంది. రూపాయి విలువను కాపాడలేదంటూ నరేంద్రమోడీతో సహా బిజెపి నేతలందరూ మన్మోహన్ సింగ్ సర్కార్‌ను దులిపివేశారు. మోడీ సర్కార్ నిర్వాకానికి ఇప్పుడు దేశ ప్రజలందరూ మూల్యం చెల్లించాల్సి వస్తోంది. గత కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల గురించి నిరంతరం ఊదరగొడుతుంటారు. 1995లో స్వదేశీ ముడిచమురు ఉత్పత్తి 32.2మిలియన్ టన్నులు. దిగుమతుల మీద ఆధారపడటం తగ్గించుకోవాలి, స్వదేశీ ఉత్పత్తిని పెంచుకోవాలని రోజూ సుభాషితాలు చెబుతుంటారు.మోడీ ఏలుబడిలో 2022 నాటికి 28.4మిలియన్ టన్నులకు దిగజారింది. ఎంతో కీలకమైన ఈ రంగంలోనే మన ప్రతిభ ఇలా ఉంటే దేశాన్ని ముందుకు తీసుకుపోతాం, అగ్రస్థానానికి చేరుస్తాం అంటే ఉట్టికి ఎగరలేని వారు స్వర్గానికి ఎగురుతాం అన్నట్లుగా ఉంది.

కరోనా సంక్షోభంలో కార్పొరేట్ శక్తులను నరేంద్ర మోడీ సర్కార్ ఎలా ఆదుకున్నదో, జనం అప్పుల పాలై దివాలా తీస్తే ధనికుల దగ్గర సంపద ఎలా పోగుపడిందో చూశాము. ఇప్పుడు ఉక్రెయిను సంక్షోభం కారణంగా మన దేశంలో జనం ధరల పెరుగుదలతో అల్లాడిపోతుంటే రష్యా నుంచి చౌకగా దిగుమతి చేసుకున్న ముడిచమురును శుద్ధి చేసి ఐరోపా దేశాల కోసం ఎగుమతి చేస్తున్నారంటే దీని వలన లబ్ది పొందేది ఎవరు? మన జనమైతే కాదు, పోనీ ఐరోపా దేశాల నుంచి వాటికి ప్రతిగా నరేంద్రమోడీ పలుకుబడితో తక్కువ ధరలకు సరకులను దిగుమతి చేసుకుంటున్నామా అంటే అదీ లేదు. రష్యా నుంచి దిగుమతుల వలన మన జనానికి కలిగినకలుగుతున్న మేలు ఇదీ అని ఎవరినైనా చెప్పమనండి ! ■

# వేతనాల్లో అంతులేని వివక్ష!

దేశంలో ఎక్కడ చూసినా అంతులేని వివక్ష కొనసాగుతున్నది. వేతనాల విషయంలోనూ కనిపిస్తున్న వివక్ష ప్రస్తుత పాలకుల దుర్మార్గపు పోకడలకు అద్దం పడుతుంది. ఒకె పనికి ఒకే వేతనం అనే నినాదం ఈనాటి కాదు.. కానీ, శతాబ్దాలుగా అమలు కావడం లేదు. అజీమ్ ప్రేమ్జీ విశ్వవిద్యాలయం లోని సెంటర్ ఫర్ సస్టెయినబుల్ ఎంప్లాయిమెంట్ విభాగం నిర్వహించిన సర్వేలో దిగ్భ్రాంతి కలిగించే అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఆ సర్వే నివేదిక ప్రకారం, చాలా సందర్భాల్లో, పురుషులతో పోలిస్తే మహిళల వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయి. కుల, మతాల ఆధారంగా కూడా వేతనాలు మారిపోతున్నాయి. లింగ వివక్షతోపాటు సామాజిక వివక్ష కూడా కొనసాగడం దారుణం. ఒకే పని చేస్తే పురుషులు, మహిళల మధ్యేకాదు.. కులాల మధ్య కూడా వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తున్నది. ఒకే పనిచేసే ఉన్నత కులస్తులకు, అదే పని చేసే దళిత కులాలకు మధ్య వేతనాల్లో వ్యత్యాసం ఉందనేది చేదు నిజం. అక్కడ కూడా పురుషుల కన్నా స్త్రీలకు తక్కువ వేతనం లభిస్తోంది. ఎక్కువ ఆదాయంగల పనుల కంటే తక్కువ ఆదాయం వచ్చే పనుల్లోనే ఈ వివక్ష చాలా ఎక్కువగా ఉంది. అంతేగాక, అధిక జీతాలు పొందే ఉద్యోగాల్లో తప్ప మిగిలిన అన్ని రకాల ఉద్యోగ, ఉపాధి పనుల్లోనూ మహిళలకు పురుషుల కన్నా తక్కువ వేతనాలు అందుతున్నాయి. అధిక జీతాలు పొందే ఉద్యోగాల్లో విద్యావంతులే ఉంటారు. ఇలాంటి ఉన్నత స్థాయి ఉద్యోగాలకు వెళ్లే మహిళలకు సహజంగానే యామాన్యాలతో వేతనంపై చర్చించే లేదా తమ డిమాండ్లను స్పష్టం చేసే అవకాశం ఉంటుంది. అందుక, ఉన్నత స్థాయి ఉద్యోగాల్లో స్త్రీ, పురుషుల మధ్య వేతనాల్లో వ్యత్యాసం దాదాపు ఉండదు. కానీ, తక్కువ ఆదాయం పొందే ఉద్యోగాలకు వెళ్లే మహిళలకు తమతమ యాజమాన్యాలను డిమాండ్ చేసే అవకాశం లేదు. కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని, 'ఎంతోకొంత ఆదాయం వస్తే చాలు' అనే అభిప్రాయానికి వస్తారు. పురుషులతో సమానంగా తనకూ వేతనాలు ఇవ్వమని అడిగే ఆలోచన కూడా వారికి రాదు. ఇలావుంటే, కొన్ని రకాల పనుల్లో కొన్ని సామాజిక వర్గాలే కనిపిస్తున్నాయి. ఆ పనుల్లో కూడా స్త్రీ, పురుష వివక్ష కనిపిస్తోంది. స్వయం ఉపాధి రంగంలో ఒకే రకమైన పనులు చేసే పురుషుల కన్నా స్త్రీలకు 40 శాతం తక్కువ సంపాదన ఉంది. క్యాజువల్ వేజ్ ఉద్యోగాల్లో 64 శాతం, సాధారణ వేతన పనుల్లో 76 శాతం వ్యత్యాసం కనిపిస్తోంది. మరో రకంగా చెప్పాలంటే, రోజువారి వేతనాల ప్రాతిపదిక పొందే ఉపాధి పనుల్లో వివక్ష అధికంగా ఉంది. ప్రతి కులంలోనూ పురుషుల కన్నా మహిళలకు తక్కువ వేతనం లభిస్తోంది. ఉదాహరణకు రెగ్యులర్ వేజ్ (సాధారణ వేతనాల) విభాగంలో ఎస్‌సి, ఎస్‌టిలకు నెలకు రూ. 13,735 వేతనం లభిస్తుండగా, ఇతరులు రూ. 18,005 అందుకుంటున్నారు. ఈ విభాగంలో హిందువులకు సగటున నెలకు 17,197 రూపాయలు లభిస్తుండగా, ముస్లింలకు లభిస్తున్న మొత్తం రూ. 13,550 మాత్రమే. స్థూలంగా చూస్తే, పురుషులకు 17,910 రూపాయలు సగటు వేతనం లభిస్తుండగా, స్త్రీలకు 13,666 రూపాయలు దక్కుతున్నాయి. సొంతంగా ఏదోఒక పనిచేసుకుని పొట్ట పోసుకునే వారి సంపాదనలోనూ దురదృష్టవశాత్తు ఇలాంటి అంతరాలు ఉన్నాయి. ఒకే రకమైన పనిచేస్తున్నా ఎస్‌సి, ఎస్‌టిలకు 8,271 రూపాయలు నెలకు లభిస్తుండగా, ఇతరులు 11,539 రూపాయలు సంపాదిస్తున్నారు. హిందువులకు సగటున 10,663 రూపాయలు లభిస్తుండగా, ముస్లింలకు 10,395 రూపాయలు మాత్రమే లభిస్తోంది. ఈ విభాగంలో పురుషులతో పోలిస్తే మహిళల సంపాదన చాలా తక్కువ. పురుషులు సగటున రూ. 12,099 సంపాదిస్తుండగా, మహిళలకు కేవలం రూ. 4,809 మాత్రమే లభిస్తున్నాయి. ఇక చిన్న వ్యాపారులు చేసుకునే మహిళలు అత్యధికంగా వివక్షకు గురవుతున్నారు. వీరికి రుణాలు లభించడం కూడా కష్టమవుతుంది. కులమతాలకు అతీతంగా మహిళల పట్ల ఈ వివక్ష కొసాగుతోంది. క్యాజువల్ వేతనాల విభాగంలో ఎస్‌సి, ఎస్‌టిలకు రోజుకు సగటున రూ. 309 లభిస్తుండగా, ఇతరులకు రూ. 344 ముడుతున్నాయి. మొత్తం మీద పురుషులకు 358 రూపాయలు వేతనం వస్తుండగా. స్త్రీలకు 230 రూపాయలు మాత్రమే లభిస్తున్నాయి. వేతనాల్లో నేకాదు... గౌరవ మర్యాదల్లోనూ ఈ వివక్ష స్పష్టంగా కనిపిస్తున్నది. ఎక్కువ ఆదాయం సంపాదిస్తున్న మహిళలు కూడా సామాజికపరమైన ఈ వివక్ష నుంచి తప్పించుకోలేకపోతున్నారు.



మహిళ

# అగ్నిగోళంగా మారుతున్న భూగోళం

పర్యావరణ పరిరక్షణ దిశగా సరైన అడుగులు పడడం లేదు. మనిషి తన ఉనికినే ప్రమాదంలోకి నెట్టుకుంటూ, అంతులేని వాతావరణ కాలుష్యాన్ని సృష్టిస్తున్నాడు. ఉత్తర అట్లాంటిక్ మహాసముద్రం గతంలో ఎన్నడూ లేనంత వేడిని గత ఏడాది చవిచూసింది. అంటార్కటిక్ సముద్రపు మంచు కరగడం ప్రారంభమైంది. సాధారణంతో పోలిస్తే ఉష్ణోగ్రతలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే, రాబోయే రెండు మూడు దశాబ్దాలో ఏం జరుగుతుందో ఊహించడానికి భయం వేస్తున్నదని అమెరికన్ మెటీరోలాజికల్ సొసైటీ బులిటెన్‌లో ప్రచురించిన వ్యాసంలో రచయిత టిల్ కుష్రిబోట్ ఆందోళన వ్యక్తం చేశాడు. పారిశ్రామికీకరణకు ముందున్న కాలంతో పోలిస్తే ఇప్పుడు భూమి ఉష్ణోగ్రత సగటున 3 డిగ్రీల సెల్సియస్ (5.4 డిగ్రీల ఫారెన్‌హీట్) అధికం. ఈ మార్పుల కారణంగానే నిత్యం ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకుంటున్నాయి.

# కమ్యూనిస్టులతో మైత్రి కాంగ్రెస్‌కే మేలు

తెలంగాణ లోని మొత్తం 17 పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఎర్రజెండా పార్టీ లకు మూడు నుంచి ఐదు శాతం ఓట్లు ఉంటాయి. కోల్ బెల్ట్ లో అయితే 12 నుంచి 25 శాతం ఓట్లు ఉంటాయి. కోల్ బెల్ట్ లోని 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు సిపిఐ ప్రధానంగా దోహద పడింది. కొత్తగూడెంలో పార్టీ బలంతో పాటు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు ఉన్న వ్యక్తిగత పలుకుబడి, కాంగ్రెస్ మద్దతుతో ఆ స్థానంను సిపిఐ సాధించుకోగలిగింది. సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల మద్దతు కూడ కాంగ్రెస్ కు పలు చోట్ల ఎస్సెట్ అయ్యింది.త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కూడ కమ్యూనిస్టుల మద్దతు కాంగ్రెస్‌కు ఎంతో ముఖ్యం, ప్రధానం అనే విషయాన్ని కాంగ్రెస్‌లో గుర్తిస్తున్నారో, లేదో తెలియదు కాని, రాష్ట్రంలో చాపకింద నీరులా బిజెపి విస్తరిస్తున్న విషయాన్ని విస్మరించడం మంచిది కాదు! లౌకికవాద శక్తుల ఐక్యత రాష్ట్రానికి, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి అవసరం, టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం మద్దతు కూడ కాంగ్రెస్‌కు గత అసెంబ్లీ ఎన్నికల్లో కీలకంగా పని చేసింది. పార్లమెంట్ ఎన్నికల్లోను టిజెఎస్ మద్దతు కొనసాగుతుంది. స్వయం కృతాపరాధం ఫలితంగా, ఒక వైపు బిఆర్ఎస్ బలహీన పడిపోయింది. బిఆర్ఎస్ స్థానంలో బిజెపిని తీసుకుని రావాలని కొన్ని శక్తులు చేస్తున్న ప్రయత్నాలకు రాష్ట్రంలో 2019 పార్లమెంట్ ఎన్నికల్లోనే బీజం పడింది. విషయాన్ని అప్పుడు రెండోసారి అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ, ముఖ్యంగా కెసిఆర్ నిర్లక్ష్యం చేసారు.ముందు టిడిపి, ఆ తర్వాత కాంగ్రెస్‌ను బలహీనం చేసే పనిలో కెసిఆర్ పడ్డారు తప్ప బిజెపి ఈ పరిస్థితిని తనకు అనుకూలంగా మార్చుకుంటున్నదని, ఆ పార్టీ తనని బిఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం అనుకుంటున్నదని కెసిఆర్ భావించలేదు. పైగా పిఎం నరేంద్ర మోడీతో మంచి సంబంధాలు ఉన్నాయి అనే నమ్మకంతో ఉన్నారనిపిస్తుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు వామపక్షాలతో పొత్తు ఖాయం అనుకున్నారు. మునుగోడు ఉప ఎన్నికల్లో వారి



మద్దతు తీసుకుని బిఆరెస్ అభ్యర్థి గెలిచాడు! అంతా రాసుకుని, పూసుకుని తిరిగారు. తీరా అసెంబ్లీ ఎన్నికలు వచ్చే సరికి, వామపక్షాలతో దోస్తీ కట్ చేసేసారు. ఎందుకు? ఏమిటి? తెలియదు! అదే కెసిఆర్ ప్రత్యేకత! ఆయన ఎవరితో ఎప్పుడు స్నేహం చేస్తారో అంతు చిక్కని విషయం! అదే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన వ్యూహం బెడిసి గద్దె దిగే పరిస్థితికి ఒక కారణంగా కూడ చెప్పవచ్చు! ఇప్పుడు ఆయన ఒంటరి అయ్యారు. అటు బిజెపితో దోస్తానా బెడిసి కొట్టడంతో, బిఆర్ఎస్‌తో తమకు ఎలాంటి బంధం, ఒప్పందం లేదని పార్లమెంట్ ఎన్నికలకు ముందే తేల్చి చెప్పాలనే ఉద్దేశం కావచ్చు, ఎమ్మెల్సీ కవితను మద్యం స్కాం లో అరెస్ట్ చేశారు.పీఎం మోడీ మూడు రోజులు తెలంగాణ లో, అటు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. సభల్లో మాట్లాడారు. హోంమంత్రి అమిత్‌షా కూడ వస్తూ పోతూ ఉన్నారు. బిఆర్ఎస్, కెసిఆర్ సంగతి పక్కన పెడితే, పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపిని నిలవరించాలి అంటే తప్పని సరిగా వామపక్షాల మద్దతు కాంగ్రెస్ పార్టీ తీసుకోవాలి. టిపిసిసి అధ్యక్షుడు కూడ అయిన సిఎం రేవంత్ రెడ్డి ఆ దిశన యోచించాలి. ఇప్పటికే ఈ ఎన్నికల్లో ఉత్సాహంగా పని చేస్తారు అనే ఉద్దేశంతో కాబోలు, సిఎం 40కి పైగా కార్పొరేషన్ లకు చైర్మెన్‌లుగా పార్టీ నేతలను నియమించారు. వారు అంతా సహజంగానే పదవులు, ప్రోటోకాల్‌లు ఉంటాయి కాబట్టి, పార్టీ గెలుపుకు ప్రయత్నం చేస్తారు. టిక్కెట్ల ప్రకటన కూడ త్వరగా జరిగితే రంగం లోకి అభ్యర్థులు కూడ వెళతారు. గెలిచే గుర్రాల సంగతి పక్కన బెడితే కాంగ్రెస్, దాని కూటమి హవా ప్రస్తుతం తెలంగాణ లో ఉంది కాబట్టి, జాగ్రత్తగా, సమన్వయంతో పని చేసుకుంటే కాంగ్రెస్ కు మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉన్నది అంటే అతిశయోక్తి కాదు! కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తమకు ఖమ్మం లేదా వరంగల్ పార్లమెంట్ స్థానం ఇవ్వాలని పట్టు పడుతున్నది. బిజెపిని నిలువరించే శక్తి వామపక్షాలకే ఉన్నది. వామపక్షాలకు గాను ఒకే ఒక్కడు సిపిఐ ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు ఉన్నప్పటికీ మొత్తం ప్రజల గొంతు వినిపిస్తున్నారు. అదే మరి, కమ్యూనిస్టులు అంటే అట్లనే ఉంటారు.

ఎండి. మునీర్,
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# ఆనంద జీవనం ఆరోగ్యానికి ఔషధం

ఆనందం వెలకట్టలేని మానసిక ఆరోగ్య సంపద. ఆనందంగా జీవించడం ఓ అద్భుత కళ. మన అస్థిత్వానికి అదే పునాది. ఆనందం అంగట్లో కొనగలిగే వస్తువు కాదు. నవ్వులు నర్తించే ముఖంలో అసలైన ఆనందం ఉన్నట్లు కాదు. నవ్వని వారు దుఃఖంలో ఉన్నారని కూడా కాదు. మానసిక సంతోషానికి, ముఖంలో కనిపించే నవ్వులకు సంబంధం లేదు. మనస్ఫూర్తిగా ఆనందించే వారి ముఖంలో కోటి దీవ్వెల వెలుగులు జనిస్తాయి. అంతరంగ ఆనంద బావిలో జనించే స్వచ్ఛ ఊటయే సంతోషాల సంపద. మన అనుమతి లేకుండా సంతోషాన్ని ఎవరూ మనకు ఇవ్వలేరు. ఆనందం వేటలో నవ్వులను మరిచి బతుకుల్ని చీకటిమయం చేసుకునే అమాయకులు ఎందరో మన మధ్య మరమనుషుల్లో బతుకుతూ ఉన్నారు. ఆనందానికి కొలమానం లేదు. ఆనందాన్ని చూడటానికి, వర్ణించడానికి వీలు కాదు. అనుభవించిన వారికి మాత్రమే ఆనందం అంటే ఏమిటో తెలుస్తుంది.

**ఆనందం ఓ అద్భుత మానసిక స్థితి**

మనసారా నిద్రను పోగలిగే వారి మనసు ఆనందంతో నిండి ఉంటుంది. మన జీవనశైలి, ఆర్థిక వెసులుబాటు, ఆలోచనా విధానం, వ్యక్తిగత అలవాట్లు, విద్య, వివేకం, సంతృప్త భావన, ఆధ్యాత్మిక భావన, మానవీయ కోణం, సర్దుకుపోయే గుణం, ఆశావహ దృక్పథం, కుటుంబ నేపథ్యం, బంధుమిత్రులు, హిత సహచరులు, కార్యాలయ వాతావరణం, అలవాట్లు, సామాజిక స్థితులు, సాంస్కృతిక ఆచారాలు, మానవ సంబంధాలు, భావోద్వేగాల నియంత్రణ, అత్యల్ప విషయాల్లో అత్యధిక సంతోషాన్ని వెతుక్కోవడం, ఆహారపు అలవాట్లు, ఆశదురాశ, ఈర్ష్యఅసూయ లాంటి అనేక అంశాలు ఆనంద క్షణాలను ప్రభావితం చేస్తాయి. ఒక చిన్న సమస్య ఎదురైనపుడు సన్మార్గంలో పరిష్కరించే ప్రయత్నం చేయడానికి బదులు, ఆ సమస్యను తలచి, వగచి, వందల సార్లు కుమిలిపోతే అపురూప ఆనంద క్షణాలు హరించుకు పోతాయి. మనిషి చేపట్టే ప్రతి కార్యానికి అంతిమ లక్ష్యం ఆనందం పొందటమే కదా.

ఆనందమయ జీవితమే గమ్యంగా మానవ ఆరాట పోరాటాలు సాగుతున్నాయి. ఆనందంతో కూడిన జీవనశైలి నేటి ఆధునిక మరమనిషికి అందని ద్రాక్షగానే తోస్తున్నది. ఆనందమయ జీవన విధానాన్ని అవలంభించే పౌరులకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తున్నది. ఆనందమే ఆరోగ్యమని, ఆరోగ్యమే మహాభాగ్యమనే నానుడి మనందరికీ విదితమే. సిరిసంపదలు, కీర్తి ప్రతిష్టలు, పరువు ప్రతిష్టలు మాత్రమే ఆనందమయ జీవితానికి కారణం కాకపోవచ్చు. ప్రశాంత మానసిక స్థితి మాత్రమే సంతోష సంపదల జననానికి కారణమని తెలుసుకుందాం. సంతోషమయ జీవన విధానాన్ని విశ్వ మానవాళి అలవర్చుకోవాలనే సదుద్దేశంతో ఐరాస సలహాదారు జైమీ ఇల్లియన్ చొరవతో జూలై 2012లో ఐరాస జనరల్ అసెంబ్లీ తీర్మానం ప్రకారం ప్రతి ఏటా 20 మార్చిన 'అంతర్జాతీయ ఆనంద/సంతోష దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ హాపీనెస్)'ను 2013 నుండి పాటిస్తున్నాం. జీవితంలో ఆనందం యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు అవగాహన పరిచే ప్రయత్నంలో భాగంగా అంతర్జాతీయ ఆనంద దినోత్సవాన్ని నిర్వహించుట జరుగుతోంది. 2015లో ఐరాస చేపట్టిన 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో గుర్తించబడిన పేదరిక నిర్మూలన, సమానత్వ సాధన, భూగ్రహ పరిరక్షణ అంశాలను అమలు చేయుట ద్వారా మానవాళికి సుఖసంతోషాలు సిద్ధిస్తాయని ప్రతిపాదించారు.

అంతర్జాతీయ ఆనంద దినోత్సవం–2024 నినాదంగా 'హాపీనెస్ టుగెదర్' అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేస్తున్నారు. మరో కరోనా వైరస్ విష అల రావచ్చనే హెచ్చరికలతో పాటు రష్యాఉక్రెయిన్ భీకర యుద్ధం నడుమ మానవాళి ఆనంద క్షణాలు కరిగి పోతున్నాయి. ప్రపంచ కరోనా సంక్షోభంతో మానసిక ఒత్తిడి పెరుగుతూ, సుఖసంతోషాలకు దూరం అయ్యాం. విపత్తుల కోరల్లో చిక్కుకుండా వివేకాన్ని ప్రదర్శిస్తూ జీవితాన్ని ఆస్వాదించడం నేర్చుకోవాలి. పరహిత భావన కలిగిన జీవనశైలి ఆనందాన్ని ప్రసాదిస్తుంది. ప్రపంచ ఆనంద నివేదిక ఆధారంగా 146 దేశాల జాబితాలో అమితానందమయ దేశాలుగా ఫిన్‌లాండ్, డెన్మార్క్, నార్వే, ఐస్‌లాండ్, నెదర్‌లాండ్, స్విట్జర్లాండ్, స్వీడెన్, న్యూజిలాండ్, కెనడా, ఆస్ట్రియాలు ముందున్నాయి. ప్రపంచ దేశాల్లో ఆనంద సూచిక జాబితాలో చివరన భారతదేశం 126వ ర్యాంకులో ఉంది. ఇండియా హాపీనెస్ రిపోర్ట్ ప్రకారం మిజోరామ్, పంజాబ్, గుజరాత్, తెలంగాణ, యూపీ, అండమాన్ అండ్ నికోబార్ రాష్ట్రాలు ఆనంద సూచిక జాబితాలో ముందుండగా, ఒడిషా, ఉత్తరాఖండ ఛత్తీస్‌ఘడ్‌లు చివరన ఉండడం గమనించారు.

**ఆనందంగా ఉందాం..ఆనందాన్ని పంచుదాం..**

మనకు ఇష్టమైన పనిలో సంతోషం ఉంటుంది. ఏ పని చేసినా ఇష్టపడడం అలవాటు చేసుకున్న వారు సర్వదా సంతోషంగా ఉంటారు. సుఖదుఃఖాలు, ఇష్టఅయిష్టాలు, కష్టనష్టాలు అనేవి మానసిక భావనకు సంబంధించినవి మాత్రమే అని గమనించాలి. సంతోషంగా ఉండగలగడం ఓ అపూర్వ మానసిక ఆస్తి. జీవితంలోకి ప్రతి క్షణాన్ని ఆనందంగా ఆస్వాదించే అపూర్వ భాగ్యం మన చేతుల్లోనే ఉండదని గుర్తించాలి. మనం ఆనందంగా ఉండాలంటే, మన చుట్టూ ఉన్న వారు కూడా ఆనందంగా ఉండాలి. కావున మనం ఆనందంగా ఉండడం, ఆనందాల్ని పంచడం జీవిత పరమార్థంగా చేసుకోవాలి. మరొకరి సంతోషానికి మనం కారణం అయినపుడు మనలో ఆనందం వెల్లివిరుస్తుంది. 'బీ హాపీ ; మేక్ అదర్స్ హాపీ' సూత్రాన్ని సదా ఆచరణలో పెడదాం. ఆరోగ్యకరంగా నవ్వుతూ, నవ్వులు పంచుతూ ఆనందమయ జీవితాన్ని ఆసాంతం ఆస్వాదిద్దాం.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

(20 మార్చి 'అంతర్జాతీయ ఆనంద దినోత్సవం')

## ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



**ప్రజాపక్షం/కేశంపేట:** గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వైద్య సిబ్బంది సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందజేయాలని డిప్యూటి డిఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. కేశంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం ఆరోగ్యకేంద్రం సిబ్బంది, ఫీల్డ్ సిబ్బందితో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాల అమలు తీరుపై డాక్టర్లు, సిబ్బందితో మాట్లాడారు. ఫీల్డ్ సిబ్బంది సకాలంలో విధుల్లో హాజరై ప్రజలకు వైద్య సేవలను అందించాలని, ప్రజలకు ఆరోగ్యంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నిఖిత, హెచ్ఇ శ్రీనివాస్, సిబ్బంది ఆంజనేయులు, ఉపేందర్‌రెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



**ప్రజాపక్షం/వనస్థలిపురం :** విద్యార్థులు, యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని, రాణించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. క్రాస్బో షూటింగ్ ఛాంపియన్ క్రితి మిశ్రాను ఆయన మంగళవారం అభినందించారు. ఇటీవల ఆగ్రాలో జరిగిన పదవ ప్రపంచ క్రాస్బో షూటింగ్ ఛాపించన్‌షిప్‌లో క్రితి బంగారు పతకం సాధించింది. వనస్థలిపురంలో ఉండే క్రితి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రితిలాంటి వాల్లను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు.



## అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లోకి చేరికలు

### షాద్‌నగర్ ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్/కేశంపేట:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఇతర పార్టీల నేతలు చేరుతున్నారని షాద్‌నగర్ ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్ వివరించారు. మంగళవారం షాద్‌నగర్ నియోజకవర్గంలోని కేశంపేట మండలం బోధనంపల్లి గ్రామానికి చెందిన 90మంది యువకులు స్థానిక ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో చేరారు. అదే విధంగా ఫరూఖ్‌నగర్ మండలం చౌలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నుష్రత్ రుక్సానా మొహమ్మద్ ఖాజా సమక్షంలో 60మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. గంట్లవెల్లి మాజీ సర్పంచ్ కర్రోళ్ల యాదమ్మ యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ సునీత రమేష్‌తోపాటు 50మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్‌తోపాటు మాజీ ఎంఎల్ఏ చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు హస్తం కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, వీరేష్, గ్రామ కమిటి అధ్యక్షులు బాలకృష్ణ, నీలం పాండు, చాకలి మల్లేష్, లింగారెడ్డిగూడ అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, మాజీ సర్పంచ్ రాములు, మైనార్టీ నేత మహ్మద్ ఇబ్రహీం, శ్రీనునాయక్, రాజు నాయక్, తులసిరామ్ నాయక్, వజ్రలింగం, జంగయ్యలు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు



**ప్రజాపక్షం/కేశంపేట:** కేశంపేట మండలం భైర్‌ఖాన్‌పల్లిలోని శ్రీలక్ష్మి నృసింహ్మస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం దేవాలయం ప్రాంగణంలో నిర్వహించిన బండలాగుడు పోటీలను జడ్పిటిసి తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి మాట్లాడుతూ భైర్‌ఖాన్‌పల్లి గ్రామస్తులు, ప్రజలు ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తారన్నారు. ఈ సంవత్సరం కూడా కళ్యాణంతో పాటు ఉత్సవాలు, బండలాగుడు పోటీలను ఘనంగా ఏర్పాటు చేశారని అన్నారు. ఉత్సవాల నిర్వాహకులను ఆమె అభినందించారు. పోటీల్లో విజేతలకు ఉత్సవాల నిర్వాహకులు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాఘవేందర్‌రావు, రూప్లానాయక్, యాదగిరిరావు, కృష్ణయ్య, కాంగ్రెస్ నాయకులు శ్రావణ్‌రెడ్డి, కొట్టం శశివర్ధన్‌రెడ్డి, యాదగిరిచారి పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఒత్తిడి ఉండొద్దు

**ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :** బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పరిధిలో 10వ తరగతి పరీక్ష కేంద్రాలను కమిషనర్ బి.శరత్ చంద్ర మంగళవారం పరిశీలించారు. బిజెఎంసి పరిధిలోని 5వ డివిజన్‌లో ఎస్ఎంపి స్కూల్,15వ డివిజన్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్,16వ డివిజన్‌ల్లో ప్రభుత్వ పాఠశాల యందు జరగుతున్న పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పరీక్షల కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలను ఒత్తిడి లేకుండా రాసే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.

## క్రికెట్ గ్రౌండ్ పనుల పరిశీలన

**ప్రజాపక్షం/నార్సింగి:** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని. 13వ వార్డులోని క్రికెట్ గ్రౌండ్ సిట్టింగ్ గ్యాలరీనీ డిఈ దివ్య జ్యోతితో కలిసి వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ త్వరితగతిన పనులను పూర్తి చేసి క్రికెట్ గ్రౌండ్ తొందరగా యువకులకు అందుబాటులోకి తేవాల్సిందిగా అధికారులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో నవ జ్యోతి యువజన సంఘం అధ్యక్షులు,రవి కాంత్ రెడ్డి,జనరల్ సెక్రెటరీ మధుసూదన్ రెడ్డి,వి అరవింద్,ఎం రామకృష్ణారెడ్డి,శరత్, చందు,సునీల్ రెడ్డి, కాంట్రాక్టర్ అనిల్ పాల్గొన్నారు.

## ఎంఎల్ఏ శంకర్‌కు సన్మానం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్‌ను మైనార్టీ సీనియర్ నేత మహ్మద్ ఇబ్రహీం సన్మానించారు. మంగళవారం ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్ నివాసంలో మైనార్టీ నేత మహ్మద్ ఇబ్రహీంతో పాటు బాబర్‌ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి చిత్ర పటాన్ని బహుకరించి ప్రత్యేకంగా సన్మానించారు. మైనార్టీ కార్పోరేషన్ ఏర్పాటు చేయడం, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రాధాన్యత కల్పించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తోపాటు ఎంఎల్ఏ వీర్లపల్లి శంకర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/యాచారం :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురకుల విద్యాలయాల సంస్థ అధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న ఫైన్ ఆర్ట్స్ పాఠశాలలో 6వ తరగతి కి సంబంధించి దరఖాస్తులు చేసుకోవాలని శంషాబాద్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కూకుట్ల యాదయ్య తెలిపారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలో అయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మల్కాజిగిరి, (ఏదులాబాద్ ఘట్కేసర్) వివిధ విభాగాల కోచింగ్ తో కూడిన 6వ తరగతి ప్రవేశాల కొరకు ఆసక్తి ఉన్న బాలబాలికల నుండి ఆన్‌లైన్‌లో 2024/25 సంవత్సరానికి దరఖాస్తులు చేసుకోవాలన్నారు.అన్‌లైన్ దరఖాస్తులు చేసుకొవడానికి ఏప్రిల్ 18 చివరి తేది. మే 5 ,2024న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. సందేహాలకు 180042545678 నంబరును సంప్రదించాలన్నారు.

## యువతలో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసే బాధ్యత పాలకులదే

### సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయాదేవి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యువతలో క్రిడా నైపుణ్యాన్ని వెలికితీసే బాధ్యత పాలకులదేనని, భగత్ సింగ్ కలలుగన్న అవినీతి, దోపిడి, అక్రమాలు లేని సమసమాజ స్థాపనకు యువకులందరూ కృషి చేయాలని సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఛాయా దేవి పిలుపునిచ్చారు. ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సందర్భంగా ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని క్రికెట్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన భగత్ సింగ్ మెమోరియల్ టోర్నమెంట్‌కు ఛాయా దేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రెండవ రోజు పోటీలలో పాల్గొన్న క్రిడాకారులను అభినందించారు. ఛాయా దేవి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో ఎన్నో క్రిడలకు సరైన ప్రొత్సహం అందించలేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు క్రిడాల్లో ప్రొత్సహించాలని కోరారు. భగత్ సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం చిరు ప్రాయంలోనే పోరాడి వీరమరణం పొందారన్నారు. భగత్ ఆశయ సాధనలో నేటి యువత పాటుపడాలన్నారు. భగత్ కలలుగన్న అవినీతి, అక్రమాలు, దోపిడి లేని సమసమాజ స్థాపనకు నేటి యువత నడుంబిగించాలన్నారు. దేశంలో అవినీతి, అక్రమాలతో కూడిన రాజకీయాలు సమాజాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాలంటే కార్పొరేట్ శక్తులు మాత్రమే అనేలా అపహాస్యం చేసేలా ఉన్నాయని విమర్శించారు. సేవ చేయాలనే యువత ఆలోచనలను నేటి పాలకులు కుతంత్రాలతో నాశనం చేస్తున్నారని అన్నారు. అందుకే ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులలో ఆర్థిక అరాచకాలు, నేరాలు చేసిన వారే ఉన్నారన్నారు. ఇది దేశ భవిష్యత్‌కు పెను ప్రమాదమన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పోలోజు లక్ష్మణ్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, నాయకులు మాజీద్, కళ్యాణ్, అనిల్, మహేష్‌లతో పాటు 12 జట్ల క్రిడాకారులు పాల్గొన్నారు.

## నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ఎంతో బాధ్యతతో కూడుకుని ఉండే ఎన్నికల విధులను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక సూచించారు. రానున్న పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకుని స్టాటిక్ సర్వైలెన్స్,ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర నిఘా బృందాల అధికారులకు మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ శశాంక శిక్షణ తరగతులు నిర్వహించారు.ఆయా పార్టీలు,అభ్యర్థుల ప్రచార సరళి పరిశీలన,ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలను నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం,నిరంతర తనిఖీల నిర్వహణ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పార్లమెంటు ఎన్నికల సందర్భంగా మూడు టీములు ఏర్పాటు చేసి ప్రతి టీమ్ ఎనిమిది గంటలు విధులు నిర్వర్తించే విధంగా డ్యూటీలు కేటాయించడం జరిగిందని చెప్పారు. వాహనములో లాగ్ బుక్కులు రాయాలని తెలిపారు.ఎన్నికల్లో నిఘా బృందాలు సమర్థవంతంగా, నిబద్ధతతో తమ బాధ్యత నిర్వహించాలని సూచించారు.ఎన్నికల సంఘం నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని,అన్ని పార్టీలు,అభ్యర్థుల పట్ల నిబంధనలకు అనుగుణంగా సమదృష్టితో వ్యవహరించాలన్నారు. తమపట్ల వివక్షను ప్రదర్శించారనే ఫిర్యాదులు రాకుండా పక్కాగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలకు గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు.ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు,మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా వాస్తవాలను నిర్ధారించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. 10 లక్షల పైన లావాదేవీలు ఉంటే ఆదాయ పన్ను శాఖ పరిధిలోకి వెళ్తుందని చెప్పారు. ఈ శిక్షణ తరగతులలో జిల్లా ఉప ఎన్నికల అధికారిని ప్రతిమ సింగ్, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సంగీత, ఎమ్.సి.సి నోడల్ అధికారి సౌమ్య,ఎన్నికల వ్యయం నోడల్ అధికారి సురేష్ మోహన్, ఎ ఆర్ ఓలు,పోలీస్ అధికారులు, ఎస్.ఎస్.టి, ఎఫ్.ఎస్.టి, వివిఎస్.టి టీంలు,సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## జోరుగా ఆస్తిపన్ను వసూలు కార్యక్రమం

### మార్చి 31 వరకు ఆస్తిపన్ను టార్గెట్ పూర్తి చేస్తాం

### డిప్యూటీ కమిషనర్ కె.రవికుమార్



**ప్రజాపక్షం/రాజేంద్రనగర్:** జిహెచ్ఎంసి రాజేంద్ర నగర్ సర్కిల్ 11 పరిధిలో 2023/24వ సంవత్సరానికి గాను ఆస్తిపన్ను జోరుగా సాగుతుందని, ఆర్థిక సంవత్సర టార్గెట్ 52కోట్ల ఆస్తిపన్ను వసూలు చేసేందుకు సర్కిల్ సిబ్బంది నిరంతం కృషి చేస్తున్నారని రాజేంద్ర నగర్ సర్కిల్ 11 డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్ అన్నారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ ఏడాది ఆస్తిపన్ను ఇప్పటికే రూ.44.5కోట్లు వసూలైందని మిగతా ఆస్తిపన్నును మార్చి నెలాఖరు గడువు కావటంతో ప్రత్యేక కార్యచరణతో ఆస్తిపన్ను వసూలుకై ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నమని తద్వారా టార్గెట్ పూర్తి చేస్తామన్నారు.ఇందుకుగాను 2023/24 ఆర్థిక సంవత్సరం వరకు చెల్లించాల్సి ఆస్తిపన్ను బకాయిల మొత్తాన్ని 10శాత వడ్డీతో ఏకకాలంలో చెల్లించేలా అవకాశం ఉందన్నారు.90శాత మాఫీ వన్‌టైం సెటిల్‌మెంట్ కింద ఆస్తిపన్ను చెల్లించే సదవకాశాన్ని ఆస్తి పన్ను బకాయిదారులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ తెలియజేశారు. ఈనెల 31వ తేదీలోగా ఆస్తిపన్ను బాకాయిలను వడ్డీ మొత్తంలో కేవలం 10శాతం చెల్లిస్తే సరిపోతుందన్నారు. ప్రజలంతా తమ తమ ఆస్తిపన్నును తప్పని సరిగా మార్చి నెలాఖరు వరకు చెల్లించి రాజేంద్ర నగర్ సర్కిల్ అభివృద్ధికి తోడ్పాడాలన్నారు. ఆస్తిపన్ను టార్గెట్ పూర్తి చేసేందుకు తమ సిబ్బంది ఆదివారాలు కూడా ఆస్తిపన్ను చెల్లించేందుకు పని చేస్తున్నరన్నారు. ఇంటి యాజమానులకు ఆస్తిపన్ను విషయంలో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

## అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలి

### బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్, నిజామాబాద్, కామారెడ్డి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, మెదక్, సిద్దిపేట, రంగారెడ్డి తదితర జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన అన్నదాతను అతలాకుతలం చేసిందని, పంటలు చేతికి రానున్న సమయంలో కురిసిన వడగండ్ల వాన రైతులకు కన్నీరు మిగిల్చిందని హరీశ్‌రావు 'ఎక్స్'లో పేర్కొన్నారు. వరి, మొక్కజొన్న, జొన్న పంటలతోపాటు బొప్పాయి, మామిడి సహా ఇతర ఉద్యాన పంటలు దెబ్బతినడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రెండు, మూడు రోజులుగా అకాల వర్షాలు కురుస్తున్నప్పటికీ, ప్రభుత్వం కనీసం స్పందించలేదని, రాజకీయాలు తప్ప, రైతు ప్రయోజనాలు పట్టని కాంగ్రెస్, ఇప్పటికైనా మేల్కొని, అన్నదాతకు అండగా నిలువాలని కోరారు. పంట నష్టాన్ని తక్షణమే అంచనా వేయడంతో పాటు, ఎకరాకు రూ. 10 వేల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్‌డిమాండ్ చేశారు.

## అక్రమంగా గంజాయి తరలింపు

### 3.20కిలోల గంజాయి స్వాధీనం..ఇద్దరు రిమాండ్‌కు తరలింపు



**ప్రజాపక్షం/కొత్తూరు:** అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎస్ఓటి పోలీసులు పట్టుకున్నారు. మంగళవానం సాయంత్రం శంషాబాద్ నుండి కొత్తూరుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారి వద్ద ఉన్న బ్యాగులను చెక్ చేశారు. ఆ బ్యాగుల్లో సుమారు 3.20కిలోల గంజాయి లభించిందని, చిన్న చిన్న పోట్లాలుగా కట్టి పరిశ్రమల్లో లేబర్ పని చేసే కార్మికులకు అధిక ధరకు విక్రయించి సోమ్ము చేసుకునేందుకు యత్నిస్తున్నారని పోలీసులు తెలిపారు. హైద్రబాద్‌లోని ధూల్‌పేట నుండి కొత్తూరుకు అక్రమంగా గంజాయిని సరఫరా చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతోనే తనిఖీలు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రకాష్ (22) కొత్తూరు వాసి, గోరిగె వెంకటేష్ (40)నాగేంద్రకాలనీ, రాళ్ళగూడ శంషాబాద్ వాసిగా గుర్తించినట్లు పోలీసులుల వివరించారు. వీరు ఇరువురు శంషాబాద్‌లో పరిచయం ఏర్పడి గంజాయికి అలవాటు పడ్డారని, అందులో భాగంగానే హైదారాబాద్ నుండి కొత్తూరుకు అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారని తెలిపారు. వీరి ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు కొత్తూరు పోలీసులు తెలిపారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** లోక్‌సభ 2024 ఎన్నికలకు సంబంధించి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నదని, దానిని ఉల్లంఘించిన వారు ఎంతటి వారైనా చర్యలు తప్పవని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనంలోని సమావేశ మందిరంలో ఆయన నగరంలోని అన్ని విభాగాల పోలీస్ ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఉచిత నగదు, మద్యం , మాదకద్రవ్యాల పంపిణీ మొదలైన వాటికి సంబంధించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పనిని మెరుగుపర్చడం, స్వాధీనం చేసుకోవడం, పెండింగ్‌లో ఉన్నటువంటి ఎన్‌బిడబ్ల్యూలను అమలు చేయడం, ఎన్నికలు ముగిసేవరకూ లైసెన్స్ పొందిన ఆయుధాలను తీసుకెళ్లడాన్ని నిషేధించాలని నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. నగదు స్వాధీనం కేసులను పరిష్కరించడానికి అప్పిలేట్ అథారిటీగా హైదరాబాద్ డిఈవో ద్వారా జిల్లా గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేశారు. రూ.10లక్షల నగదు కంటే ఎక్కువ నగదును స్వాధీనం చేసుకున్నట్లయితే ఆదాయపు పన్ను శాఖకు తెలియజేయాలని సూచించారు. త్వరలో అన్ని డిఆర్‌సి (పంపిణీ, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలు) తనిఖీ చేయడానికి హైదరాబాద్ జిల్లా డిఈవోతో కలిసి సంయుక్త పర్యటన చేస్తామని కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ నగరంలో ఇప్పటికే 18 సరిహద్దులలో చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నగదు, మద్యం తరలించడాన్ని నిరోధించడానికి ఇంటర్ కమిషనరేట్ సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆరు సిఏపిఎఫ్, 5 సిఐఎస్ఎఫ్, ఒక సిఆర్‌పిఎఫ్ కంపెనీల సిబ్బంది ఇంటర్ కమిషనరేట్ చెక్‌పోస్ట్‌లు, వాహన తనిఖీలు, ఫ్లాగ్ మార్చ్‌లు, నాకాబందీల వద్ద విధులు నిర్వహిస్తున్నారని నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

## బెంగళూర్ వేదికగా అవిశ్వాసంపై ప్రణాళికలు

### రేపు మరోసారి మేయర్‌పై అవిశ్వాసానికి సిద్ధమవుతున్న కార్పొరేటర్లు

**ప్రజాపక్షం/రాజేంద్రనగర్ :** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మళ్లి క్యాంపు రాజకీయలు మొదలై చివర దశకు చేరుకున్నాయి.శివ రాత్రి పండుగకు ముందుగా డీప్యూటీ మేయర్‌వర్గం ఈసారి క్యాంపు రాజకీయాలు గోవాలో కాకుండా కర్నాటక రాజధాని బెంగళూర్‌కు మారాయి. డిప్యూటీ మేయర్ వర్గంగా చెబుకుంటున్న 16మంది కార్పొరేటర్లు ఈ ఏడాది జనవరిలో కొన్నాళ్లు గోవా, ఆ తర్వాత హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో సూమారుగా 30 రోజులకు పైగా క్యాంపు రాజకీయాల అనంతరం మొదటి సారిగా మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టిన విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించిన నెల రోజుల్లోనే అవిశ్వాసం పెట్టాల్సి ఉండగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ 33 రోజుల అనంతరం అవిశ్వాసం పెట్టటం, ఈలోగా మేయర్ బుర్ర మహేందర్ గౌడ్ కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకోవటంతో మేయర్‌పై పెట్టి అవిశ్వాసం తీర్మాణం జరగలేదు. ఈసారి మాత్రం పకడ్బందీగా ఏవిధంగానైన మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాల్సిందేనని కంకణం కట్టుకొని రెండో సారి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్‌కు ఫిర్యాదు చేయగా ఈనెల 21న మరోసారి మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు జిల్లా కలెక్టర్ బిజెఎంసి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బిజెఎంసి కమీషనర్ కార్పొరేటర్లకు నోటీసులు జారీ చేసి అవిశ్వాస తీర్మానం కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే ఏది ఏమైనా ఈసారి మాత్రం మాగురి కచ్చితంగా మేయర్ బుర్ర మహేందర్ గౌడ్‌ను మేయర్ పీఠం నుంచి తప్పించటమే కార్పొరేటర్ల లక్ష్యంగా ఉన్నట్లు తెలిసింది.




#### మేయర్ పీఠం కాపాడుకునేందుకే కాంగ్రెస్ గూటికి చేరిన మేయర్ వర్గం

ఒంటేద్దు పోకడలు పోతున్న మేయర్ బుర్ర మహేందర్ గౌడ్ తన మేయర్ పీఠం కాపాడుకునేందుకే ఈనెల 4వ తేదీన మేయర్ బుర్ర మహేందర్ గౌడ్ తన అనుచర కార్పొరేటర్లు సాగర్ గౌడ్,పద్మావతి పాపయ్య యాదవ్, గోకరి శ్రీలత సురేష్ గౌడ్‌లతో కలిసి ఎఐసిసి ప్రధాన కార్యదర్శి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ దీపదాస్ మున్షి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారని పలువురు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బిజేఎంసీ అభివృద్ధికి తాము కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రకటించుకున్న వారు ఇదంతా ఓ పథకం ప్రకారం ఎంఎల్ఏ సూచిన మేరకే ఇందంతా డ్రామా నడుస్తుందని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ బిఆర్ఎస్‌ని మొత్తం ఖాళీ చేయించిన అనంతరం తన అనుచరులంతా పార్టీ మారిన తర్వాత నేనొక్కడిని ఏమి చేయగల్గుతానని ఆ తర్వాత స్థానిక ఎంఎల్ఏ కూడా చల్లాగా జారుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు విమర్శలున్నాయి. అధికారం పార్టీ, అభివృద్ధి అంటూ తమ పబ్బం గడుపుకునేందుకు, అక్రమంగా సంపాదించుకున్న ఆస్తులను కాపాడుకునేందుకే ఉన్నట్టుండి రాజకీయ నాయకులు ఓడిని, గెలిచిన గుంట నక్కల కాంగ్రెస్ పార్టీ కండువా వేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని పలువురు బహిరంగానే ఆరోపిస్తున్నారు. అధికార కాంగ్రెస్ అశీస్సులతో ఏలాగైన తన మేయర్ కుర్చీకై కాపాడుకోవాలనే కుట్రతోనే భాగంగానే అభివృద్ధి పేరును అడ్డుపెట్టుకొని కాంగ్రెస్‌లో మేయర్ తన అనుచరులతో కాంగ్రెస్‌లో చేరినట్లు పలువురు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అయితే ఈసారి అధికారం కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి పార్టీలకు చెందిన కార్పొరేటర్లు అవిశ్వాసం నెగ్గితే కచ్చితంగా బుర్ర మహేదర్ గౌడ్ మేయర్ ఫీఠం నుంచి తప్పుకోవల్సిందేనని పలువురు మేధావులు అంటున్నారు. ఒక వేళ మేయర్ కోర్డు నుంచి మళ్లి ఆర్డర్ తెచ్చుకుంటే అవిశ్వాస తీర్మాణం నిలిచిపోయే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు బావిస్తున్నారు.

#### రూ.1 కోటి నజరానకు లొంగని కార్పొరేటర్ల పంతంతో మేయర్ ఫీఠం ఉంటుందా? ఊడుతుందా?

మేయర్‌పై పెట్టిన అవిశ్వాసంకు మద్దతు పలుకవద్దని మేయర్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన 16మంది కార్పొరేటర్లకు ఒక్కక్కరికి 1కోటి రూ.లు అఫర్ ప్రకటించిన లొంగకుండా ఉన్న కార్పొరేటర్లు తమ పంతంతో మేయర్ ఫీఠం ఉంటుందా? ఊడుతుందా....తెలియని పరిస్థితి నెలకొంది. మేయర్‌ను తప్పించాలనే బెంగూళూర్‌లో క్యాంపు రాజకీయాల్లో ప్రణాళిలు చాల పక్బందిగా రూపొందుతున్నాయని తెలిసింది. మేయర్ వ్యతిరేక ఉన్న16మంది కార్పొటర్లలో బండ్లగూడ జాగీర్ 17వ డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మద్దెల ప్రేమ్ గౌడ్ సతీమణి కార్పొరేటర్ మద్దెల లతను మేయర్‌గా చేసేందుకు రంగం సిద్ధం చేశారు. అయితే రెండు సార్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ఓసారి విఫలం చెందిన మేయర్ వ్యతిరేకవర్గంగా ఈసారి ఆరు నూరైన నూరు ఆరైన తమ పంతం నెగ్గించుకోవాలనే ఉన్నట్లు తెలిసింది. అయితే దీన్ని మేయర్ కాంగ్రెస్ పార్టీ అండదండలతో ఏవిధంగా అవిశ్వాస తీర్మానం ఎదుర్కొంటారో వేచి చూడాల్సిందే.

#### జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు సిద్ధం చేస్తున్నాం
#### కమిషనర్ బి.శరత్ చంద్ర



రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 21వ తేదీన మేయర్ బుర్ర మహేందర్ గౌడ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు అంత సిద్ధం చేస్తున్నమని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. ఇప్పటికే సభ్యులందరికి నోటీసులు అందజేసినట్లు అవిశ్వాస తీర్మానం కోసం కౌన్సిల్ సమావేశంకు ఏప్పటిలాగానే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలోకి వచ్చిన ఏలాంటి ఇబ్బంది లేదు. కోర్డు నుంచి ఏదైన ఆర్డర్ వస్తే తప్ప అవిశ్వాస తీర్మానం రద్దవుతుందన్నారు.

## పాఠశాలల్లో అక్రమంగా పుస్తకాల విక్రయం



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి యథేచ్ఛగా విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డొనేషన్లు వసూలు చేస్తూ, అక్రమంగా పుస్తకాల వ్యాపారం చేస్తున్న సాక్రెట్ హార్ట్ పాఠశాల యాజమాన్యంపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. మేడిపల్లి మండలం ఉప్పల్ డిపోలో వద్ద ఉన్న సాక్రెట్ హార్ట్ పాఠశా ల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు పట్టించుకోకుండా పుస్తకాలు అమ్ముతుందని ఆరోపిస్తూ మంగళవారం ఎఐఎస్ఎఫ్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్, నాయకులు సాయి, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రాల్లో ఇబ్బందుల్లేకుండా చూడాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ గౌతమ్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆలియాబాద్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సెంట్ జోసఫ్ పాఠశాలల్లో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. జిల్లాలో 46766 రెగ్యులర్ విద్యార్థులకు గాను 46643 మంది, 17 మంది ప్రయివేట్ విద్యార్థులకు గాను ఏడుగురు పరీక్షలకు హాజరయ్యారని ఆయన తెలిపారు. ఎండలు తీవ్రంగాఉన్న దృష్ట్యా పరీక్షా కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు.

## కబ్జాల మల్లారెడ్డికి.. కాంగ్రెస్‌లో చోటులేదు : శ్రీకాంత్

**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** కాంగ్రెస్ పార్టీని, సిఎం రేవంత్‌రెడ్డిని గతంలో తీవ్రస్థాయిలో విమర్శించిన కబ్జాల మల్లారెడ్డికి కాంగ్రెస్‌లో చోటులేదని, కాంగ్రెస్ పార్టీ కోసం సైనికుడిలా పనిచేసిన నాయకులను అభిప్రాయాలను కాదని పార్టీలోకి తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ మేడ్చల్‌లోని వనరులను దోచుకొని... దాచుకోవడం కోసమే అధికార కాంగ్రెస్‌లో చేరదామని ప్రయత్నిస్తున్న మల్లారెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కాలేజీలు, హాస్పిటల్‌లు ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా నిర్మించి కోట్ల రూపాయాల విలువ చేసే భూములను అప్పనంగా కాజేశాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం పనిచేసే నాయకులను బెదిరింపులకు గురిచేసి నానాఇబ్బందులకు పాల్పడిన మల్లారెడ్డిని కాంగ్రెస్‌పార్టీ దగ్గరకు రావొద్దన్నారు. మేడ్చల్‌ను ఆగం చేద్దామని చేసే ప్రయత్నాని కాంగ్రెస్‌పార్టీ గమనిస్తుందని, మల్లారెడ్డి ఆటలను సాగనివ్వమన్నారు.

## మల్కాజ్‌గిరి ప్రజలు ఎంపిగా ఆదరిస్తారు

బిఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి



**ప్రజాపక్షం/మల్కాజ్‌గిరి:** మల్కాజ్‌గిరి ప్రజలు ఎంపిగా తనను ఆదరించి ఆశీర్వదిస్తారని మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం నేరేడ్‌మెట్‌లోని జికె ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడారు. మాజీ సిఎం కెసిఆర్ తనపై ఎంతో నమ్మకంతో మల్కాజ్‌గిరి పార్లమెంటు అభ్యర్థిగా ప్రకటించారని తెలిపారు. కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు సహకారంతో ఎంపి అభ్యర్థిగా ప్రకటించారని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో బిఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించారని, అలాగే తనను కూడా మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గంలోని ప్రజలు ఆదరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అయినా ఆరు గ్యారంటీలను ఇంకా అమలు చేయలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విజయశాంతి రెడ్డి, మేకల సునీత యాదవ్, సబిత, మీనారెడ్డి, మురుగేష్, బిఆర్ఎస్ నేతలు పరశురాంరెడ్డి, జగదీశ్‌గౌడ్, రావుల అంజయ్య, వెంకన్న, సత్తయ్య, భాగ్యానందరావు పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించాలి




**ప్రజాపక్షం/దుండిగల్ :** మౌలిక వసతులు కల్పించే వరకు తమ పోరాటం ఆగదని కాలనీవాసులు అన్నారు విలేకరులు ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లంపేట్ కౌన్సిలర్ భర్త ఆంజనేయులు మాట్లాడుతూ కాలనీలో కొందరు వ్యక్తులు మహిళలపై దౌర్జన్యం చేస్తున్నారన్న సమాచారంతో ఆపడానికి వస్తే డబ్బు ఇవ్వనందునే ప్రజలను రెచ్చగొడుతున్నట్లు బిల్డర్ తమపై ఆరోపించడం సరికాదన్నారు. మల్లంపేట జి ఎల్ ఎస్ విల్లాల బాధితులు 5వ రోజు నిరాహారదీక్ష చేపట్టారు. విలాస వంతమైన సౌకర్యాలను ఆశించడం లేదన్నారు. వాటర్, విద్యుత్, తాగునీరు, డ్రైనేజి లాంటి కనీస సౌకర్యాలు కల్పించాలని బిల్డర్ కు విజ్ఞప్తి చేశారు. మాకు విలాస వంతమైన సౌకర్యాలు అవసరంలేదన్నారు. కనీస సౌకర్యాలు కల్పిస్తే బకాయిలు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కాలనీలో రౌడీలు ప్రవేసిస్తూ పార్కులు ధ్వంసం చేసి మహిళలను, పిల్లలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. బిల్డర్ పై న్యాయ స్తానంలో పోరాటంచేయడానికైనా వెనకాడమన్నారు. ఈ విషయమై బిల్డర్ విజయలక్ష్మిని వివరణ కోరగా ఇప్పటి వరకు 60 విల్లాలకు మాత్రమే ఓసి ఇచ్చామన్నారు. పెండింగ్ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించామని నిర్ణీత గడువులోగా పూర్తి చేసి అందరికి అప్పగిస్తామన్నారు. పనులు చేస్తున్న కాంట్రాక్టర్లను అసోసియేషన్ పేరుతో అడ్డుకోవడం సరికాదన్నారు. రోడ్లు, డ్రైనేజి, మంజీర వాటర్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. రాజకీయ నాయకుల అండతో కాలనీవాసులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని రాజకీయ నాయకుల మాటలు విని మోసపోవద్దని అన్నారు.

## పెండింగ్ పనులు పూర్తయ్యేలా చర్యలు

కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉపాధి హామి పనుల్లో కూలీల సంఖ్యను పెంచి 100 శాతం పనులు పూర్తి అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. టెలి క్వారెన్స్ ద్వారా సంబంధిత అధికారులకు ముళ్ల పొదలు క్లియర్ చేయడం , రోడ్లకు సంబంధించిభూమి చదును చేయడం గ్రామాల్లో పెండింగ్ ఉన్న పనులన్నింటిని రెండు రోజుల్లో పూర్తి చేయాలని సంబంధించి అధికారులు దిశానిర్దేశం చేశారు. గ్రామ పరిధిలో ఎన్ఆర్‌జిఎస్ వ్యవస్థను బలోపేతం చేస్తు పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాలలో జాబ్‌కుర్డు ఉన్న వారందరికి పని కల్పిస్తు ముందుకు వెళ్లాలని అదేశించారు. అనుకున్న అంచనా ప్రకరం కూలీల సంఖ్యను పేంచాలన్నారు. ఇప్పటివరకు పూర్తి అయిన వాటికి ఎఫ్‌టిపిఓ తప్పని సారిగా జనరేట్ చేయాలని తెలిపారు. ప్రణాళిక ప్రకరం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను అదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ శ్రీనివాస్ జిల్లా పంచాయతీ అధికారి జయసుధ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి వసుచంద్ర మంగళవారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. వికారాబాద్ నియోజక వర్గంలోని పదవ పరీక్ష కేంద్రాలకు సంబంధించి మండలంలోని జీరాక్స్ సెంటర్‌లు మూసివేసారా లేదా అని పరిశీలించారు. అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మినారాయణ, రవీందర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదాయ మార్గాల కోసం అన్వేషణ

కూకట్‌పల్లిలో అక్రమార్జనకు తెరలేపిన కాంగ్రెస్ నాయకులు

సహకరిస్తున్న జిహెచ్ఎంసి అధికారులు



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన కూకట్‌పల్లి నియోజకవర్గంలో అక్రమ నిర్మాణాలకు మాత్రం అడ్డుకట్టపడటం లేదు. గతంలో బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు స్థానిక అధికారపార్టీ నాయకులకు అక్రమ నిర్మాణాలు ఆదాయ మార్గాలుగా ఉండేవి. బిఆర్ఎస్ నాయకులు రంగంలోకి దిగారని తెలిస్తే జిహెచ్ఎంసి అధికారులు సైతం ఆ వైపునకు కూడ కన్నెత్తి చూసే వారు కాదు. దీంతో బిఆర్ఎస్ నాయకులు ఆర్థికంగా బలపడడానికి అక్రమ నిర్మాణాలు ఉపయోగపడ్డాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు సైతం గతంలో బిఆర్ఎస్ నాయకులు చూపినా బాటలోనే నడవడానికి సిద్ధమైనట్టు తెలుస్తోంది. కొందరు నాయకులు ఇప్పటికే అక్రమార్జన కోసం మార్గాలను అన్వేషిస్తున్నట్లు స్థానికులు గుసగుసలాడుతున్నారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన నిర్మాణదారులు సైతం కాంగ్రెస్ నాయకులను ప్రసన్నం చేసుకుంటే అధికారులతో పాటు మరే ఏ ఇతరులతో తమకు ఇబ్బందులు ఉండవనే భావనకు వచ్చినట్టు తెలుస్తుంది. దీంతో కాంగ్రెస్ నాయకుల అక్రమార్జన నల్లేరు మీద నడకలా మారిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. బిఆర్ఎస్ నాయకులతో విసిగి, వేసారిన అక్రమ నిర్మాణదారులు కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో హమ్మయ్య అని ఊపిరి పూల్చుకున్నప్పటికీ, ఆ మధుర క్షణాలు కొన్ని రోజులకే నీరు కారిపోవడంతో అధికారంలోకి ఎవరు వచ్చినా మన బాధలు తప్పవనే భావనకు వచ్చినట్లు తెలుస్తోంది.

### సహకరిస్తున్న జిహెచ్ఎంసి అధికారులు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో కొంత నిరుత్సాహానికి గురైన కూకట్‌పల్లి జిహెచ్ఎంసి అధికారులు కాంగ్రెస్ నాయకులు సైతం బిఆర్ఎస్ నాయకుల బాటలో నడవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా బిఆర్ఎస్ నాయకుల్లా కాకుండా తిను, తినిపించు అనే విధంగా వ్యవహరిస్తుండడంతో అధికారుల ఆనందానికి పట్టపగలు లేకుండాపోయినట్టు తెలుస్తోంది. ఓ మహిమగల ఇంద్రుడు అతి ఉత్సవంతో కాంగ్రెస్ నాయకులకు సహకరించడంతోపాటు అందిన కాడికి దండుకుంటున్నట్లు సమాచారం. కాంగ్రెస్ నాయకుల అండతో అధికారి అక్రమ నిర్మాణదారులపై మరింత రెచ్చిపోతున్నారు. కాంగ్రెస్ నాయకులను అడ్డం పెట్టుకొని అందిన కాడికి దండుకుంటున్నట్టు జిహెచ్ఎంసి సిబ్బందే చర్చించుకుంటున్నారు. ఈ మహిమగల ఇంద్రుడి ఆగడాలకు ఎప్పుడు చెక్ పడుతుందోనని స్థానిక భవన నిర్మాణదారులు ఎదురుచూస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు అన్నీ తానై పెంచి పోషిస్తున్న ఆ అధికారి మిగతా అధికారుల నోటి కాడి కూడు లాగేస్తున్నాడని స్థానిక జిహెచ్ఎంసి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అనధికారికంగా కడుతున్న ఒక్కొక్క అంతస్తుకు లక్షన్నర నుండి రెండు లక్షల రూపాయల వరకు తీసుకుంటున్నట్లు జిహెచ్ఎంసి సిబ్బందే గుసగుసలాడుతున్నారు. డబ్బులు ఇవ్వని నిర్మాణదారుల పట్ల ఆయన కఠినంగా వ్యవహరిస్తున్నారనే ప్రచారం జనాల్లో జరుగుతుంది. కాంగ్రెస్ నాయకులు అండతో మరింత రెచ్చిపోతున్న ఆ అధికారి అక్రమార్జనకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఆ అధికారిపై స్థానికులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు.

### అధినాయకుడికి తెలియదా...?

ఓడిపోయినప్పటికీ నియోజకవర్గంలో అవినీతి రహిత పాలనకు కృషిచేస్తానని, కబ్జాలను, అక్రమ నిర్మాణాలను అరికడతానని నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతి కోసం కృషిచేస్తున్న నియోజకవర్గ ఇంచార్జ్‌కు కింది స్థాయి నాయకులు జరుగుతున్న తతంగం తెలియకపోవడం విశేషం. అక్రమార్జన కోసం కింది స్థాయి నాయకులు చేస్తున్న ఇలాంటి పనుల వల్ల కాంగ్రెస్ పార్టీకి చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉందని ఆ పార్టీ నాయకులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నియోజకవర్గంలో ఇన్ ఛార్జ్ కిందిస్థాయి నాయకులు చేస్తున్న ఇలాంటి తతంగాల వల్ల పార్టీకి చెడ్డ పేరు రాకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## బిజెపితోనే రైతుల సంక్షేమం

ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** పదేళ్లుగా రాష్ట్రాన్ని పాలించి అధోగతి పాలు చేసిన నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ మాటలు మోసం చేసాడే తప్ప రైతులకు చెప్పిన లక్ష రూపాయల రుణ మాఫీ చేయలేక పోయాడని, రైతాంగాన్ని అన్నిరకాల ఆదుకోవటంతో పాటు సంక్షేమ పథకాలతో సహకరించటం బిజెపితోనే సాధ్యమవుతుందని బిజెపి ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం జరిగిన రైతు సదస్సులో పాల్గొన్న ఆయన గత ఐదేళ్లుగా ఎంపిగా ఉన్న ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ నాడైనా ఈ ప్రాంతానికి వచ్చిన పాపాన పోలేదని, అలాంటి వ్యక్తి ప్రజలకు మేలు చేస్తాడంటే ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. మల్కాజిగిరి స్థానానికి పోటీచేసే అభ్యర్థిగా డబ్బులున్న వ్యక్తి ఎక్కడ దొరుకుతాడా అని చూస్తున్నాడని సిఎం రేవంత్‌రెడ్డిని ఆయన విమర్శిస్తూ ధర్మానికి, డబ్బు సంచులకు మధ్య జరిగే ఈ పార్లమెంటు ఎన్నికల్లో తనను గెలిపించి బిజెపికి మద్దతివ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపి కె.లక్ష్మణ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు పటోళ్ల విక్రం రెడ్డి, శ్రీధర్‌రెడ్డి జాతీయ మధుసుధన్‌రెడ్డి, జగన్‌మోహనరెడ్డి, అంజయ్య యాదవ్, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, శ్రీనివాస్, సురేష్, మల్లేష్ గౌడ్, శ్యాంసుందర్ శర్మ, అశోక్ ముదిరాజ్, సత్యానారాయణ, పవన్‌గౌడ్, బండారు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## తాండూరు మున్సిపల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు :**తాండూరు మున్సిపల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేంకు కృషి చేస్తానని తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు పట్టణ పరిధి 11వ వార్డు సాయిపూర్‌లోని విఘ్నేశ్వర కాలనీ కమిటి ఆద్వర్యాం ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం కాలని సమస్యలపై ఎంఎల్ఎకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రానున్న ఐదు సంవత్సరాలలో తాండూరు పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసే విధంగా చూస్తానన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలలో ఉందని తాను ఏలాంటి హామీలను ఇవ్వలేమన్నారు. స్థానిక కౌన్సిలర్ నీరాజబాల్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆహయంలో తమ వార్డులు ఎలాంటి నిధులు అందించ లేరని, నిధుల కెటాయిస్తున్నామని చెప్పి తమను మోసగించాలని ఆరోపించారు, తన ఐదు సంవత్సరాల పదవీకాలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు రాము, రవిరాజు, పార్టీ సీనియర్ నాయకులు పట్లోళ్ళ బాల్‌రెడ్డి, బంటు వేణు, బంటు మల్లప్ప, పట్టణ పార్టీ అధ్యక్షులు హాబీబ్‌లాల పాల్గొన్నారు.



### చేనేత హస్తకళను ఆదరించాలి

చేనేతను హస్తకళను అదరించాలని, తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళా ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. అంతకు ముందు చేనేత హస్తకళా కారులు చేపట్టిన ప్రదర్శనను ఎంఎల్ఎ మనోహర్‌రెడ్డి, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్‌తో కలసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వారంలో ఒక్కరు చేనేత దుస్తులను ధరించాలని సూచించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత హస్తకళ కళాకారులు ఒకే వేదికపైకి వచ్చిన వారు ఉత్పాత్తి చేసిన వస్తువులను అందరు ఆదరించాలని సూచించారు. చేనేత హస్తకళాలను ప్రభుత్వం ప్రోత్సహించాలని అన్నారు. వీరి సేవలను మరింత విస్తరించాలని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు నీరాజా బాల్‌రెడ్డి, రాములు, రవిరాజు, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వడ్డే శ్రీనివాస్, నాయకులు అజయ్ ప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షులు హబిబ్‌లాల, గౌరవ అధ్యక్షులు వడ్డే శ్రీనివాస్, ఆర్యవైస్య సంఘం నాయకులు కక్షం వీరేందర్,, చేనేత హస్తకళా నిర్వహకులు పవన్‌కుమార్, రాణి పాల్గొన్నారు.

## నకిలీ సర్టిఫికెట్‌లతో ఉద్యోగం

పరిశీలనలో ఉద్యోగి సస్పెండ్

కొడంగల్ వ్యవసాయ శాఖలో ఆలస్యంగా వెలుగులోకి



**ప్రజాపక్షం /కొడంగల్ :** ఒక ప్రభుత్వ ఉద్యోగి ఒక స్థానంలో పనిచేయాలంటే దాదాపు 3 నుంచి 5 సంవత్సారాలోపు చేస్తారు. అ తరువాత ఆ ఉద్యోగిని ఇతర ప్రాంతాలకు బదిలి చేస్తారు. కాని ఇక్కడి ఉద్యోగి మాత్రం గత 15 ఏళ్లుగా ఇక్కడే ఉద్యోగం చేస్తు తోటి ఉద్యోగులను సైతం చిత్రహింసలకు గురిచేస్తున్న పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ నేపథ్యంలోనే కమిషనర్ కార్యాలయంలో ధృవపత్రాల పరిశీలనలో 10వ తరగతి సర్టిఫికేట్‌ల తనిఖీలలో తన సర్టిఫికెట్ సరైంది కాదని దీంతో ఆయనను సస్పెండ్ చేసినట్లు ఆలస్యంగా వెలుగుచూసింది. కాని ఏ అధికారి మాత్రం ఈ విషయం బయటికి పొక్కకుండా గోప్యంగా ఉంచారు. ఇదంతా ఎక్కడో అనుకుంటున్నారా ఎక్కడో కాదండి... రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం అయిన కొడంగల్‌లో వెలుగు చూసిన ఘటన ఇది. వివరాల్లోకి వెళితే కొడంగల్ వ్యవసాయశాఖ కార్యాలయంలో గత 15 ఏళ్లుగా ఏవోగా విధులు నిర్వహిస్తున్న బాలాజీప్రసాద్ వ్యవహారం చూస్తుంటే ఇంత అంతకాదు బాబోయో. ఇతడు కొడంగల్‌లోనే మకాం చేసి ఉన్నతాధికారులను మచ్చిక చేసుకుని వారికి తాయిలాలు అందిస్తూ తన ఉద్యోగాన్ని కాపాడుకుంటూ వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయం పలుమార్లు తోటి ఉద్యోగులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లిన కూడా ఏలాంటి స్పందన లేక పోవడంతో గత్యంతరం లేక విధులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. అదే విధం గా ఇతను ఉద్యోగం చేస్తు నకిలీ విత్తనాల కేసులో ఉన్న వ్యక్తికి ఓ ప్రాంతంలో ఫర్టిలైజర్ దుకాణాన్ని అప్పగించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు వ్యక్తి కర్ణాటకలో నకిలీ పత్తి విత్తనాల గోదాం ఏర్పాటు చేసుకుని నియోజకవర్గంలో పలు ప్రదేశాల్లో ఏజెంట్ల ద్వారా పత్తివిత్తనాలు అందజేసినట్లు రుజువు అయిందని పుకార్లు ఉన్నాయి. నకిలీ విత్తనాలు విక్రయించిన వ్యక్తి కొంతకాలం జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదల అయినట్లు ప్రజలు చెబుతున్నారు. ఆయనతో పాటు కొడంగల్‌లోని పలు ఫర్టిలైజర్ దుకాణాలలో తాయిలాలు తీసుకుని ఆ దుకాణాలను నామమాత్రంగా తనిఖీలు నిర్వహించేవాడని ఆరోపణాలు ఉన్నాయి. ఫర్టిలైజర్ దుకాణాలకు వచ్చే ముందు ముందస్తుగా సమాచారం ఇచ్చేవాడని గుసగుసలాడుతున్నారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు అతడి దృవపత్రాల పరిశీలనలో అసలు విషయాలు బట్టబయలు కావడంతో సస్పెండ్ చేసినట్లు సమాచారం. కాని బాలాజీ ప్రసాద్ మాత్రం నాదగ్గర ఒరిజినల్ సర్టిఫికెట్స్ ఉన్నాయని అవి ఎక్కడో మిస్ అయ్యాయని తిరిగి తెచ్చి అధికారులకు అందజేస్తామని తెలిపినట్లు తెలుస్తోంది,

## బంగారు ఆభరణాల బ్యాగు పోగొట్టుకున్న మహిళ

రెండు గంటల్లో ఛేదించిన పోలీసులు



**ప్రజాపక్షం/నిజాంపేట్ :** బంగారు ఆభరణాల బ్యాగును ఓ మహిళ పోగొట్టుకున్న సంఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోగొట్టుకున్న రెండుగంటల్లోనే పోలీసులు మహిళకు బంగారు ఆభరణాల బ్యాగును అందించారు. బాచుపల్లి సిఐ ఉపెందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా, రాపర్తి నగర్‌కు చెందిన తిరుమల కవిత (48) నగరానికి తన కుమార్తె ఇంటికి వచ్చింది. మంగళవారం ఉదయం బాచుపల్లిలోని విజేత సూపర్ మార్కెట్ వద్ద బస్సు దిగింది. తన కూతురు ఇంటికి వెళ్లే సమయంలో మార్గమద్యలో తనవద్ద ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాల బ్యాగును కవిత పోగొట్టుకుంది. ఈ మేరకు కవిత బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకున్న పోలీసులు ఫిర్యాదు అందుకున్న రెండు గంటల్లోనే కవిత బ్యాగును స్వాధీనం చేసుకుని బాధితురాలికి అందజేశారు. రెండు గంటల్లోనే బంగారు ఆభరణాల బ్యాగును ఛేదించి బాదితురాలికి అందించిన సందర్భంగా బాచుపల్లి పోలీసులను బాలానగర్ డిసిపి, కూకట్‌పల్లి ఎసిపిలు అభినందించారు.

# తహసీల్దార్ మారితే...సర్వే హద్దులు మారేనా?

ప్రభుత్వ భూమిని దారాదత్తం చేస్తున్న రెవెన్యూ, మున్సిపల్ అధికారులు



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** పనేంటి..? నీకెంత..? నాకెంత..? అనే డైలాగ్ ఒక సూపర్ హిట్ సినిమాలో పాపులర్ డైలాగ్. ఈ డైలాగ్ హీరో చెబుతుంటే ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. నిజంగా సమాజంలో ఇలాంటి సంఘటనలు జరుగుతాయా అని అనుకుంటూ థ్రిల్ ఫీల్ అయ్యారు. కానీ కళ్లెదుటే జరుగుతుంటే చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. తహసీల్దార్ మారితూ సర్వే హద్దులు మారుతాయి అన్న చందంగా సర్వేయర్, రెవెన్యూ అధికారి కలిసి హద్దులను మార్చి చూపడంతో సినిమాను తలపిస్తున్నది రెవెన్యూ, మున్సిపల్ అధికారుల తీరు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో...

మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నెంబర్ 3లో మూడు ఎకరాల 20 గుంటల ప్రభుత్వ ఉంది. 2002లో గ్రామ పంచాయతీ సభ్యుల ఏకగ్రీవ తీర్మానంతో ఉమ్మడి ఘట్కేసర్ అధికారులు హద్దులను గుర్తించి కాపాడారు. దీనిపై కన్నుపడిన పక్క వెంచర్ యజమానులు ప్రభుత్వ భూమిని కలిపి రిజిస్ట్రేషన్లు చేసి అక్రమ నిర్మాణాలు చేస్తుండగా 2016లో మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడగానే ప్రధాన రహదారుల వెడల్పులో భాగంగా ఇల్లు కోల్పోయిన వారికి కొంత స్థలాన్ని మౌఖిక ఒప్పందంతో కేటాయించి, కొంత స్థలాన్ని పార్కు, మిగతా స్థలాన్ని కాపాడారు. కానీ అక్రమార్కులు సందట్లో సడేమియాగా అధికారులు మారగానే గుట్టుచప్పుడు కాకుండా అక్రమ నిర్మాణాలు చేస్తున్నారు. రక్షించవలసిన అధికారులే వారితో చేతులు కలిపి ముడపులు తీసుకుని మిన్నుకుంటున్నారు. ఫిర్యాదులు అందితే చూస్తాం, చేస్తాం, మా బాధ్యత కాదు అంటూ ఒకరిపై ఒకరు చెబుతూ కాలాతీతం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి విముక్తి చేసి ప్రజావసరాలకు వినియోగించాలని కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా అయిన విషయం తెలిసినా కూడా పట్టించుకోవడం లేదంటే ప్రభుత్వ భూమిని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అమ్ముకుంటున్నట్లుగానే నిర్మాణాలు చేయిస్తున్నారు. ప్రజలు పలు సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా ఏదో ఒకటి చెప్పి దాటవేస్తున్నారని తెలిపారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు భారీగానే ముడుపులు ముట్టాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి విముక్తి చేసి ప్రజావసరాలకు వినియోగించుకోవాలని కోరుతున్నారు.

### రెవెన్యూ అధికారుల కనుసైగల్లో ప్రభుత్వ భూములు మాయం

బోడుప్పల్‌లో ఎక్కడైనా ప్రభుత్వ ఖాళీ స్థలం కనిపిస్తే భూకబ్జాదారులు అక్కడ వాలిపోతున్నారు. ప్రజావసరాలకు భూములు లేకుండా అన్యాక్రాంతం చేస్తున్నారు. ఓ రెవెన్యూ అధికారి సలహా, సూచనలతో గత రెండేళ్లలో ప్రభుత్వ భూములకు కోర్టు స్టేలు విచ్చలవిడిగా తీసుకు వచ్చి నిర్మాణాలు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. ఈ ప్రభుత్వంలో వారిని కట్టడి చేసి ప్రభుత్వ భూమిని కాపాడుతారో లేదో వేచి చూడాలి.

### ముడుపులు అందుకుని కాలయాపన

రచ్చ కిషన్



ప్రభుత్వ భూమి కబ్జా అవుతుందని, ఎలాంటి అనుమతులు లేకుండా యధేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నా ముడుపులు అందుకుని అధికారులు కాలయాపన చేస్తున్నారని సిపిఐ మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆందోళన వ్యక్తం చేశారు. పేదలు గుడిసెలు వేసుకుంటే కూల్చి వేసిన అధికారులకు సగం వక్ఫ్ స్థలం, సగ భాగం ప్రభుత్వ స్థలంలో నిర్మాణం చేస్తుంటే ముడుపులు ముడితే అక్రమాలన్నీ సక్రమం అవుతాయా..? ఇప్పటికైనా అక్రమ నిర్మాణాలను కూల్చివేసి స్థలాన్ని కాపాడాలని ఆయన కోరారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులే మీనవేశాలు లెక్కపెడుతుంటే తామేం తక్కువ తినలేదన్న చందంగా వక్ఫ్ స్థలంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న కట్టడాలను ఆపవలసిన మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమార్కులకు వంతపాడుతున్నారు. దీంతో ప్రభుత్వ భూములు మాయమవుతున్నాయి.

## భవనాలను పరిశీలించిన ఎంఎల్ఎ



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలో నూతనంగా నిర్మించిన పోస్ట్ ఆఫీస్, తహసీల్దార్ పాత విశ్రాంతి భవనాలను ఎంఎల్ఎ వాకిటి శ్రీహరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఉపయోగంలో లేని భవనాలను ప్రజలకు ఉపయోగంలోకి తీసుకొస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు కోళ్ల వెంకటేష్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గణేష్‌కుమార్ , మైనార్టీ మండల అధ్యక్షులు మహ్మద్ ఫయాజ్, కావలి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఒసి చెక్కు అందజేత



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ నియోజకవర్గం కేంద్రంలోని ఆనంపల్లి వీధికి చెందిన విక్రమ్ గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విక్రమ్ ఆసుపత్రి వైద్య పరీక్షలు, ఆపరేషన్ నిమిత్తం కోసం ఎంఎల్ఎ వాకిటి శ్రీహరి క్యాంపు కార్యాలయంలో రూ. 2,25,000ల ఎల్ఒసి చెక్కును బాధితునికి అందజేశారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మండల పరిధిలోని రఘుపతిపేట గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ నిర్వహిస్తున్నటువంటి ఏడురకాల తాగునీటి రిజిస్టర్ల నిర్వహణను తనిఖీ చేశారు. ఇంటిపనుల వసూళ్ల గురించి శానిటేషన్ గురించి నర్సరీలో మొక్కల పెంపకం గురించి ఉపాధిహామీ లేబర్ మొదలైన అంశాలపై చర్చించి తర్వాత అంగన్‌వాడి సెంటర్‌లో అంగన్‌వాడీ సెంటర్‌యొక్క పని తీరును పరిశీలించారు. ఆయనవెంట ఏపివో రాజు, ఈసీ చందన, పంచాయతీ కార్యదర్శి వంశీ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

## 21న బిఆర్ అంబేద్కర్ కళాశాలలో ఇంటర్వ్యూ

**ప్రజాపక్షం/జడ్చర్ల:** డా.బి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జడ్చర్ల యందు ఈ నెల 21న కళాశాల, టిఎస్‌కెసి (తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్), టిక్యూసి ఆధ్వర్యంలో ఎల్, టి ఫైనాన్స్ కంపెనీలలో గల 30 ఖాళీల కొరకు ఇంటర్వ్యూస్ నిర్వహించబడును. ఇట్టి ఖాళీలను గాను డిగ్రీ 2020 నుండి 2023 వరకు పాస్ అయిన పురుష విద్యార్థులు అర్హులు. ఆసక్తి గల పురుష అభ్యర్థులు తమ తమ అర్హత సర్టిఫికెట్లతో గురువారం నాడు కళాశాల యందు సెమినార్ హాల్ నందు హాజరు కాగలరని కళాశాల ప్రిన్సిపాల్ డా.సిహెచ్. అప్పియా చిన్నమ్మ, ఐక్యూఎసి, కోఆర్డినేటర్ పి.శ్రీనివాసులు, టిఎస్‌కెసి కోఆర్డినేటర్ డా.ఆర్.రమాదేవి తెలియజేయడం జరిగింది. ఇతర విషయములకు కళాశాల టిఎస్‌కెసి యన్.వీర ప్రతాప్ 9912795088 నెంబర్‌కు సంప్రదించగలరు.

## మైసమ్మ సన్నిధిలో ఎంఎల్ఎ దంపతులు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మహబూబ్‌నగర్ మండలం ఫతేపూర్ మైసమ్మ దేవాలయంలో మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్యే దంపతులకు వేద ఆశీర్వాదము ఇచ్చి అమ్మవారి శేష వస్త్రంతో పాటుగా అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కృష్ణయ్య, ఈఓ మదనేశ్వర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, బి.రాఘవేందర్, యం.ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో సి అండ్ డి వేస్టేజ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్(ఎఎంహెచ్ఓ)లను జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆదేశించారు. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్‌లో మంగళవారం జోనల్ కమిషనర్లు, ఆరోగ్యం పారిశుద్ధ్యం విభాగం అధికారులతో పారిశుద్ధ్య నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం, స్ట్రీట్ స్వీపింగ్ మిషన్స్ పర్యవేక్షణ, జివిపిల తొలగింపు, సి అండ్ డి వేస్టేజ్ తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ ఎస్ డబ్ల్యూ జి కార్మికుల హాజరును పర్యవేక్షించాలని, పారిశుద్ధ్య వర్కర్ల హాజరుకు సంబంధించి మొబైల్ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టం అమలుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పిన్ పాయింట్ ప్రోగ్రాం చేయాలని, స్వీపింగ్ యంత్రాలపై పర్యవేక్షణ ఉండాలన్నారు. చెత్త సేకరణ పాయింట్ రూట్ ప్లాన్ వేయడంతో పాటు రాంకీ వాహనాలతో టై అప్ చేయాలన్నారు. రోడ్లపై చెత్త వెయ్యకుండా బోర్డులను ప్రదర్శించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్లు స్నేహ శబరిష్, చంద్రకాంత రెడ్డి, సునంద, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, జోనల్ కమిషనర్‌లు ఎన్. రవి కిరణ్, హేమంత్ బోర్కడే, అభిలాష్ అభినవ్, వెంకన్న, పి.డి. సౌజన్య, స్వేచ్ఛ భారత్ పి.డి. భారత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.16,43,300 నగదు పట్టివేత

జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా ఎన్‌ఫోర్స్ బృందాలు మంగళవారం రూ. 16,43,300 నగదుతో పాటు రూ.10,250 విలువగల ఇతర వస్తువులు స్వాదినం చేసుకున్నాయని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే పోలీస్, ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి బృందాలు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 9 బృందాలు 24 గంటల పాటు పని చేస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లాలో ఎఫ్ఎస్‌టి( ఫ్లయింగ్ స్క్వాడ్) బృందాలు రూ. 9,3000 లక్షలు సీజ్ చేయగా, రూ. 7,13,300 పోలీస్ బృందాలు స్వాదినం చేసుకొని, సీజ్ చేసినట్లు చెప్పారు. రూ.10,250 విలువైన ఇతర వస్తువులను సీజ్ చేశారు. ఇప్పటి వరకు మొత్తం రూ.17, 25,311 విలువైన ఇతర వస్తువులను స్వాదినం చేసుకున్నారు. 54.67 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాదినం చేసుకోగా, 8 మందిపై ప్రోహిబిషన్ కేసులు నమోదు చేయడమే కాకుండా వారిని అరెస్టు చేశారు.

# యుపిలో కాంగ్రెస్ పట్టు సాధిస్తుందా?



**లక్నో:** సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ... ఉత్తరప్రదేశ్‌పై కాంగ్రెస్ దృష్టి సారించింది. ఇండియా కూటమిలో భాగంగా కొంతమేరకైనా పట్టుసాధించాలని భావిస్తోంది. దేశంలో అత్యధిక లోక్‌సభ స్థానాలు ఉత్తరప్రదేశ్‌లో ఉన్నాయి. ఈ రాష్ట్రంలో అత్యధిక సీట్లు గెలుచుకున్న పార్టీ అధికారానికి దగ్గరగా ఉంటుంది. సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ వచ్చింది. ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ దశలో ఉత్తరప్రదేశ్‌లోని 80 స్థానాల్లో ఏ పార్టీ విజయం సాధిస్తుందనేది ఆసక్తిగా మారింది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 62 సీట్లలో గెలుపొందగా, బీఎస్పీ 10 స్థానాలు దక్కించుకుంది. ఎస్పీ 5 స్థానాల్లో విజయం సాధించగా, కాంగ్రెస్ ఒకేఒక స్థానంతో సరిపెట్టుకుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎస్పీ ఇండియా కూటమిలో భాగస్వామ్య పక్షాలుగా ఉన్నాయి. 80 సీట్లలో ఎస్పీ 63, కాంగ్రెస్ 17 స్థానాలలో పోటీ చేస్తున్నాయి. ఎస్పీ తన కోటా నుంచి ఒక సీటును తణమూల్ కాంగ్రెస్‌కు కేటాయించింది. గత ఎన్నికల్లో ఒక సీటుకే పరిమితమైన కాంగ్రెస్ ఈసారి ఎలాంటి ప్రభావం చూపించబోతుందనేది ఆసక్తి కలిగిస్తోంది. 2019 ఎన్నికల్లో రాయ్‌బరేలీ నుంచి సోనియాగాంధీ ఒక్కరే ఎంపీగా గెలిచారు. అమేథి నుంచి రాహుల్ గాంధీ పోటీ చేసి ఓడిపోయారు. ఈసారి ఈ రెండు స్థానాలు పొత్తులో కాంగ్రెస్‌కు దక్కాయి. గాంధీ కుటుంబానికి మంచి పట్టున్న రెండు నియోజకవర్గాల్లో ఇప్పుడు ఎవరిని నిలబెడతారనేది ఆసక్తి కలిగిస్తోంది. 17 సీట్లలో పోటీచేయాలనే విషయంలో కాంగ్రెస్‌కు స్పష్టత ఉంది. కానీ సీట్ల కేటాయింపు జరిగిన తరువాత నుంచి అభ్యర్థుల ఎంపికపై ఆ పార్టీ తీవ్ర కసరత్తు చేస్తోంది. 25 సంవత్సరాలుగా రాయబరేలీ నుంచి ఎంపీగా గెలుస్తూ వస్తున్న సోనియాగాంధీ... ఈసారి ఎన్నికల బరిలో దిగడం లేదు. దీంతో ఆ పార్టీ ఒక సీటు అయినా గెలుస్తుందా అనే చర్చ మొదలైంది. సీట్ల పంపకంలో రాయ్ బరేలీ, అమేథీ, కాన్పూర్, ఫతేపూర్ సిక్రీ, బన్స్‌గావ్, ఝాన్సీ, సీతాపూర్, సహరాన్‌పూర్, ప్రయాగ్‌రాజ్, మహరాజ్‌గంజ్, వారణాసి, అమ్రోహా, బుల్దాన్‌షహర్, ఘజియాబాద్, మధుర, బారాబంకి, డియోరియా సీట్లు కాంగ్రెస్‌కు దక్కాయి. కాంగ్రెస్ ప్రస్తుతం పోటీ చేయనున్న 17 స్థానాల్లో రాయ్‌బరేలీలో మాత్రమే 2019 ఎన్నికల్లో విజయం సాధించింది. సోనియాగాంధీ ఇక్కడి నుంచి గెలిచారు. ప్రస్తుతం ఆమె ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఇటీవల ఆమె రాజ్యసభకు ఎన్నికవ్వడంతో.. ఈ ఎన్నికల్లో పోటీ చేయరనేది సుస్పష్టం. సోనియా గాంధీ పోటీచేస్తే యూపీలో కాంగ్రెస్ మళ్లీ ఆ స్థానంలో గెలిచే అవకాశం ఉందని అంతా భావించారు. కానీ సోనియా పోటీకి దూరంగా ఉండటంతో ఇక్కడ కాంగ్రెస్ విజయం కష్టమేననే సంకేతాలు వెలువడుతున్నాయి.

## హిందూ ధర్మానికి అవమానం

కాంగ్రెస్, డిఎంకెపై మోడీ ఎదురుదాడి

**సేలం:** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'శక్తి' వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి విమర్శలు గుప్పించారు. 'ఇండియా' కూటమి భాగస్వాములైన కాంగ్రెస్, డీఎంకే హిందూ మతాన్ని అవమానించడమే పనిగా పెట్టుకున్నాయని, ఇతర మతాలను పల్లెత్తు మాట అనడం లేదని ఎద్దేవా చేశారు. తమిళనాడులోని సేలంలో మంగళవారం జరిగిన ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ కాంగ్రెస్‌డీఎంకే ఇండియా కూటమి ఉద్దేశపూర్వకంగానే హిందూ ధర్మాన్ని విమర్శిస్తోందని, హిందూయిజాన్ని విమర్శించడానికి ఒక్క క్షణం కూడా ఆలోచించడం లేదని ఆరోపించారు. శక్తిని ధ్వంసం చేస్తామంటూ డీఎంకే, కాంగ్రెస్, ఇతర ఇండియా కూటమి పార్టీలు సవాలు చేస్తున్నాయని మోడీ విమర్శించారు. మరియమ్మన్ ఇక్కడి శక్తి మాత. తమిళనాడులో కంచికామాక్షి శక్తి. మధురలో శక్తి మాత మధుర మీనాక్షి. ఆ శక్తిని ధ్వంసం చేస్తామని ఇండియా కూటమి చెబుతోంది. హిందూయిజంలో శక్తి అంటే పవర్, తల్లిని పవర్‌గా చెబుతాం. ఆ శక్తిని ధ్వంసం చేస్తామని వారు చెబుతున్నారని మోడీ మత భావోద్వేగం సృష్టించేందుకు ప్రయత్నించారు. డీఎంకే, కాంగ్రెస్ దొందూ దొందేనని, ఒకే నాణానికి రెండు ముఖాల్లాంటివని మోడీ అన్నారు. డీఎంకేకాంగ్రెస్ అంటే భారీ అవినీతి, కుటుంబ పాలన అంటూ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీని దేశ ప్రజలు వదిలించుకోగానే దేశం 5జి టెక్నాలజీకి చేరుకుందన్నారు. తమిళనాడులో డీఎంకేకు కూడా సొంత 5జి ఉందని, ఒకే కుటుంబానికి చెందిన 5 తరాలు తమిళనాడును గుప్పిట్లో పెట్టుకున్నాయని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జయలలితను కూడా డీఎంకే విడిచిపెట్టలేదని, మహిళలతో ఇండియా కూటమి ప్రవర్తన ఏమిటో ఇక్కడి ప్రజలే సాక్ష్యమని ప్రధాని అన్నారు. జయలలిత బతికి ఉన్నప్పుడు ఆమె పట్ల డీఎంకే నేతలు ఎలా ప్రవర్తించారో అందరికీ తెలుసునని, అదే డీఎంకే నిజస్వరూపమన్నారు.

## 'మనిషి ఊదుతున్న బూర'ను వాడుకోండి

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి చెందిన శరద్ పవార్ వర్గానికి సుప్రీంకోర్టు అనుమతి

**న్యూఢిల్లీ :** లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు 'ఎన్‌సిపి-ఎస్‌సిపి' పేరుతో పాటు 'మనిషి ఊదుతున్న బూర' చిహ్నాన్ని ఉపయోగించుకోవచ్చని.. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి చెందిన శరద్ పవార్ వర్గానికి సుప్రీంకోర్టు మంగళవారం అనుమతి ఇచ్చింది. ఆ చిహ్నాన్ని శరద్ పవార్ వర్గానికి చెందిన ఎన్నికల చిహ్నంగా రిజర్వ్ చేయాలని భారత ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. ఆ గుర్తును ఏ ఇతర పార్టీకి లేదా అభ్యర్థికి కేటాయించరాదని స్పష్టం చేసింది. ఇదే సమయంలో.. ఎన్‌సిపి వ్యవస్థాపకుడు శరద్ పవార్ పేరుని గానీ, ఫోటోలను గానీ ఎన్నికల ప్రచారంలో ఉపయోగించకుండా అజిత్ పవార్ వర్గాన్ని అత్యున్నత న్యాయస్థానం నిషేధించింది. అలాగే, గడియారం గుర్తుకు సంబంధించిన వివాదాస్పద అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఈ గడియారం గుర్తు 'కోర్టులో పరిశీలనలో ఉందని' పబ్లిక్ నోటీసు జారీ చేయాలని అజిత్ పవార్ వర్గాన్ని కోర్టు చెప్పింది. ఇంగ్లీష్, హిందీ, మరాఠీ భాషల్లో ఈ నోటీసులు ఇవ్వాలని.. అన్ని ప్రచార ప్రకటనల్లో కూడా ఆ అంశాన్ని ప్రస్తావించాలని సూచించింది. అంతకుముందు.. అజిత్ పవార్ వర్గాన్ని నిజమైన ఎన్‌సిపిగా ప్రకటిస్తూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన నిర్ణయంపై స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ఇదిలావుండగా.. రాజకీయ ప్రయోజనాల కోసం పేరు, ఫోటోలను దుర్వినియోగం చేస్తున్నారంటూ శరద్ పవార్ వర్గం గతవారం పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపికి సుప్రీంకోర్టు గట్టి షాక్ ఇచ్చింది. ప్రత్యేకంగా పార్టీ ఉన్నప్పుడు శరద్ పవార్ ఫొటోను ఎందుకు వినియోగిస్తున్నారని అజిత్ వర్గాన్ని కోర్టు ప్రశ్నించింది. సొంత పార్టీ గుర్తింపుతో ముందుకు వెళ్లాలని సూచించింది. శరద్ పవార్ పేరు, చిత్రాలను ఉపయోగించబోమని హామీ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ కేసు విచారణలో భాగంగానే తాజాగా శరద్ పవార్ వర్గానికి సుప్రీంకోర్టు కొత్త చిహ్నాన్ని జారీ చేసింది.

## ఆశపడి ఓట్లేశారనడం

# కెసిఆర్ అహంకార ధోరణికి ప్రత్యేక నిదర్శనం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ అధ్యక్షుడు కెసిఆర్ ప్రజలు కాంగ్రెస్ వాగ్దానాలకు ఆశపడి ఓట్లేశారనడం ఆహంకార పూరితధోరణికి ప్రత్యేక నిదర్శనమని టిడిపి సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. ఇప్పటికైన కెసిఆర్ ఇలాంటి దౌర్భాగ్య కరమైన ప్రకటనలు మానుకొని, పదేళ్లు రాష్ట్రాన్ని పాలించేందుకు అవకాశం కల్పించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపి, బహిరంగ క్షమాపణ చెప్పాలని సాయిబాబా డిమాండ్ చేశారు. దోమల్‌గూడ నగర పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పదేళ్లపాటు కెసిఆర్‌కు అధికారం ఇచ్చిన తెలంగాణ ప్రజల పట్ల విశ్వాసం లేదన్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత పదేళ్ల అధికారం ఇచ్చిన ప్రజలకు కనీసం కృతజ్ఞతలు చెప్పే ఇంగితజ్ఞానం కూడా కెసిఆర్‌కు లేకుండా పోయిందని విమర్శించారు. ప్రజలంటే ఆయనకు ఏ రోజు లెక్కలేదన్నారు. కెసిఆర్, ఆయన కుటుంబం అహంకార పూరిత ధోరణితో రాష్ట్రాన్ని అదోగతి పాలు చేశారన్నారు. భూస్వామ్య దొరలపాలన సాగించిన విధానం పట్ల ప్రజలు అసహ్యించుకొని, కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారనే విషయం గ్రహించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ వాగ్దానాలకు ఆశపడి ప్రజలు తమకు ఏవో వస్తాయనే భ్రమతో గెలిపించలేదన్నారు. చరిత్రలో ప్రజల్ని విశ్వాస ఘాతకులని మాట్లాడిన వ్యక్తి ఎవరైనా ఉంటే అది కెసిఆర్ మాత్రమే అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ ఆయన కుటుంబం హైదరాబాద్ రావడానికి రూ. 10 లేని స్థితి నుండి ఈ రోజు లక్షల కోట్లు సంపాదించిందన్నారు. 1200 మందికి పైగా ఆత్మబలిధానాలతో సాధించిన తెలంగాణను తానే సాధించానని గొప్పలు చేప్పుకోవడం తప్ప అమరవీరుల కుటుంబాలకుర చేసింది ఏమిటని ప్రశ్నించారు. నీళ్లు, నిధులు, నియమాకాల కోసం పోరాటం జరిగితే, కేవలం కెసిఆర్, ఆయన కొడుకు, కూతురు, అల్లునికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చాడని విమర్శించారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్‌తో తన ఫామ్‌హౌస్‌కు నీళ్లు మళ్లించుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పేరుతో కమీషన్‌లు దండుకొని నిధులు సొంత ఖజానాకు మళ్లీంచుకున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్ గౌడ్, యాద గిరిరావు, ఎస్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## వనపర్తి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ రాజీనామా



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** వనపర్తి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ తమ పదవులకు స్వచ్ఛందంగా రాజీనామా పదవులకు స్వచ్ఛందంగా రాజీనామా సమర్పించారు. ఈ మేరకు మంగళవారం వనపర్తి పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ పూర్ణ చంద్రరావుకు చైర్మన్ గట్టు యాదవ్ , వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ పదవికు విడివిడిగా రాజీనామా పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని రోజుల క్రితం బీఆర్ఎస్ కౌన్సిల్ సభ్యుల సమావేశం ఏర్పాటు చేసి వారితో జరిగిన సమావేశంలో చైర్మన్ , వైస్ చైర్మన్ , కొత్త వాళ్లకు అవకాశం కల్పించేందుకు వాళ్ల పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన విషయం మనందరికి తెల్సిందే అన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని 4 ఏండ్ల 4 మాసాలు నిరంజన్‌రెడ్డి సహకారంతో పట్టణ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేశామని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కృషి మేరకు స్వచ్ఛందంగా తమ పదవులకు రాజీనామా చేశామని అన్నారు. సహకరించిన పార్టీకి, కౌన్సిలర్లకు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు, కురుమూర్తి యాదవ్, నందిమల్ల ఆశోక్, గంధం, పరంజ్యోతి, సయ్యద్ జమీల్, కౌన్సిలర్స్ లక్ష్మినారాయణ, మహేష్, పాక నాటి కృష్ణ, నాగన్న యాదవ్, బాషా నాయక్, నాయకులు ఉంగ్ల, తిరుమల్, ప్రేమ్ నాథ్‌రెడ్డి, షరవంద, స్టార్ రహీం, ఎల్‌ఓసీ కృష్ణ, వినోద్ పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపు కోసం కృషి

బిజెపి ఎంపి అభ్యర్థి డి కె అరుణ



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ బ్యూరో :** లోకసభ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం మహబూబ్‌నగర్ పట్టణంలోని కాళీకాంబ కళ్యాణ మండపంలో జరిగిన విస్తృత స్థాయి ముఖ్య నాయకుల సమావేశానికి పాలమూరు బిజెపి ఎంపి అభ్యర్థి డికె అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా డి.కె. అరుణ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో నరేంద్రమోదిని మళ్లీ ప్రధానిని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు ఒక అభ్యర్థిగా పని చేయాలన్నారు. ఈసారి ప్రజల్లో మళ్లీ ఈ ఓటు మోదీ కోసమే మళ్లీ మోదీనే రావాలి అన్న నినాదం ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జీ మాజీ మంత్రి చిత్తరంజన్ దాస్, క్రమశిక్షణ సంఘం నాయకులు నాగురావు నామాజీ, పార్లమెంట్ కో కన్వీనర్ నర్సింహగౌడ్, పార్లమెంట్ కో కన్వీనర్ భీంరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నారాయణపేట జిల్లా అధ్యక్షులు పగుడాకుల శ్రీనివాసులు, మహబూబ్‌నగర్ మాజీ జిల్లా అధ్యక్షులు వీర బ్రహ్మాచారి, వనపర్తి మాజీ జిల్లా అధ్యక్షులు రాజవర్ధన్‌రెడ్డి, అసెంబ్లీ ఇంచార్జీలు పాల్గొన్నారు.

## పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** పదోతరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ ఆదేశించారు. పట్టణంలోని మౌలిక సదుపాయాలకల్పన ప్రహరీ, భద్రత అంశాలను పరిశీలించారు. చీఫ్ సూపరింటెండెంట్ గదిలో సిసి కెమెరాలు పరిశీలించడంతోపాటు క్వ్యాస్చన్ పేపర్ సీల్ ఓపెనింగ్ క్లోజింగ్, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌తో సహ ఇన్విజిలేటర్లు పరీక్ష విధులకు కేటాయించిన ప్రతి ఒక్కరిని తనిఖీచేసి లోనికి అనుమతించాలని , సెల్‌ఫోన్లు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని భద్రత సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం రెండోరోజు ద్వితీయభాష హిందీ పరీక్షకు 10,524 మంది విద్యార్థులకుగాను 10,505 మంది విద్యార్థులు నేటి పరీక్షకు హాజరుకాగా 19మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డిఇఓ తెలిపారు. బిజినేపల్లి బాలికల పరీక్షకేంద్రాన్ని తనిఖీచేసిన జిల్లా పరీక్ష అబ్జర్వర్ రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటనరసమ్మ, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతున్న ఒక విద్యార్థిని డిబార్‌చేయగా, పరీక్షాకేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఇన్విజిలేటర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

## ఆరెకటికల సంక్షేమానికి కృషి చేస్తా

ఎంఎల్ఎ యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** గత కొన్ని సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న ఆరెకటికల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఆరెకటికల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఆరెకటికల సమస్యలను మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు. ఆరెకటికల సమస్యలపై ఎమ్మెల్యే కి రిప్రెజెంటేషన్ ఇస్తూ ఆర్థికంగా వెనుకబడిన వారిని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి సబ్సిడీ ద్వారా లోన్లు మంజూరు చేసి ఆదుకోవాలని ఎమ్మెల్యే కి విజ్ఞప్తి చేశారు. వారి సమస్యను విన్న ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, వీలైనంత త్వరగా మీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుధాకర్ రెడ్డి, ఆరెకటిక సంఘం నాయకులు మల్లేశం, ఖాజారామ్, శివరాములు, మహేందర్ జీ, వెంకటేశ్వర్ జీ, రవి, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన పలువురు







**ప్రజాపక్షం/పానగల్ :** పానగల్ మండలంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎంపీటీసీలు రాష్ట్ర ఎక్సైజ్ , పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పానగల్ మండలంలోని కదిరేపాడు, శాగాపూర్, కేతేపల్లి, చింతకుంట, దావాజిపల్లి గ్రామాల ఎంపిటిసిలు వీరపాగ నాగమ్మ, సుబ్బయ్యయాదవ్, తలకంటి శ్యామల హన్మంతురెడ్డి, రమాదేవి రవీందర్ గౌడ్, లక్ష్మి ఠాగూర్ నాయక్‌లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన ఎంపిటిసిలకు మంత్రి జూపల్లి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ జడ్చర్ల :** నవాబ్ పేట మండలంలోని కాకర్ల పహాడ్ గ్రామ బిఆర్ఎస్ పార్టీకి చెందిన బాలయ్య, నరేష్‌తో పాటు 20 మంది బిఆర్ఎస్ కార్యకర్తలు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి, మాజీ జిల్లా అధికారి ప్రతినిధి జనంపల్లి దుష్యంత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ కండువా వేసి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** పెద్దకొత్తపల్లి ఎంపిపి సూర్యప్రతాప్‌గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ టూరిజం, వనపర్తి ఎంఎల్ఎ మెఘారెడ్డి సమక్షంలో మంగళవారం కల్వకోల్ ఎంపిటిసి వెంకటస్వామి, ఎంపిటిసి రామచందర్, దేవునితిర్మలాపూర్ ఎంపిటిసి ప్రతాపరెడ్డి కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈసందర్భంగా మంత్రి జూపల్లికృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల సంక్షేమ పథకాలకు ఆకర్శితులై కాంగ్రెస్‌పార్టీలో ప్రతినిధులు చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి జడ్పిటిసి మేకలగౌరమ్మ చంద్రయ్య, పెద్దకొత్తపల్లి మాజీ ఎంపిపి వరదరాజుల వెంకటేశ్వరరావు, దేవుని తిర్మలాపూర్ గ్రామసర్పంచ్ సత్యం, గంద్రావుపల్లి సర్పంచ్ పగడాల చిన్నయ్య, వెన్నచర్ల ఎంపిటిసి రవికుమార్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు లక్ష్మణరావు, కొండల్ గౌడ్, గాదరి చంద్రశేఖర్, కొత్తపేట రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీల్లో రూ. 90,300 సీజ్



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జిల్లా ఎస్పీ కె. రక్షిత మూర్తి ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా పరిధిలో మంగళవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. కర్నూల్ బైపాస్ రోడ్డు చెక్ పోస్టు దగ్గర వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ఒక వ్యక్తి కర్నూల్ నుంచి వీపనగండ్లకు తన కారులో నంబర్ ఏపి 31 ఎస్‌వి 7136లో రూ. 90,300లు ఉండగా ఎలాంటి అనుమతి పత్రాలు లేనందున సీజ్ చేశారు. మంగళవారం వనపర్తి జిల్లాలో మొత్తం రూ. 90,300లు పట్టుబడ్డాయని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎవరైనా రూ. 50వేల కన్న ఎక్కువ డబ్బులను తీసుకువెళ్లరాదని , ఒక వేళ తీసుకెళ్తే రసీదు, తగిన పత్రాలు వాటి వివరాలు ఉండాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి డబ్బులు, మద్యం, ఇతర విలువైన వస్తువులు తీసుకెళ్లరాదని ఎస్ఐ తెలిపారు.



## కార్మిక హక్కుల కోసం ఎఐటియుసి పోరాటం

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: కార్మికుల హక్కుల కోసం ఎఐటియుసి నిరంతరం పోరాడుతుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన నూతన రోడ్ ట్రాన్స్‌పోర్ట్ విధానం రద్దు చేయాలని, హిట్ అండ్ రన్ చట్టాన్ని అమలు చేయకూడదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ముకాసే విధంగా చట్టాలను సవరణ చేయడం సరికాదన్నారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల పొట్ట కొడుతున్నారని ఆరోపించారు. హక్కుల సాధన కోసం పోరాటాలు తీవ్రతరం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా ఎండి.సయిద్, అధ్యక్షులుగా ఆర్.వినోద్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోపాల్‌నాయక్, ఉపాధ్యక్షులు రసూల్, ప్రధాన కార్యదర్శిగా అఫ్జర్, కార్యదర్శిగా వెంకన్న తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, నాయకులు ఎండి.సయిద్, డి.లింగానాయక్, అఫ్జర్‌అలీ, గోపాల్‌నాయక్, వెంకన్న, నవీన్, జానయ్య, రసూల్, రఫి, సురేష్, చక్రపాణి, చోటు, హాజీ, శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల హక్కులను కాలరాస్తున్నారు




ప్రజాపక్షం/తొర్రూరు : పేద మధ్య తరగతి ప్రజల హక్కుల సాధన కోసం పోరాడేది కమ్యూనిస్టులదేనని సీపిఐ మహబాదు జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మహబాదు జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలో సిపిఐ మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అథిదిగా పాల్గొని మాట్లాడుతూ పేదల హక్కులైన కూడు, గుడ్డ తదితర హక్కుల సాధనకు నిరంతరం పోరాడే కమ్యూనిస్టులేనని, కేంద్ర, రాష్ట్ర పాలకులు పేదల హక్కులను కాలరాసి ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల నిత్యావసర దరలు, గ్యాస్, పెట్రోల్, డిజిల్ ధరలు ఆకాశాన్ని అంటాయని, దేశంలో నూటికి 70 శాతం ఉండే రైతాంగానికి మద్దతు ధర లేకుండా చేశారని, వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకవస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతే కాకుండా దేశంలోని సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల హక్కులను తుంగలోతొక్కి కార్మిక చట్టాలను కుదించారన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో సీపిఐ జిల్లా నాయకులు తురక రమేష్, సారయ్య, మరళి, సోమారపు వెంకటయ్య, కృష్ణ, జనార్ధన్ పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ప్రజాపక్షం/ఆసిఫాబాద్ ప్రతినిధి : ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని ఎఐటియుసి కొమురంభీం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎఐటియుసి ఆధ్వర్యంలో రెబ్బెన పిహెచ్‌సిలో మెడికల్ ఆఫీసర్ సుజీత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ లోపు వేతనాలు, ఏరియర్స్ బకాయిలు చెల్లించకుంటే నిరవధిక సమ్మెలోకి వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో 2వ ఎఎన్‌ఎం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సంతోషి, కోశాధికారి సునీత, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షకీల్, కార్యదర్శి వెంకటేష్, నాయకులు మమత, ప్రశాంత్ పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ కార్మికుల మూడు నెలల వేతనాలు చెల్లించాలి



ప్రజాపక్షం/వేములవాడ: వేములవాడ అర్బన్ మండల్ చింతల్ తాన గ్రామపంచాయతీ కార్మికులు సిఐటియు నుంచి ఎఐటియుసిలో చేరారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు ఆగిపోయిన మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని,హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం రూ. 26వేల వేతనం చెల్లించాలని కోరడం జరిగింది. గత బిఆఎస్ ప్రభుత్వం ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తామని ఏ ఒక్కరికీ ఇవ్వకపోగా కార్మికులు ఎన్నో సమ్మెలు చేసినప్పటికీ పర్మిట్ చేస్తామని నిర్లక్ష్యం వహించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కార్మికులకు అన్ని రకాల సౌకర్యం కల్పించాలన్నారు. కాంట్రాక్టు వ్యవస్థను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు అజ్జా వేణు, దుంద్ర రవీందర్, తాళ్లపల్లి రామయ్య, రంగయ్య, మొండయ్య, శేఖర్, దుర్గయ్య, ముత్తయ్య పాల్గొన్నారు.

## 21, 22 తేదీల్లో వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశం

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం, వ్యవసాయ శాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లోదక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘ సమావేశాన్ని నల్లగొండలోని కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఉదయాదిత్య భవన్‌లో నిర్వహిస్తున్నట్లు దక్షిణ తెలంగాణ మండల సహ పరిశోదన సంచాలకులు డా.యం.మల్లారెడ్డి, కంపసాగర్ శాస్త్రవేత్త జి.శివ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని వాటిని సవరించే దిశగా పరిశోధనలు చేపట్టి సమస్యలకు సరైన పరిష్కారాలను అందించడం జరుగుతుందని, గత సంవత్సరం రైతులు లేవనెత్తిన అంశాలకు సాంకేతిక పరమైన పరిష్కారాలను తెలియజేయడంతో పాటు, గత సంవత్సరం వ్యవసాయ విశ్వవిద్యాలయం సాధించిన ప్రగతిని తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు, దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ అధికారులు, అనుబంధ శాఖల అధికారులు, 11 జిల్లాల రైతులు పాల్గొంటారని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని కోరారు.

# ‘ఉపాధిహామీ’ని పరిరక్షించుకుందాం

### వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య




ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం): నిరుపేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించుకోవాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు కలకొండ కాంతయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశంలో మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని, కూలీలకు నీడ కోసం టెంట్లు వేయాలని, వాటర్ సౌకర్యం కల్పించాలని కోరారు. పేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ లను మంజూరు చేయాలని, ఇంటి స్థలం లేని వారికి ఇంటి స్థలం తో పాటు ఇంటి నిర్మాణం చేపట్టాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలతోపాటు రాష్ట్రంలో ఉన్న మిగులు భూములను భూమిలేని నిరుపేదలకు పంపిణీ చేయాలన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు మాట్లాడుతూ పార్టీ సభ్యత్వాలను త్వరగా పూర్తిచేయాలని, పార్టీ నాయకులు కార్యకర్తలు అందుబాటులో ఉండి వారు చూపే సమస్యలకు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు. పార్టీ నాయకత్వము బాధ్యతతో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఉప్పుల ముత్యాలు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వీరస్వామి, సహాయ కార్యదర్శి జెట్ట రాములు, సిపిఐ మండల కార్యదర్శి జల్లి రాములు, ప్రజానాట్యమండ జిల్లా కార్యదర్శి చెక్క వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ భారతమ్మ, సిపిఐ మండల నాయకులు మారుపాక వెంకటేశం, సోలిపురం లింగారెడ్డి, జక్క దయాకర్ రెడ్డి, సుల్తాన్ పురుషోత్తం, రాజమణి పాల్గొన్నారు.

## గుర్తింపు సంఘం పత్రం ఇవ్వడానికి అడ్డంకి ఏమిటి?

### గుర్తింపు సంఘం అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య




ప్రజాపక్షం / శ్రీరాంపూర్ : సింగరేణిలో జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గెలిచి మూడు నెలలు గడుస్తున్నా, ఇప్పటికీ గెలిచిన యూనియన్‌కు గుర్తింపు సంఘం పత్రం ఇవ్వకపోవడానికి యాజమాన్యానికి, ప్రభుత్వానికి అడ్డంకులు ఏమిటని గుర్తింపు సంఘం అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య ప్రశ్నించారు. మంగళవారం ఆర్‌కె 6 గనిలో ఫిట్ కార్యదర్శి సంఘం సదానందం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. గనిని సందర్శించిన అనంతరం కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సమస్యల పరిష్కారం కొరకు గుర్తింపు సంఘం ఎల్లవేళలా ముందుంటుందని భరోసా ఇచ్చారు. గుర్తింపు సంఘం పత్రం ఇవ్వకపోవడం దురదృష్టకరమని, వెంటనే గుర్తింపు ధ్రువీకరణ ఆమోదం పత్రం ఇచ్చి పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యాజమాన్యం, ప్రభుత్వాలు ప్రతిఘటనలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గుర్తింపు పత్రం రాకపోయినా స్ట్రక్చరల్ మీటింగ్ జరగకపోయినా కార్మిక వర్గ దృక్పథంతో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కార్మికులకు అండగా నిలుస్తుందని అన్నారు. గుర్తింపు సంఘంగా గెలవగానే సింగరేణి సంస్థ భవిష్యత్తు రిత్యా వెంటనే కొత్త గనులపై దృష్టి సారించి వాటి సాధనకు కృషి చేశామని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలను త్వరితగతిన అర్హులకు ఇప్పించామని వివరించారు. గుర్తింపు పత్రం రాగానే యూనియన్ గుర్తింపు ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో పెట్టిన డిమాండ్లతో పాటు కార్మికులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలపై స్ట్రక్చరల్ మీటింగ్, జెసిసి మీటింగ్, ఏరియా కమిటీ, మైన్స్ కమిటీ, సేఫ్టీ కమిటీ మీటింగ్‌లలో సమస్యలు చర్చించి పరిష్కరిస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రె నర్సయ్య, కాంట్రాక్ట్ కార్మిక సంఘం రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ గౌరవ అధ్యక్షులు బాలసాని లక్ష్మణ్, ఫిట్ ఉపాధ్యక్షులు చిలుక రామచందర్, జాయింట్ కార్యదర్శి కారుకూరి నగేష్ , ఫిట్ కమిటీ నాయకులు వై. సంపత్ కుమార్, దుర్గయ్య, రాజేష్, అడ్డు శ్రీనివాస్, చంద్రమౌళి, మల్లేష్, రంగు రమేష్, బొజ్జ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయ భూములను ఆక్రమించిన వారిని జైల్లో పెట్టండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు



ప్రజాపక్షం/సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ప్రాంతంలో విశ్వనాథ దేవాలయానికి సంబంధించిన భూమి ఆక్రమణకు గురైందని సిపిఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. మంగళవారం సుభాష్ నగర్ సిపిఐ కార్మిక భవనంలో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. సిరిసిల్ల నడిబొడ్డున కోట్ల విలువైన భూముల్ని కొందరు రాజకీయ నాయకులు భూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సిపిఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశామని తెలిపారు. ఫిర్యాదు మేరకు ఎండోమెంట్, రెవెన్యూ సర్వేయర్లు సర్వే చేసి మూడు గంటల దేవాలయ భూమి ఆక్రమణకు గురైందని తేల్చారన్నారు. 27 ఫీట్ల రోడ్డును 40 ఫీట్ల రోడ్డుగా చూపించి అక్రమ లేఅవుట్ చేశారన్నారు. అక్రమంగా దేవుని భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకుని దేవాలయ భూములను కొల్లగొట్టారన్నారు. దేవుని భూములను కాపాడడానికి రాజకీయాలకతీతంగా పార్టీలకు అతీతంగా ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి భూకబ్జాలకు పాల్పడుతున్న నాయకుల పైన కేసులు పెట్టి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. భూమిని దేవునికి చెందేట్టు చూడాలన్నారు. అక్రమ లేఅవుట్ కు సహకరించిన మున్సిపల్ అధికారులను, సర్వేయర్లను సస్పెండ్ చేయాలని సిపిఐ పక్షాన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు సోమ నాగరాజు, మీసం లక్ష్మణ్ పాల్గొన్నారు.

## మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం



ప్రజాపక్షం/గరిడేపల్లి : భగత్‌సింగ్,రాజ్‌గురు,సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదామని పివైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.రవి, పిడిఎస్‌యు జిల్లా కోశాధికారి కామళ్ల ఉదయ్‌లు అన్నారు.మంగళవారం మండలంలోని వెలిదండ గ్రామంలో వల్లపుదాసు నరేష్ అధ్యక్షతన భారతస్వాతంత్ర్య కోసం ఉరికంభాన్ని ముద్దాడిన విప్లవ యువకిశోరాలైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి సభలో వారు పాల్గొని మాట్లాడారు.దేశంలో రోజురోజుకు మతోన్మాదం,ఫాసిజం పెరుగు తుందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు.దేశ పునర్‌నిర్మాణంలో యువత కీలకపాత్ర పోషించాలన్నారు. సామ్రాజ్యవాదానికి,పెట్టుబడిదారి విధానానికి,ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్వేచ్ఛా,స్వాతంత్ర్యం కోసం, దోపిడి,పీడనలేని నూతన వ్యవస్థ కోసం విద్యార్థులు,యువతీయువకులు భగత్‌సింగ్,రాజ్‌గురు,సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తితో తిరుగు బాటుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమలో పివైఎల్ డివిజన్ నాయకులు నరేష్, పిడిఎస్‌యూ విక్రమ్,శ్రీను,మహేష్,చరణ్,వేణు,సాత్విక్,ఐఎఫ్‌టియూ,ఏఐకెఎంఎస్ నాయకులు కామళ్ల శ్రీను,మాశెట్టి అంజయ్య, సాంబయ్య,అరుణోదయ నాయకులు నగేష్ పాల్గొన్నారు.

## త్వరగా చిన్న కాళేశ్వరం పనులు



ప్రజాపక్షం/కాళేశ్వరం: చిన్న కాళేశ్వరం పంప్ హౌస్ మరమ్మత్తు పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మహాదేవపూర్ మండలంలోని, బీరాసాగర వద్ద చేపట్టిన చిన్న కాళేశ్వరం పంప్ హౌస్ మరమ్మత్తు పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 5 మండలాల సంబంధించి సుమారు 45 వేల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకు అవకాశం ఉన్నట్లు చెప్పారు. పంప్‌హౌస్‌లో ఉన్న మూడు మోటార్ల మరమ్మతులు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ పంప్ హౌస్ ద్వారా మందిరం,ఎర్ర చెరువులకు సాగు నీటి సరఫరా ఉంటుందన్నారు. 65 శాతం పనులు పూర్తి కాగా, మిగిలిన 35 శాతం పనులు పూర్తి చేయాల్సి ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.రానున్న వానా కాలం వరకు పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అంతకు ముందు మహాదేవపూర్ మండల కేంద్రంలోని ఇరిగేషన్ కార్యాలయంలో ప్రాజెక్టు పనులపై ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈలు యాదగిరి, తిరుపతిరావు ఏఈ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు...

### కమిషనరేట్ స్థాయి నేర సమీక్ష సమావేశంలో సిపి మొహంతి




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం కమిషనరేట్‌లోని అన్ని విభాగాల అధికారులు, పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో సిపి అభిషేక్ మొహంతి రానున్న లోక్ సభ నిర్వహణతో పాటు, నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా సిపి మాట్లాడుతూ అధికారులందరికీ పలు కీలక సూచనలు చేశారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున 05 అంతర జిల్లా చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, వాటిలో ఉండే సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలన్నారు. వారికి మౌలిక వసతులైన త్రాగునీరు, రాత్రి సమయాల్లో సిబ్బంది కనిపించేలా లైటింగ్, రోడ్డుపై వచ్చే వాహనదారులకు కనిపించేలా రిఫ్లెక్టింగ్ జాకెట్లు ధరించి విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెక్‌పోస్టులు పనితీరుపై ఎప్పటికప్పుడు దృష్టిసారించాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద వాహన తనిఖీలు క్షుణ్ణంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే సంఘ విద్రోహ వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే బైండ్ ఓవర్ కాబడి గడువు ముగిసిన వారిని తిరిగి బైండ్ ఓవర్ చేయాలన్నారు. ఫ్లాగ్ మార్చ్ సమయాల్లో ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే జరిగే పరిణామాలను వివరించే సమావేశాల్లో ఆయా ప్రాంతాల్లో ఉండే ట్రబుల్ మొంగెర్స్‌ని ఉండేలా చూసుకోవాలన్నారు. పలు రాజకీయ పార్టీలు నిర్వహించే ప్రచార సమావేశాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని, ముఖ్యంగా వారి సమావేశం నిర్వహించుకునే సమయం, ర్యాలీ వెళ్లే మార్గం, వారి సమావేశం నిర్వహించే సమయం, ర్యాలీ వెళ్లే మార్గం, ఎంత మందితో నిర్వహిస్తున్నారనే సమాచారం తెలుసుకుని తదనుగుణంగా ఎటువంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలన్నింటినీ సంబంధిత స్టేషన్ల అధికారులు స్వయంగా పరిశీలించాలన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే దృష్టికి తీసుకురావాలన్నారు.

**పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి**

కమిషనరేట్ వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు, అందుకు గల కారణాలను సిపి తెలుసుకున్నారు త్వరితగతిన కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వారెంట్లను, ముఖ్యంగా భౌతిక నేరాలకు సంబంధించిన వాటిని అమలయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల నియమావళి అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని, అధికారులందరికీ అవగాహన కల్పించారు. ఎటువంటి ఉల్లంఘనైనా సరే సంబంధిత సెక్షన్ల ఆధారంగా కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి శాంతి భద్రతలు ఎ.లక్ష్మి నారాయణ, ఏసిపిలు నరేందర్, వెంకటరమణ, శ్రీనివాస్ (ఎస్‌బి), మాధవి, విజయ్ కుమార్‌లతో పాటుగా ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తనిఖీ

ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను త్రైమాసిక తనిఖీలలో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో మంగళవారం హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్ట్రాంగ్ రూములలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను, వాటికి సంబందించిన రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. హన్మకొండ జిల్లాకు సంబంధించిన స్ట్రాంగ్ రూములలో భద్రపరిచిన ఈవిఎంల కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వివి ప్యాట్ల గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. తనిఖీల అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో హన్మకొండ జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ సీల్ వేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీఓలు వెంకటేష్, నారాయణ,తహశీల్దార్లు విజయ్‌కుమార్, భాస్కర్, కలెక్టర్ ఏఓ సత్యనారాయణ, ఎన్నికల విభాగం నాయబ్ తహశీల్దార్లు సంతోష్, శ్యామ్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మణి, శ్రీనివాస్, శ్యామ్ పాల్గొన్నారు.

## వృత్తి విద్యా కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాపక్షం/కోదాడ: తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ ఒకేషన్ ఎడ్యుకేషన్ ద్వారా వృత్తి విద్యా సర్టిఫికేట్ కోర్సులకు 2023/2024 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కోదాడ లక్ష్య ఎడ్యూకేషన్ అకాడమి కో ఆర్డినేటర్ అనంతుల సతీష్ మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. తమ అకాడమిలో కోర్సులు ల్యాండ్ సర్వేయర్ ఆరునెలలు, బ్యూటిషియన్ 3 నెలలు, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ 9 నెల లు కోర్సులకు అడ్మిషన్లు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు, విద్యార్థిని,విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైనవారితో పాటు ఆపై విద్యనభ్యసించిన వారందరికి అవకాశం ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ల్యాండ్ సర్వేయర్ కోర్సులకు , బ్యూటిషియన్, ప్రీ ప్రై మరీ టీచర్ ట్రైనింగ్ కోర్సులకు మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు. అడ్మిషన్లకు చివరి తేదీ 20 తేదీ అని తెలిపారు. 9542107771, 7981528312 సెల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

## రెండు రాష్ట్రాల్లో ఎన్‌కౌంటర్లు

(మొదటి పేజీ తరువాయి)

వ్యాప్తంగా ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ విధ్వంసకర చర్యలకు పాల్పడాలనే లక్ష్యంతో ప్రాణహిత నది దాటి తెలంగాణ మీదుగా గడ్చిరోలికి ప్రవేశించినట్లు సోమవారం మధ్యాహ్నం పోలీసులు సమాచారం అందిందని ఎస్‌పి నీలోట్‌పాల్ తెలిపారు. గడ్చిరోలి పోలీస్ యూనిట్‌కు చెందిన ప్రత్యేక పోరాట దళం, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన తక్షణ చర్య బృందం సహా సి–60కి చెందిన బహుళ బృందాలను ఎన్‌కౌంటర్ స్థలికి పంపామన్నారు. అయితే సి–60కి చెందిన ఒక బృందం మంగళవారం ఉదయం రేపనపల్లె సమీపంలోని కోలమార్కలో గాలింపు చర్యలు కొనసాగిస్తుండగా నక్సల్స్ ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారన్నారు. దీంతో భద్రతా బలగాలు కూడా ఎదురుకాల్పులు చేశారన్నారు. కాల్పుల అనంతరం ఆ ప్రాంతంలో పరిశీలించగా నలుగురు మావోయిస్టుల మృతదేహాలు బయటపడ్డాయని, వారి తలలపై రూ. 36 లక్షల నగదు రివార్డు కలిగి ఉందన్నారు. అదే విధంగా ఒక ఎకె–47 తుపాకీ, రెండు దేశీయ పిస్తోళ్లు, మావోయిస్టు సాహిత్యం, ఇతర వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**మృతులు తెలంగాణ మావోయిస్టు పార్టీ నేతలు**

మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్ సందర్భంగా గుట్టల్లో మృతి చెందిన నలుగురు మావోయిస్టులు తెలంగాణ ప్రాంతానికి చెందిన వారిగా మహారాష్ట్ర పోలీసులు గుర్తించారు. ఇందులో కొమరంబీం, మంచిర్యాల ఏరియా కార్యదర్శి, డివిసి సభ్యులు వర్గీస్, ఇంద్రవెల్లి ఏరియా కార్యదర్శి, డివిసి సభ్యులు మర్గాతు, కమిటీ సభ్యులు రాజు, వెంకటేష్ ఉన్నారు. వర్గీస్, మర్కాతు మావోయిస్టు అగ్రనేతలుగా, వీరిపై రూ.36లక్షల రివార్డు ఉన్నట్లు, ఇరువురిపై మహారాష్ట్రంతోపాటు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నట్లు మహారాష్ట్ర పోలీసులు తెలిపారు.

**ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు హతం**

ఛత్తీస్‌గఢ్ దంతెవాడ జిల్లాలో కూడా మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగింది. పురంగల్, గంపూర్ గ్రామాల్లోని అటవీ సమీపంలో ఉదయం భద్రతా బలగాలు, నక్సల్స్‌కు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. బలగాలు బృందం సంయుక్తంగా నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్ కొనసాగిస్తుండగా ఎన్‌కౌంటర్ జరిగినట్లు దంతెవాడ ఎస్‌పి గౌరవ్ తెలిపారు. నక్సల్స్ సంచరిస్తున్నారన్న సమాచారంతో ఆపరేషన్ ప్రారంభించామన్నారు. ఎదురు కాల్పుల అనంతరం మహిళ, పురుష మావోయిస్టు మృతదేహం బయటపడిందన్నారు. రెండు ఆయుధాలు, కొన్ని పేలుడు పదార్థాలు, ఇతర వస్తువులు కూడా లభ్యమయ్యాయన్నారు. మరికొంత మంది నక్సల్స్ కూడా గాయపడ్డారని చెప్పారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు ఫ్లాగ్ మార్చ్

ప్రజాపక్షం/నల్లగొండ : రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా, ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించుకునెలా వారిలో నమ్మకం, భరోసా, భద్రత కలిగించేలా జిల్లా పోలీసు ఐటిబీపీ కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ కవాతు నిర్వహించడం జరుగుతుందని జిల్లా అడిషనల్ ఎస్పీ రాములు నాయక్ తెలిపారు. పట్టణ కేంద్రంలో జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ కవాతును స్థానిక వన్ టౌన్ పరిధిలో గల పలు ప్రాంతాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛగా పారదర్శకంగా ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగించాలన్నారు. పోలీసులు, కేంద్ర బలగాలు కేవలం బందోబస్తు మాత్రమే కాకుండా డబ్బు, మద్యం, ఇతర విలువైన వస్తువులు అక్రమ రవాణా అరికట్టేందుకు చెక్ పోస్టుల్లో పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి, ఎస్‌బి డిఎస్‌పి రమేష్, సిఐలు సత్యనారాయణ,డానియల్,కరుణాకర్, ఎస్‌ఐలు శంకర్, నాగరాజు, సిబ్బంది, కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president Palla Venkat Reddy, Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 Editor : Makkena Subbarao, Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com